


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 355 | సోమవారం | 16-06-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00



## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

### 'స్థానిక ఎన్నికల' నిర్వహణపై చర్చ!

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో 'స్థానిక సంస్థల' ఎన్నికలపై చర్చించి, ఎన్నికల తేదీలపైన ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్టు తరువాయి 2లో

### సర్కార్ స్కూల్ విద్యార్థులకు

# అత్యాధునిక సాంకేతిక బోధన

- ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం
- జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రముఖ సంస్థలతో అవగాహన ఒప్పందం
- నీట్, జెఇఇ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధంతో పాటు కోడింగ్‌లోనూ ఉచిత శిక్షణ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను అందించాలన్న లక్ష్యంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ పరస్పర అవగాహన ఒప్పందం( ఎంఒయు) కుదుర్చుకున్నది. ఇంటర్ విద్యార్థులకు నీట్, జెఇఇ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధం చేయడంతో పాటు కోడింగ్‌లో కూడా ఉచిత శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులోభాగంగానే పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నది. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రముఖ ఎన్‌జిఒ తరువాయి 2లో



## కూలిన హెలికాప్టర్

- పైలెట్ సహా ఏడుగురు దుర్మరణం
- ప్రతికూల వాతావరణంతో ప్రమాదం
- చార్‌ధామ్ యాత్రా మార్గంలో రెండురోజులు హెలికాప్టర్ సేవలు నిలిపివేత

**రుద్రప్రయోగ్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయి 241 మంది ప్రయాణికులు, సిబ్బంది, మరో 30 మేరకు ఇతరులు ప్రాణాలు కోల్పోయిన ఘటన మరవక ముందే తాజాగా మరో ఘటన జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ క్షేత్రం నుంచి ప్రయాణికులతో బయలుదేరిన హెలికాప్టర్ ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తడంతో గౌరికుండ్ అడవుల్లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి, పైలట్ సహా ఏడుగురు మరణించారు. మరణించిన ఏడుగురు మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు. ఆర్యన్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న బెల్ 407 హెలికాప్టర్ కేదార్‌ఘాటిలోని గౌరీకుండ్, త్రిజుగి నారాయణ్ మధ్య కూలిపోగా వెంటనే పెద్ద ఎత్తున తరువాయి 12లో



## గోదావరిలో ఐదుగురు జలసమాధి

- నాలుగు మృతదేహాల వెలికితీత
- మరొకరి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు
- నిర్మల్ జిల్లా బాసరలో విషాదం
- మృతులంతా హైదరాబాద్ వాసులే

ప్రజాపక్షం/బాసర

నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగిన ఐదుగురు జలసమాధి అయ్యారు. వారిలో నలుగురి మృతదేహాలను తరువాయి 2లో



## విద్యార్థుల భవితే రాష్ట్ర భవిష్యత్తు

- మెరుగైన విద్య కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం
- విక్టోరియా మెమోరియల్ స్కూల్‌కు రూ.5 కోట్లు నిధులు
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

ప్రజాపక్షం/హైదరాబాద్ / రంగారెడ్డి

విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తున్నదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్ కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ ఆర్ఫన్స్‌హోమ్‌లో తరువాయి 2లో

### ఈ నెలాఖరులోగా

## స్థానిక సంస్థల షెడ్యూల్

- ముందుగా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు
- ఆ తరువాతే పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలు
- నేటి కేబినేట్ సమావేశంలో మరింత స్పష్టత
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి



ప్రజాపక్షం/ఖమ్మం


ఈ నెలాఖరికి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలవుతుందని రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముందుగా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఆదివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఏదులాపురం, మున్సిపాలిటీ, కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల పరిధిలోని కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరువాయి 2లో




## ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఎదురుదాడి

- పలుచోట్ల గైడెడ్ బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం
- 10 మంది మృతి, మరో 200 మందికి గాయాలు
- ఐదో తరానికి చెందిన ఎఫ్- 35 ఇజ్రాయెల్ ఫైటర్ జెట్ కూల్చివేత

**టెహ్రాన్ :** ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య మూడోరోజు కూడా యుద్ధం కొనసాగింది. మస్కట్‌లో అమెరికా–ఇరాన్ మధ్య చర్చల ప్రక్రియను రద్దుచేసిన ఇరాన్ దాడులు ఉద్ధృతం చేసింది. గైడెడ్ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై పలుచోట్ల దాడులు చేసింది. ఈ దాడుల్లో 10 మంది మరణించారు. మరో 200 మంది గాయపడ్డారు. సెంట్రల్, నార్త్రన్ ఇజ్రాయెలీ ప్రాంతాలలో ఇరాన్ దాడులు చేసింది. ఐదో తరానికి చెందిన ఎఫ్–35 ఇజ్రాయెల్ ఫైటర్‌జెట్‌ను కూల్చివేసింది. వరుసగా తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## జి–7 సదస్సులో టారిఫ్‌లు, ఉక్రేన్ ప్రధానాంశాలు



**ఒట్టావా:** కెనడాలో మూడురోజులపాటు జరిగే 51వ జి–7 శిఖరాగ్ర సదస్సు ఆదివారంనాడు లాంఛనంగా ప్రారంభ మైనప్పటికీ కీలకమైన అధికారిక సమావేశాలు సోమ, మంగళవారాలలో జరుగుతాయి. ఆల్బెర్టా కననస్కిస్‌లో సదస్సుకు బ్రిటన్, జర్మనీ, ఇటలీ, కెనడా, అమెరికా ఫ్రాన్స్,జపాన్ దేశాల నాయకులందరూ 16,17 తేదీలలో హాజరవుతారు. ఆదివారంనాడు మాత్రం మొదటిరోజు లాంఛనపూర్వకమైన ఆదానప్రదానాలు కొనసాగాయి. మిగిలిన రెండు రోజులూ ట్రంప్ విధించిన సుంకాల అల్లకల్లోలం గురించి, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం, శాంతి చర్చల స్తంభన సమస్య, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో పరిస్థితుల గురించి నాయకులు ప్రధానంగా చర్చిస్తారు. ఆర్థికపరమైన ఆటంకాలను తొలగించుకోవడానికి ఈ దేశాల నాయకులు పరస్పరం ద్వైపాక్షిక సమావేశాలు ఎక్కువగా నిర్వహించే అవకాశం ఉందని టాస్ వార్తాసంస్థ పేర్కొంది.

## గాజాలో ఆహార కేంద్రం వద్ద ఐడిఎఫ్ కాల్పులు

ఎనిమిదిమంది పాలస్తీనియన్లు మృతి

**ఖాన్‌యూనిస్:** గాజాలో ఇజ్రాయెల్ అమానుష ఘాతుకాలు అంతులేకుండా కొనసాగుతున్నాయి. అమెరికా మద్దతులో గాజాలో నిర్వహిస్తున్న ఆహార,మానవతా సహాయ కేంద్రంవద్ద గుమిగూడిన పాలస్తినా ప్రజలపై ఇజ్రాయెల్ సైనిక దళాలు వరుసగా ఆదివారంనాడు కూడా కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో తొమ్మిదిమంది ప్రజలు మరణించారు. ఆహారం, ఇతర వస్తువులు తీసుకోవడానికి అక్కడికి వచ్చిన వారు భారీసంఖ్యలో గాయాలకు గురయ్యారు. డజన్లసంఖ్యలో ప్రజలు గాయపడ్డారని వార్తాసంస్థలు వెల్లడించాయి. 21 నెలలుగా గాజాలో యుద్ధం కొనసాగుతోంది. అక్కడి ప్రజలు పూర్తిగా ఇళ్ళు కోల్పోయారు. ఇరవైలక్షలమంది ప్రజలు అంతర్జాతీయంగా అనేక దేశాల నుండి వచ్చే సహాయంమీదనే ప్రధానంగా మనుగడ సాగిస్తున్నారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ రాడికల్ సంస్థ సభ్యులు ఇజ్రాయెల్‌పై సామూహిక దాడిచేసి రెచ్చగొట్టి ఈ మారణహోమానికి తెరతీశారు. ఆనాటి హమాస్ దాడుల్లో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు మరణించగా తర్వాత ఐడిఎఫ్ చేస్తున్న యుద్ధంలో 618 రోజులుగా 69 వేలమంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 70 శాతం మంది పిల్లలు, మహిళలే ఉన్నారు. ఇజ్రాయెల్, అమెరికాకు చెందిన ఒక బృందం నిర్వహిస్తున్న గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ప్రజలపై ఐడిఎఫ్ ఈ కాల్పులకు పాల్పడింది. ఈ సహాయ కేంద్రాలవద్ద దాదాపుగా ప్రతిరోజూ కాల్పులు జరుగుతున్నాయి. గతనెలలో ఈ ఫౌండేషన్ 400 కేంద్రాలను తెరిచింది. అప్పటినుండి ప్రతిరోజూ ఈ కేంద్రాలవద్ద కాల్పులు జరుగుతున్నాయి. మరణాలు సంభవిస్తున్నాయి. ఐతే ప్రజలు తమమీదకు దాడికి వస్తున్నారన్న భావనతో వార్నింగ్ షాట్స్ చేస్తున్నామని ఐడిఎఫ్ సైనికులు సాకులు చెబుతున్నారు.

# నో కింగ్స్ ఇన్ అమెరికా

### పలు నగరాల్లో లక్షలమంది ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు




**వాషింగ్టన్ :** అమెరికా సైన్యం ఆవిర్భవించి 250 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆర్మీ డే సెలబ్రేషన్స్ ఒకవైపు జరుగుతుండగా మరోవైపు అమెరికాలో ఐ సి ఇ (ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) విధానాలు, దాడులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు ఉప్పెనలా ఎగసిపడ్డాయి. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దంపతులు, ఇతర సాయుధబలగాల అధికారులు ఒకవైపు ఆర్మీ డే సెలబ్రేషన్స్‌లో నిమగ్నమై ఉండగా మరోవైపు ట్రంప్ అనుసరిస్తున్న ఏకపక్ష, మొండి విధానాలకు వ్యతిరేకంగా అమెరికా అంతటా ఆదివారంనాడు కూడా వందలసంఖ్యలో భారీ ప్రదర్శనలు కొనసాగాయి. లక్షలమంది ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే తమ లక్ష్యమని 61 ఏళ్ళ వయసుగల నర్సు కరేన్ ట్రైస్ట్ ఫిలిడెల్ఫియాలో ప్రదర్శన సందర్భంగా మీడియాతో అన్నారు. ట్రంప్ ఉద్యోగాల్లో కోతలు విధించారని, నిధుల కేటాయింపులను తగ్గించేశారని ప్రదర్శకులు విమర్శించారు. వాషింగ్టన్ డి.సిలో అత్యంత అరుదైన పద్ధతులలో ఆర్మీ డే సెలబ్రేషన్స్ జరుగుతుండగా రెండోవైపు ఈ నిరసనలజ్వాల రేగింది. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానాలపై తీవ్ర వ్యతిరేకత సర్వత్రా వ్యక్తం అవుతోంది. చట్టసభ సభ్యులు, వివిధ సంఘాలకు చెందిన నాయకులు, ఈ ప్రదర్శనల సందర్భంగా ట్రంప్ వ్యతిరేక ప్రసంగాలు చేశారు. న్యూయార్క్, వాషింగ్టన్ డి.సి, లాస్ ఏంజెల్స్, ఫిలిడెల్ఫియా, హూస్టన్, డెన్వర్, చికాగో, వెస్ట్‌పామ్ బీచ్ తదితర అనేక ప్రాంతాలలో ఈ ప్రదర్శనలు జరిగాయి.

''నో కింగ్స్ ఇన్ అమెరికా'' అని నినాదాలు చేస్తూ ప్రజలు వీధుల్లోకి వచ్చి అమెరికావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. లాస్‌ఏంజెల్స్‌లో వారం రోజులక్రితం ప్రారంభమైన వలస వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ప్రారంభమైన నిరసనలు అమెరికా అంతటా రాజుకుని కొనసాగుతున్నాయి. ''ఇక్కడ రాజులు ఎవరూ లేరు'' అంటూ ప్రజలు నినాదాలు చేశారు. నో కింగ్ ఇన్ అమెరికా అనే ప్లకార్డులను భారీసంఖ్యలో ప్రజలు ప్రదర్శిస్తున్నారు. మరోవైపు లాస్‌ఏంజెల్స్‌లో 20 వేలమందికిపైగా ప్రజలు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

వారిని చెదరగొట్టి వాహనాల రాకపోకలను క్లియర్ చేసేందుకు పోలీసులు ప్రదర్శకులపై బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. లాస్ ఏంజెల్స్‌లో పౌరహక్కుల సం ఘం సభ్యుడు జోస్ అజెట్‌క్లా మా ట్లాడుతూ, ట్రంప్ అనుసరించిన ఇమ్మిగ్రేషన్, వలస విధానాలే తనను వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలో పాల్గొనేట్టు చేశాయన్నారు.

### ట్రంప్ బర్త్‌డే,ఆర్మీ డే

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 79 ఏళ్ళు వయసు పూర్తిచేశారు. శనివారంనాడు ఆయన జన్మదినం జరిగింది. ఆర్మీ డే ఉత్సవాలు కూడా రెండు రోజులపాటు జరిగాయి. ఆర్మీడే జరుగుతున్న సమయం లోనే నిరసనలూ రెండోవైపు కొనసాగాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ఈ సందర్భంగా ట్రంప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం గా ట్రంప్ మాట్లాడుతూ, దేశంలో ఆర్మీ డే సెలబ్రేషన్స్ సమీపంలో ఎలాంటి నిరసన ప్రదర్శనలు జరిగినా కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. దేశం లో వందలసంఖ్యలో ప్రదర్శనలు జరుగుతున్నాయనీ, తాము లక్షలాదిమందిగా వీధుల్లోకి వచ్చామని నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నారు. ఫిలిడెల్ఫియాలో వేలాదిమంది ప్రజలు లవ్ పార్కులో సమీకృతమయ్యారు. కాగా ట్రంప్ యంత్రాం గం రోజులు మూడు వేలమంది వలస ప్ర జలను అరెస్టు చేయాలని లక్ష్యంగా చేసుకోవడంతో అనేకమంది వలస ప్రజలు భ యంతో వ్యవసాయక్షేత్రాలలో, పంటలు పండించే పొలాలలో రహస్యంగా దాక్కుంటున్నారు.

## గాజాలో యుద్ధం త్వరలో ముగుస్తుంది:ట్రంప్



**వాషింగ్టన్ :** గాజాలో యుద్ధం త్వరలో ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. గాజాలో ఇజ్రాయెల్–హమాస్ రాడికల్స్ మధ్య యుద్ధం దాదాపు అంతిమదశకు వచ్చిందని అట్లాంటిక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. బందీలలో చాలామంది ఇప్పటికే వెనక్కు వచ్చారని అన్నారు. మధ్యవర్తులు చేసిన ప్రతిపాదనలను హమాస్ తోసిపుచ్చినందువల్లనే కాల్పుల విరమణ ఒప్పందం పూర్తయిన తర్వాత మార్చి 18వ తేదీన తాము తిరిగి గాజాలో యుద్ధం ప్రారంభించాల్సి వచ్చిందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. హమాస్ వద్ద ఉన్న బందీలందరినీ విడుదల చేయాలని అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ యుద్ధం తిరిగి ప్రారంభం కావడానికి అమెరికా–ఇజ్రాయెల్ ప్రభుత్వాలే కారణమని హమాస్ రాడికల్స్ ప్రత్యారోపణలు చేశారన్నారు.

గాజాలో హమాస్‌ను ఓడించేందుకు ప్రారంభించిన ''ఆపరేషన్ గిడియాన్స్ ఛారియట్స్'' కీలక దశకు చేరుకుందని మే ఎనిమిదోతేదీన ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. నేతన్యాహూ కార్యాలయం చెప్పిన ప్రకారం, ఇజ్రాయెల్ బలగాలు గాజాస్ట్రిప్ లోలోపలికి కొత్త ప్రాంతాలలోకి దూసుకుపోతున్నాయి, హమాస్‌పై నిర్ణ యాత్మకమైన దాడులు చేస్తున్నాయి, కీలకమైన ప్రదేశాలను ఆక్రమించుకున్నాయి. 2023 అక్టోబరు రెండోవారంలో గాజాలో ప్రారంభమైన యుద్ధం ఇజ్రాయెల్ లెక్క ప్రకారం ఆదివారంనాటికి 618వ రోజులు పూర్తిచేసుకుంది. ఇప్పటివరకూ 55 వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ ఉన్నతస్థాయి కమాండర్లు, నాయకులు హతులయ్యారు. మరో 14 వేలమంది ప్రజల మృతదేహాలు శిథిలాల్లో కూరుకుపోయి ఉన్నాయి. మార్చి 18 నుండి యుద్ధం తిరిగి ప్రారంమైన తర్వాత ఇప్పటివరకూ 4,800 మంది పైగా పాలస్తీనియన్లు మరణించారు. ఆహారంకోసం సహాయ కేంద్రాలకు వెళుతున్న ప్రజలను కూడా కాల్చి చంపుతున్నారు.

## ఇరాన్ ఎదురుదాడి

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ దాడుల్లో రెండో ఫైటర్ జెట్‌ను కూల్చివేసింది. ఐతే ఫైటర్‌జెట్‌లో ఉన్న పైలట్ ఏమైపోయాడో తెలియదని ఆ విషయాన్ని కూడా తాము తెలుసుకుంటున్నామని ఇరాన్ అధికారులు చెప్పారు. దాడుల అనంతరం ఇజ్రాయెల్ అత్యవసర సేవల విభాగం ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ దాడుల్లో పదిమంది మరణించారని పేర్కొంది. ఆదివారం తెల్లారకముందే 2.30 గంటలకు ఇరాన్ క్షిపణులు సెంట్రల్ సిటీ బ్యాట్‌యామ్‌పై దాడి చేశాయి. ఈ దాడుల్లో ఒక నివాసిత భవనం పూర్తిగా ధ్వంసమైంది. ఆరుగురు నివాసితులు మరణించగా మరో నలుగురు శిథిలాల్లో కూరుకుని మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. వారి మృతదేహాలకోసం సహాయబృందాలు గాలిస్తున్నాయి. మృతుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. క్షిపణి దాడులతో ఇజ్రాయెల్ అంతటా సైరన్లు మోగాయి. చాలామంది ఆ ప్రాంతంలో ప్రజలు సురక్షిత కేంద్రాలకు తరలివెళ్ళారు. రెహోవోత్, రమత్‌గన్ నగరాలపై కూడా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. రెండు రోజులుగా ఇజ్రాయెల్ చేసిన దాడులఫలితంగా ఇరాన్‌లో 80 మంది పౌరులు మరణించారు. ఉన్నతస్థాయి సైనిక అధికారులు శాస్త్రవేత్తలతోపాటు 12 మంది ప్రముఖులు మరణించారు. 800 మంది గాయపడ్డారు.



**ఇరాన్ వరల్డ్ గ్యాస్‌ఫీల్డ్, రక్షణశాఖ కార్యాలయంపై దాడి**

ఇరాన్ దక్షిణప్రాంతంలోని బుషెర్‌లో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్దదైన గ్యాస్ ఫీల్డ్‌లోని సౌత్‌పార్ ఫేజ్–14 పై ఆదివారంనాడు ఇజ్రాయెల్ తాజా దాడులు చేసింది. ఇరాన్ రక్షణశాఖ ప్రధాన కార్యాలయంపై కూడా దాడి చేసింది. మొదటిసారి ఇరాన్‌కు చెందిన అతిపెద్ద వ్యవస్థపై దాడికి దిగింది. దీంతో 12 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి కార్యకలాపాలు స్తంభించిపోయాయి. గల్ఫ్ మధ్యభాగంలో ఉన్న ఈ అతిపెద్ద గ్యాస్‌ఫీల్డ్‌ను ఇరాన్, ఖతార్ దేశాలు సంయుక్తభాగస్వామ్యంలో నిర్వహిస్తున్నాయి. ఈ రెండు దేశాలకూ ఈ గ్యాస్‌ఫీల్డ్‌లో సమాన పెట్టుబడులు ఉన్నాయి. ఈ గ్యాస్ ఫీల్డ్‌పై దాడి చేసిన సందర్భంగా ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడిఎఫ్) ఒక మ్యాప్‌ను విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో జమ్మూ కశ్మీరును పాకిస్థాన్‌లో అంతర్భాగంగా తప్పుగా చూపించింది. ఈ గ్యాస్‌ఫీల్డ్‌లో 3,700 చదరపు కి.మీ భూభాగం ఇరాన్‌దే. దాదాపు 9,700 చ.కి.మీ విస్తీర్ణంలో ఉన్న ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 51 ట్రిలియన్ క్యూబిక్ మీటర్ల సహజవాయు నిక్షేపాలు ఉన్నాయని అంచనా. ఇందులో యాభై శాతం వాటి ఇరాన్‌దే. దీనిపై ఇరాన్ నేషనల్ ఆయిల్ రిఫైనరీ–నేచురల్ గ్యాస్ కంపెనీ ఒక ప్రకటన చేస్తూ తమ గ్యాస్‌ఫీల్డ్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలియజేసింది. దాడులకారణంగా సోమవారం నుండి భారీస్థాయిలో గ్యాస్ ధరలు పెరిగే ప్రమాదం ఉందని అంచనావేస్తున్నారు. ఒపెక్‌లో భాగంగా ఉన్న ఇరాన్ ప్రస్తుతం రోజుకు 3.3 మిలియన్ బ్యారల్స్ గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తోంది.




**ఎంత కాలమైనా యుద్ధానికి రెడీ:ఇరాన్**

ఎంతకాలమైనా ఇజ్రాయెల్‌తో యుద్ధం చేసేందుకు ఇరాన్ దేశం సిద్ధంగా ఉందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఆదివారంనాడు స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ వైమానిక ఇంధన వ్యవస్థలపై దాడులు చేస్తున్నట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ గనుక దాడులు కొనసాగిస్తే తామూ దాడులు ఉద్ధృతం చేస్తామని, దాడులు ఆపేస్తే తామూ దాడులు ఆపేస్తామన్నారు. ఇరాన్ చీఫ్ కమాండర్ ఆఫ్ ఆర్మీ మేజర్ జనరల్‌అమీర్ హతామీ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి శత్రువు దురాక్రమణను తిప్పికొడతామన్నారు. తనను ఈ అత్యున్నత పదవిలో నియమించిన ఇస్లామిక్ రివల్యూషనరీ నాయకుడు ఖమేనీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికే ఇరాన్ సైన్యం పూర్తిగా రంగంలోకి దిగిందని, శత్రువును చావుదెబ్బ తీస్తామని అన్నారు.

**భద్రతామండలికి ఇరాన్ లేఖ**

ఇరాన్ జాతీయ భద్రతను కాపాడుకుంటామని ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఆదివారంనాడు ప్రకటించారు. దౌత్యపరంగా తాము సరైన నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇజ్రాయెల్ దాడులు చేశాక ఇక అమెరికాతో చర్చలు లేవని, ఈ చర్చలు రద్దైపోయాయని చెప్పారు. మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలి దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, ఇజ్రాయెల్ ఉల్లంఘన చర్యలను వివరిస్తూ భద్రతామండలికి తాను ప్రత్యేకంగా ఒక లేఖరాసి పంపిచానని చెప్పారు. అంతర్జాతీయ అణునిఘా సంస్థ (ఐఎఇఎ) ఇరాన్‌పట్ల వివక్ష ప్రదర్శిస్తోందని విమర్శించారు.



**దాడిచేస్తే ఊహించని పరిణామాలు : ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

అమెరికా స్థావరాలపై దాడులు చేస్తే ఎన్నడూ ఊహించనివిధంగా అమెరికా తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తుందని ఇరాన్ సర్వాధినేత అయోతుల్లా అలీ ఖమేనీకి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. ''మీరు ఊహించలేరు, మా ఆస్తులకు, స్థావరాలకు నష్టం కలిగిస్తే దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటారు'' అని హెచ్చరించారు. ఇరాన్‌కు చెందిన ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్‌ఫీల్డ్‌పైన, ఆ దేశ రక్షణ కార్యాలయంపైన ఇజ్రాయెల్ దాడులు చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. ''మేం చాలా సులభంగా ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఒక ఒప్పందం చేయించగలం, ఈ రక్తపాతాన్ని అరికట్టగలం అని గుర్తుంచుకోండి'' అని ట్రూత్ సోషల్ మీడియాలో ఆయన పోస్టింగ్ పెట్టారు. ఇజ్రాయెల్‌ను రక్షించేందుకు సహకరిస్తే మధ్యప్రాచ్యంలో దాని మిత్రదేశాలకు ఉన్న సైనిక స్థావరాలపై దాడులు చేస్తామని ఇరాన్ శనివారంనాడు తీవ్ర హెచ్చరిక చేసింది. బ్రిటన్, అమెరికా,ఫ్రాన్స్ దేశాలకు తమ ప్రాంతంలో స్థావరాలపై దాడిచేస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ బఘూరీ శనివారంనాడు చేసిన హెచ్చరిక తర్వాత ఇరాన్ చమురుక్షేత్రంపై ఇజ్రాయెల్ దాడిచేసింది.

**కలిసి దాడి చేద్దాం రండి:నేతన్యాహూ**



ఇరాన్‌పై ఉమ్మడిగా దాడి చేద్దామని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నేతన్యాహూ ప్రతిపాదించారు. ఇరాన్ భారీ స్థాయిలో దాడులు చేస్తుందని ఊహిస్తున్న నేతన్యాహూకు ఆదివారంనాడు ఇరాన్ పెద్ద నష్టమే కలిగించింది. ఈ నేపథ్యంలో నేతన్యాహూ పైవిధంగా ప్రతిపాదించారు. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా అమెరికా అనేక చర్యలు తీసుకుంది. సిరియాలో పాతప్రభుత్వాన్ని కూల్చివేసి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇజ్రాయెల్ దాడులు చేయడానికి వీలుగా శాటిలైట్ సహాయంతోపాటు అన్ని రకాల ఆయుధాలు సమకూరుస్తున్నది. తన నౌకలను కూడా మధ్యప్రాచ్యం దిశగా నడిపిస్తున్నది.

## ఫాసిస్ట్ దాడికి వ్యతిరేకంగా 20న బంద్

లేఖలో తెలిపిన మావోయిస్టులు

**ప్రజాపక్షం/వైరా :** బిజెపి హిందూత్వ ఫాసిస్టు దాడిని ఖండిస్తూ ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ నెల20న బంద్ పాటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) పిలుపునిచ్చారు. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్ సుధాకర్, గౌతం భాస్కర్ తదితరులను క్రూరంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం జగన్ పేరుతో లేఖను విడుదల చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరుస దాడులు చేస్తూ మావోయిస్టులను హతమారుస్తుందని వారు తెలిపారు. శాంతి చర్చలకు వచ్చిన సుధాకర్‌ను సైతం హత మార్చారని వారు తెలిపారు. 2024 జనవరి నుండి ఆపరేషన్ కగారే పేరుతో దేశంలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో దమనకాండ కొనసాగిస్తున్నారని అన్నారు. అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు మాత్రమే కగారేను కొనసాగిస్తున్నారని మావోయిస్టు పార్టీ తెలిపింది. ఇప్పటికే 550 మందిని హత్య చేశారని, ఈ హత్యకాండను నిరసిస్తూ జరిగే బంద్‌ను రెండు తెలుగు రాష్ట్రాలతో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



## స్థానిక సంస్థల షెడ్యూల్

(మొదటి పేజీ తరువాయి)

మండల, జిల్లా పరిషత్ ఎన్నికల అనంతరం పంచాయితీ, మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతాయని, సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై మరింత స్పష్టతవస్తుందన్నారు. గ్రామాల్లో నాయకుల మధ్య ఐఖ్యత అవసరమని, కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం సాధించవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కారనికి ప్రాధాన్యత ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికలకు కేవలం పదిహేనురోజులు మాత్రమే సమయం ఉన్నందున్న చిన్నచిన్న లోటుపాట్లు సరిదిద్దుకుని ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలునిచ్చారు. రిజర్వేషన్ల ఆధారంగా గెలిచే అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం జరిగిందని, రైతు భరోసా పైకాన్ని వారం రోజుల్లో రైతులఖాతాల్లో జమచేస్తామన్నారు. కుంట మొదలుకుని ఎంత భూమి ఉంటే అంత మొత్తానికి రైతుభరోసా అందుతుందన్నారు. సన్నరకం ధాన్యానికి సంబంధించి బోనస్ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ చేయించుకోవడం కాదు, వాటిని నిర్మాణం పూర్తి చేయించాల్సిన బాధ్యత పార్టీ గ్రామనాయకులపై ఉందన్నారు. గెలుపే లక్ష్యాం గా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు.



## అత్యాధునిక సాంకేతిక బోధన

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలతో విద్యాశాఖ ఎంఒయు కుదుర్చుకున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన 'ఎడ్ టెక్' సదుపాయాలను అందించాలన్న యోచనతో నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ఎంఒయు చేసుకున్నది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, నర్సింహారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సిఇఒ జగదీష్‌బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కో ఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా ఎండి స్వాతి వాసుదేవన్ , పైజామ్ ఫౌండేషన్ ఫౌండర్ షోయబ్ దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సిఇఒ గాయత్రి నాయిర్‌లోబో తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో తెలంగాణలోని విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తుంది. రాష్ట్రంలో విద్యా నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు విద్యాశాఖ తెలిపింది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఆయా సంస్థలు ముందుకు వచ్చినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

### పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం

ఎక్‌స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేథ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌తో 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో ఐదువేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది. ఫిజిక్స్ వాలా ఇంటర్ విద్యార్థులకు నీట్, జెఈఈ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధం చేయనుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుంది. ఖాన్ అకాడమీ రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేయనుంది. అలాగే ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పై జామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్,కంప్యూటేషనల్ థింకింగ్‌పై శిక్షణను ఇవ్వనుంది. ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత,విద్యా అవకాశాలను మెరుగుపరుస్తుందని విద్యాశాఖ వెల్లడించింది.

## మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. ఈ నెలాఖరులో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రాబోతోందని,తొలుత ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో 'స్థానిక ఎన్నికల' పై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. మంత్రివర్గ సమావేశంలో స్థానిక ఎన్నికలపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. గత మంత్రివర్గంలోనే స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటారని బావించినప్పటికీ, సిఎం రేవంత్ రెడ్డి మాత్రం మరోసారి ( సోమవారం) జరిగే మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుందామని సూచించినట్టు తెలిసింది. అలాగే ఈ మంత్రివర్గ సమావేశంలో రైతుల సమస్యలు, రైతు భరోస తదితర అంశాలు కూడా చర్చకు రానుంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా పరిణామాలు కూడా చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు పంపిణీ చేస్తున్న 'సన్నబియ్యం' పథకంతో మంచి సానుకూల వాతావరణం నెలకొన్నదని ప్రభుత్వం బావిస్తుంది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పరిస్థితులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని, ప్రతిపక్ష పార్టీలకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్న ఇటువంటి సమయంలోనే ఎన్నికలకు వెళ్లాలని అధికార కాంగ్రెస్ యోచిస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే మంత్రివర్గంలో ముగ్గురికి అవకాశం కల్పించారు. అలాగే టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ప్రకటించారు. భారీగా ఐఎఎస్ అధికారులను బదిలీ చేశారు. కాగా మంత్రివర్గం సమావేశనంతరం హైదరాబాద్ శివారులోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించే 'రైతునేస్తం' కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రైతుభరోసా ప్రకటించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

## జలసమాధి

(మొదటి పేజీ తరువాయి)

వెలికి తీశారు. మరొకరి కోసం గోదావరి నదిలో ఈతగాళ్లు గాలిస్తున్నారు. మృతులంతా హైదరాబాద్ వాసులుగా గుర్తించారు. ఐదుగురు కూడా ఒకే కుటుంబానికి చెందిన వారుగా గుర్తించారు. వీరంతా హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, చింతల్ బజార్‌కు చెందిన వారని అధికారులు తెలిపారు. గోదావరిలో ఆదివారం రోజున ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారని తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మూడు కుటుంబాలు హైదరాబాద్‌లో నివాసముంటున్నాయి. దాదాపు 18 మంది బాసరలోని అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తుండగా ఐదుగురు గల్లంతయ్యారు. మృతులు రాకేష్(17), వినోద్(18), రుతిక్(22), మదన్(18), భరత్(21) గుర్తించారు. మరో యువకుడు గల్లంతయ్యాడు. అతని కోసం గాలిస్తున్నారు. గోదావరిలో తేలిన ఇసుక మెటల వద్దకు చేరుకుని స్నానాలు చేస్తుండగా లోతైన ప్రాంతంలో మునిగి చనిపోయారని పోలీసులు తెలిపారు. నాలుగు మృతదేహాలను వెలికితీశారు. మరొకరి ఆచూకీ లభించాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వి వరాలు సేకరించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతులను బయటకు వెలికి తీశారు. గోదావరి మొదటి ఘాట్ నుంచి అంబులెన్స్‌లో మృతదేహాలను బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా నాలుగు మృతదేహాలను వెలికితీశారని, ఇంకొకరు నీటిలోనే ఉన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మొత్తం 18 మంది విహార యాత్రగా అమ్మవారి దర్శనం కోసం బాసరకు వచ్చారని ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని పేర్కొంటున్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు, అధికారులు, స్థానిక నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య ద్వారానే మానవ వనరులు మెరుగుపడి తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడుతుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్యారంగానికి ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి బిడ్డ ప్రపంచంతో పోటీపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో 11,600 కోట్లతో 100 పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. విలువైన విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామన్నారు. విక్టోరియా మెమోరియల్ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు వెంటనే రూ. 5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ట్రాన్స్‌కోని సిఎస్ఆర్ ఫండ్స్ నుంచి ఈ కేటాయింపులు చేస్తున్నామన్నారు. నిధులు వెంటనే విడుదల చేస్తామని, ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన విక్టోరియా మెమోరియల్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపి మధు యాష్కీ గౌడ్ పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



## అరక పట్టి... పొలం దున్ని

### కూసుమంచిలో ఏరువాకకు మంత్రి పొంగులేటి శ్రీకారం

**పజాపక్షం/కూసుమంచి :** రైతు శ్రేయస్సు కోసం పాటుపడే ప్రభుత్వం ఈ ఇందిరమ్మ ప్రభుత్వమని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో జరిగిన ఏరువాక కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అరకకట్టి పొలం దున్నారు.

## 'సహాయనిధి పథకం' సరళతరం చేయాలి

### నిధి మంజూరు పరిమితిని ప్రభుత్వం ఎత్తివేయాలి
### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
### 84మంది లబ్ధిదారులకు రూ.32.25లక్షల విలువచేసే చెక్కులు అందించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** అత్యవసర పరిస్థితిలో సొంత ఖర్చులతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదవర్గాలకు ప్రభుత్వం ద్వారా అందించే ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని ప్రతి ఒక్కరూ అందుకునేవిధంగా సులభతరం చేయాలని, పథకం అమలులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్న 84మంది లబ్ధిదారులకు రూ.32.25లక్షల విలువచేసే చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అయన అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో 1505 మందికి రూ.3.16 కోట్ల విలువచేసే చెక్కులు అందించామని, 800 మందికి పంపిణీ కావాల్సివుందన్నారు. మరో 310 మంది రోగులకు నిమ్స్ ఆస్పత్రి ఎల్‌ఒసి ద్వారా ముందస్తు వైద్య ఖర్చులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. సిఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుదారులు కొన్ని ఆస్పత్రులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రాథమిక ఆమోదం విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలకు ఈ పథకంపై ఎలాంటి అవగాహన లేకపోవంతో దరఖాస్తుదారులు నష్టపోవాల్సి వస్తోందని, వీరిపై ప్రభుత్వం చేర్యాలకు సిఫారసు చేయాలని కోరారు. నిధి మంజూరులో ప్రభుత్వం పరిమితి విధించడం సరికాదని, తక్షణమే పరిమితి ఎత్తివేసి పూర్తి బిల్లును చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, వి.పూర్ణచందర్‌రావు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, నాయకులు యూసుఫ్, ధర్మరాజు, రామారావు, అప్పారావు, కూచిపూడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన గడువులోగా భూ సమస్యలు పరిష్కారం

### పదేళ్ల గోస వెళ్లబోసుకుంటున్న రైతులు
### 7,578 రెవెన్యూ సదస్సుల్లో 4.61లక్షల దరఖాస్తులు స్వీకరణ
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులతో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 3వ తేదీ నుంచి హైదరాబాద్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 561 మండలాల్లో 7,578 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, మానవతా దృక్పథంతో వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి అధికారులకు సూచించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15వ తేదీనాటికి అన్ని భూ సమస్యలను పరిష్కరించాలని ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. గత పదేళ్ల కాలంలో భూ సమస్యలకు సంబంధించి రైతులు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని మంత్రి చెప్పారు. ధరణి చట్టం వచ్చాక తమ ప్రమేయం లేకుండానే రైతులు భూ సమస్యల్లో చిక్కుకున్నారన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ధరణి కారణంగా ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారన్నారు. ప్రతిదానికి కోర్టు మెట్లు ఎక్కడమేతప్ప రైతుకు మరోదారి లేకుండా పోయిందన్నారు. దాదాపు గత రెండు నెలలుగా భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 50 ప్రాంతాల్లో తాను స్వయంగా పాల్గొనడం జరిగిందన్నారు. ఆసదస్సుల్లో రైతులు తమ గోసను ఆవేదనతో చెప్పుకోవడం తనను ఎంతో బాధకు గురిచేసిందని మంత్రి వివరించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా రైతులకు మేలు చేసేలా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి స్పష్టం చేశారు.

**శరవేగంగా భూ సర్వే..**

రాష్ట్రంలో తరతరాలుగా సర్వే చేయని, లేదా సర్వే రికార్డులు లేని ఐదు నక్షా గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన భూసర్వే శరవేగంగా సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో నక్షా గ్రామాలను గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సర్వే చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 413 నక్షా గ్రామాలకుగాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా గత నెల మూడవ వారం నుంచి సర్వేను ప్రారంభించామన్నారు.

## కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కగార్ ఆపరేషన్

### పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** దేశంలో కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ చేపట్టిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ భూపాలపల్లి 18వ పట్టణ మహాసభ ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాసభ ప్రాంగణంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సుభాష్ కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహాసభకు సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్రం ఎంతోమందిని పాశవికంగా హత్య చేస్తున్నదని అన్నారు. కార్పొరేట్ శక్తులకు దేశంలోని సహజ వనరులను కట్టబెట్టేందుకు, అడవులను వారికి అప్పగించేందుకు మావోయిస్టులను లేకుండా చేసేందుకే ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను వారికి దారాదత్తం చేస్తున్నదని విమర్శించారు.

కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృధా చేశారని, కాళేశ్వరం వల్ల ఉమ్మడి వరంగల్ భూపాలపల్లి జిల్లాలకు ఒక్క ఎకరానికి నీరు అందలేదని అన్నారు. ఎప్పటికైనా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని, భవిష్యత్తులో ప్రజల పక్షాన మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

**భూపాలపల్లి మున్సిపాలిటీపై ఎర్రజెండా ఎగరేద్దాం సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భూపాలపల్లి మున్సిపాలిటీపై ఎర్రజెండాను ఎగరవేద్దామని సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. చట్టసభలలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. భూపాలపల్లి పట్టణంలోని సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని మహాసభలో తీర్మానించారు. సిపిఐ కౌన్సిల్ సభ్యులు గురుజపెల్లి సుధాకర్‌రెడ్డి, జి.శ్రీనివాస్, మాతంగి రామ్ చందర్, కొరిమి సుగుణ, మాజీ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి, ఆసిఫ్ పాషా, తాళ్ల పోషం నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, 250 మంది డెలిగేట్స్ పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం కృషి

### రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/మందమర్రి :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా, మందమర్రి మండలం సండ్రన్‌పల్లిలోని కెఆర్ గార్డెన్స్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మండల తహసీల్దార్ సతీష్‌లతో కలిసి మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి నియోజకవర్గంలో సంవత్సరానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తామని చెప్పారు. నాలుగు సంవత్సరాల్లో ప్రతి నియోజకవర్గంలో 15 వేల ఇళ్లను అర్హులైన నిరుపేదలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 చదరపు గజాలలోపు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇంకా, లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 రాయితీ గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. గతంలో రూ.5లక్షల పరిమితి ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచామని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 2,500 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. మండలపరిషత్ అభివృద్ధి అధికారి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు 'ఫార్ములా ఈ -కార్ రేసింగ్' విచారణ

### ఎసిబి ముందు హాజరుకానున్న కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఫార్ములా ఈ కార్ రేసింగ్' కేసు దర్యాప్తులో భాగంగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సోమవారం ఉదయం ఎసిబి విచారణ ముందు హాజరుకానున్నారు. ఇటీవల 'కాళేశ్వరం కమిషన్ విచారణ' ముందు బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ హాజరవ్వగా, తాజాగా 'ఫార్ములా ఈ కార్ రేసు' కేసులో కెటిఆర్ విచారణకు హాజరుకానున్నారు. ఈ కేసులో ఇదివరకే ఎసిబి కెటిఆర్‌ను ప్రశ్నించిన విషయం తెలిసిందే. మరోసారి నోటీసులు జారీ చేయడంతో బిఆర్‌ఎస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. రాష్ట్రంలో కొంత కాలంగా పలు అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణ వేగం పెరిగింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిఆర్‌ఎస్ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇప్పటికే బిఆర్‌ఎస్‌లో ఆధిపత్యపోరు, అంతర్గత కుమ్ములాటలతో పార్టీశ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక వైపు కాళేశ్వరం విచారణ, మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసు, ఇంకోవైపు 'ఫార్ములా ఈ కార్ రేసింగ్' ఇలా వరుస విచారణలు జరగడం రాజకీయవర్గాల్లో కూడా చర్చనీయంశంగా మారింది.

**రూ.54.89 కోట్ల దుర్వినియోగంపై విచారణ :**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఫార్ములా ఈకార్ రేస్'లో రూ.54.89 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో కెటిఆర్ ఎ1 నిందితునిగా ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే జనవరి మాసంలో కెటిఆర్ స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు అధికారులు రికార్డ్ చేశారు.ఎ 2గా ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఎ3గా హెచ్ఎండిఎ బోర్డు మాజీ చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్.రెడ్డిని ఇదివరకే ఎసిబి అధికారులు విచారించిన విషయం తెలిసిందే. ఈ కేసులో కెటిఆర్‌ను మరోసారి విచారించనున్నారు.

## నీట్ – 2025 ఫలితాల్లో రికార్డ్‌లతో కొనసాగిన 'నారాయణ' విజయపరంపర

### తెలుగు రాష్ట్రాల్లో 1వ ర్యాంక్ (ఓపెన్ కేటగిరీ) నారాయణ క్లాస్‌రూమ్ విద్యార్థిదే
### ఆల్ కేటగిరీలో టాప్ 10లోపు 8 ర్యాంకులు నారాయణవే



**హైదరాబాద్ :** వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్–2025 ఆలిండియా ఆల్ కేటగిరీలలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మృణాల్ కిషోర్ ఝా 4వ ర్యాంక్, కేశవ్ మిట్టల్ 7వ ర్యాంక్, సౌమ్యశర్మ 14వ ర్యాంక్, కె.జీవన్‌సాయి కుమార్ 18వ ర్యాంక్, రూపయన్ పాల్ 20వ ర్యాంక్‌తో సంచలన విజయం అందుకున్నారు. వీటితోపాటు 35, 47, 49, 59, 66, 70, 71, 73, 75, 77, 80, 87, 93, 94, 95 వంటి 100లోపు 22 ర్యాంకులు, 1000లోపు 85 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవశం చేసుకున్నారు. అలాగే ఆలిండియా అన్ని కేటగిరీల్లో 1, 2, 3, 3, 4, 4, 7, 10 వంటి 10లోపు 8 ర్యాంకులు, 100లోపు 65 ర్యాంకులు, 1000లోపు 216 ర్యాంకులు సాధింపజేసి సరికొత్త రికార్డు నెలకొల్పి ఆలిండియా అగ్రగామిగా నిలిచిందని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డా.పి.సింధూరనారాయణ, పి.శరణినారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.పి.సింధూర నారాయణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఓపెన్ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు సాధించటం తెలుగువారికి ఎంతో గర్వకారణమన్నారు. విశిష్టమైన ప్రణాళికలతో రూపొందించిన స్టార్ సిఒ బ్యాచ్, ఎన్–40 ప్రోగ్రామ్‌ల ద్వారా మాత్రమే టాప్ ర్యాంకుల సాధన నిరంతరాయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. సిబిఎస్ఇ సిలబస్ ఆధారంగా చేసుకుని నిర్వహించబడుతున్న నీట్ పరీక్ష కోసం అత్యంత విద్యాప్రణాళిక వలనే ఈ టాప్ ర్యాంకులు సాధించగలిగామని తెలిపారు. సిబిఎస్ఇ బయాలజీ సబ్జెక్టులో తెలుగు విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి లోనుకాకుండా ఫిజిక్స్, కెమిస్ట్రీలలో సిబిఎస్ఇ వారు తయారుచేసే ప్రశ్నాపత్రాలకు అనుగుణంగా అకడమిక్ ప్రోగ్రామ్‌ను తయారుచేసి కాన్సెప్ట్స్ బేస్‌డ్ విద్యావిధానాన్ని పరిగణనలోకి తీసుకోవటం వలనే అత్యధిక సంఖ్యలో టాప్ ర్యాంకులు సాధించగలిగామని ఈ సందర్భంగా చెప్పారు. శరణి నారాయణ మాట్లాడుతూ జాతీయస్థాయి నీట్‌లో నారాయణ జైత్రయాత్ర నిర్విరామంగా కొనసాగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. గత 46 సంవత్సరాలుగా పోటీపరీక్షలన్నింటా విజయప్రస్థానాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా మూడుసార్లు ఎఐఐఎంఎస్/ఏయింటిలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించిన ఘనత ఒక్క నారాయణ విద్యాసంస్థదే అని గుర్తుచేశారు. ఇంతటి ఘనవిజయాలను సాధించడానికి కారణాలను విశ్లేషిస్తూ ప్రణాళికకు అనుగుణంగా రూపుదిద్దిన మైక్రోషెడ్యూల్స్, ఎక్స్‌పర్ట్స్‌చే రూపొందించిన స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన, రోజువారి టెస్ట్‌లు, వాటిపై సమగ్ర విశ్లేషణతో బలహీనతలను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోయేలా ప్రతి విద్యార్థినీ తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.

## రూ.150 కోట్ల విలువైన 'సర్కారు భూమి' కబ్జా

### కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వాకం
### 14.8 ఎకరాల ప్రభుత్వ భూమిలో భారీ భవనాలు
### కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోరా?
### సిపిఐ ఆధ్వర్యంలో జెండాలు పాతి పేదలకు పంచుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌హెచ్చరిక



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ రెవెన్యూ పరిధిలోని 574 సర్వే నెంబర్‌లో గల 14.8 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఈ భూమిని చెరబట్టిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని అందులో భారీ భవనాలు నిర్మించాడు. ఆ సర్వే నంబర్‌లోని ఖాళీ జాగా చుట్టూ ప్రహరీగోడ కట్టి తన ఆక్రమణలో పెట్టుకున్నాడు. దాదాపు రూ.150 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల కబ్జాకు గురైన వ్యవహారాన్ని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పార్టీ నాయకులతో కలిసి ఆధారాలతో సహా మీడియా ముందు వెల్లడించారు.

ఆదివారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థ యథేచ్ఛగా కబ్జాకు పాల్పడినా సంబంధింత జిల్లా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అవినీతిని స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ విద్యాసంస్థ యాజమాన్యం రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో అందులో కళాశాల భవనాలు నిర్మించి యథేచ్ఛగా అన్యాక్రాంతానికి గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోరా? అని ప్రశ్నించారు. సదరు భూమిపై ప్రభుత్వ అధికారుల నియంత్రణ పూర్తిగా కొరవడిందని దుయ్యబట్టారు. 2012లో అప్పటి తహసీల్దార్ 574 సర్వేనెంబర్‌లోని 13.18 గుంటల ప్రభుత్వ భూమిని ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన అధికారులకు లేఖ రాశారని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థ యాజమాన్యం తన పలుకుబడితో అధికారులతో కుమ్మక్కై 574 సర్వే నెంబర్‌ను 8 బై నెంబర్లను ఖాతాలుగా కేటాయించుకుని కబ్జా చేశారని పేర్కొన్నారు. 574/1 నుంచి 574/7 వరకు ఒక్కొక్క బై నెంబర్‌లో 1.37 ఎకరాల భూమికి ఖాతా నెంబర్లు సృష్టించారని, అందుకు అధికారులు సహకరించారని ఆయన ఆరోపించారు. కేవలం 574/8లో మాత్రమే 30 గుంటల భూమి ప్రొహిబిటెడ్ లిస్టులో కనిపిస్తుందని, మిగతా బై నెంబర్లతో కూడిన భూమిని సైతం జాబితాలో చేర్చాలన్నారు. ఇండియన్ జియో ప్లాట్ ఫామ్ ఆఫ్ ఇస్రో అనే శాటిలైట్ మ్యాప్‌లో 574 సర్వే నెంబర్‌ను పరిశీలించగా 574/2లో జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన కార్యాలయం ఉన్నట్లుగా చూపిస్తుందని, మిగతా సర్వే నెంబర్ల ఖాతాల్లో జ్యోతిష్మతి కళాశాల భవనాల నిర్మాణ సముదాయం కనిపిస్తుందని తెలిపారు. దాదాపు రూ.150 కోట్ల రూపాయల విలువచేసే 14.8 ఎకరాల ప్రభుత్వ భూమిని యదేచ్ఛగా కబ్జా చేసి ప్రైవేట్ విద్యాసంస్థ భవనాలు నిర్మించుకుని తమ కార్యకలాపాలు, తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నా వాటిపై సమగ్రమైన విచారణ జరిపి హద్దులు నిర్ణయించడంలో అధికార యంత్రాంగం విఫలమవడానికి కారణమేంటని ప్రశ్నించారు?. పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే అధికారులు చూస్తూ ఊరుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు?. ఇంటి జాగ కోసం ప్రభుత్వ భూమిని పేదలు ఆక్రమిస్తే తక్షణమే స్పందించి వారిని బెదిరించి కేసులు బనాయించి పంపించే అధికారులు పెద్ద ఎత్తున కబ్జాకు గురైన భూమిని గుర్తించకపోవడం విచారకరమన్నారు. సామాన్యులకు ఓ న్యాయం, ధనికులకో న్యాయమా? అని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ వాటిని ప్రభుత్వ కార్యక్రమాలకు, పేదల ఇళ్ల స్థలాలు, నిర్మాణాలకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 574 సర్వే నెంబర్‌ను, కబ్జాకు గురైన 14.8 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి స్వాధీనం చేసుకోవాలన్నారు. కబ్జా చేసిన విద్యాసంస్థ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో మంది పేదలు తిమ్మాపూర్, నుస్తులాపూర్ గ్రామాలలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక కిరాయి ఇండ్లలో నివసిస్తున్నారని, వారందరికీ ఈ భూమిని పంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, భూపోరాటాలు నిర్వహిస్తామని శ్రీనివాస్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, నాయకులు మామిడిపల్లి హేమంత్ కుమార్‌లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి బిఆర్‌ఎస్ తోడుగా నిలుస్తుంది : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర నీటి హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి బిఆర్‌ఎస్ తోడుగా నిలుస్తుందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ నిర్మాణంతో గోదావరి జలాల్లో తెలంగాణ రాష్ట్ర హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఎపి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని, నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని హరీశ్‌రావు సూచించారు. ఈ మేరకు 'గోదావరి బనకచర్ల' ప్రాజెక్ట్ అంశంపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు ఆదివారం లేఖ రాశారు. ఈ నెల 13న కేంద్ర జలశక్తి మంత్రికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖ రాయడాన్ని హరీశ్‌రావు అభినంధించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టిఎంసిల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టు డిజైన్‌కు సంబంధించిన పిఎఫ్ఆర్‌ను కేంద్రానికి సమర్పించడం తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించేలోపు తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా, ఎపి యూనిలేటరల్‌గా ముందుకెళ్తుండటం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. గోదావరి జలాల్లో 969 టిఎంసిల నీటిలో తెలంగాణ వాటాగా ఇప్పటి వరకు వినియోగం 600 టిఎంసిలకు పెరిగిందని హరీశ్ రావు వివరించారు. గోదావరి నదిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి బ్యారేజులు, 19 లక్షల ఎకరాల స్థిరీకరణతో గోదావరి బేసిన్ అభివృద్ధి చెందుతుందని, చెరువులు, చెక్ డ్యాములు, మిషన్ కాకతీయ, కాల్వల ద్వారా గోదావరి నీటిని వ్యవస్థీకృతంగా వినియోగంలోకి వస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కాళేశ్వరం ఎత్తిపోతల అదనపు నివేదిక, సమ్మక్కసాగర్, వార్ధా (బి.ఆర్ అంబేద్కర్ ప్రాజెక్టు) ప్రాజెక్టుల డిపిఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు.




# ఉత్తరాంధ్ర వర్తమాన 'దళిత' కవిత్వం

కళింగాంధ్రలో బౌద్ధం యొక్క శాంతి ప్రబోధం, ఉత్తరాంధ్ర ప్రజల వెనుకబాటు, వలస జీవన సమస్య, ప్రత్యేకించి దళితుల్లో అవిద్య, చైతన్యం కొరవడడం ఇవన్నీ కలిసి ఇక్కడ ప్రజల్లో నైరాశ్యాన్ని పెంపొందించాయి. అందుకే తెలంగాణ, మధ్యాంధ్ర, రాయలసీమలో పుట్టుకొచ్చినంత బలంగా ఉత్తరాంధ్రలో దళితోద్యమం గానీ, దళిత సాహిత్యోద్యమం గానీ రాలేదు. లక్షింపేట ఘటన కంటే ముందు కూడా ఇక్కడ అడపాదడపా దళితులపై ఊచకోతల జరిగాయి. ఆ ఘటన కూడా ఈ ప్రాంత దళితులను పెద్దగా కదిలించలేదు. కళింగాంధ్రలో పెద్దగా భూస్వాములు లేరు. ఒకప్పుడు జమీలు, వారికి ప్రతినిధులుగా ఉండే అగ్రవర్ణాల వద్దనే భూములు ఉండేవి. తొంభై శాతం పైగా ఉన్న మిగతా కులాలన్నీ వారి కనుసన్నలలో, వారి భూముల్లో శిస్తుకి వ్యవసాయం చేసుకుంటూ బతికేవారు. ఇలా చేసిన వారంతా బహుజన వర్గాలే. వీరు సన్నకారు రైతులుగా, కూలీలుగానే ఉన్నారు. ఆయా వెనుకబడిన వర్గాలు, దళితులు కలిసి మెలిసి కూలీనాలీ చేసుకుని ఇక్కడ బతకడం చూస్తాం. అందువల్ల కులపరమైన వివక్ష కొంత తక్కువే. అలాగని పూర్తిగా లేదనలేం. 'దద్దీ మావా' అనే పిలుపుల మాటున కులకుట్ర ఉంది. అనాదిగా మనుషుల మధ్య ఉన్న కులమనే మానసిక దౌర్బల్య ఛాందసవాదం ఒక్కోసారి దళితులపై దాడులకు ఉసిగొలిపింది కూడా. తొలుత కళింగాంధ్ర నుండి మహాకవి గురజాడ 'మాలలు' అనే గేయంలో దళిత వస్తువునుంచారు. తర్వాత గరిమెళ్ళ సత్యనారాయణ హరిజన గీతాలెన్నో రాశారు. పురిపండ అప్పలస్వామి 'గుడిలోన దైవమా' అనే దళిత గీతం రాశారు.

వంగపండు ప్రసాదరావు 'ఉందర్రా మాలపేట' లాంటి దళిత పాటలెన్నో రాశారు. వీరి గేయాలన్నింటినీ 'జయధీర్ తిరుమలరావు' సంపాదకత్వంలో వచ్చిన 'దళిత గీతాలు' లో చూడొచ్చు. బంకుపల్లి మల్లయ్య శాస్త్రి 'అస్పృశ్యత' అనే కావ్యాన్ని రచించారు. ఎస్.టి జ్ఞానానందకవి 'హరిజనులు అంటరానివారా' అనే గ్రంథం రాశారు. నేడు ఇక్కడ రాస్తున్న కవుల నుండి పూర్తిస్థాయి దళిత కవిత్వమైతే రాలేదు. అలాగని అడపాదడపా రాస్తున్న కవులు లేకపోలేదు. ప్రముఖ కవి ఛాయరాజ్ 'లక్ష్మింపేట రూపంలో సారం' అనే కవితలో 'దళితులూ, గిరిజనుల కళ్ళ జలాశయాలలో/శతఘ్నులు కదలాడుతున్నాయి కాచుకోండి' అని ముగింపులో వైప్లవాన్ని సూచిస్తాడు. ప్రజాసాహితి నాగరాజు 'అంటుకున్న నెత్తుటి మంటలు' అనే కవితలో

**'సువర్ణముఖి రక్తముఖియై,**
**వేగావతి వేదనామతియై/**
**దళితపేటను అహింసా భారతీయం/**
**కత్తులతో బరిసెలతో ఆలింగనం చేసుకుంది'** అని

లక్షింపేట ఘటనకు కలత చెంది విలపిస్తాడు. రెడ్డి రామకృష్ణ 'గొడిముక్క' దీర్ఘ కవితలో ఉత్తరాంధ్ర ఆధిపత్య వర్గాల దౌర్జన్యాన్ని నిరసిస్తాడు. కంబారితనం చేసే దళితుల పుర్రాకులను ఆర్ద్రంగా నిమురుతాడు.

**'ఏనంత గుంటడ్నీ/ఎంతపని సేసేవోడినో/**
**పేడలు తీసి సాలలు తుడిసి/ కోడిపిల్లల్ని**
**ఒదిలి/పొద్దుపోతే మళ్ళా ఆట్నీ మూసి/**
**గేదెల్ని సెరువుల కడిగి/ఒకటేటి నేం పెయ్యనాగా**
**ఎగిరేవోన్ని/తూరీగనాగ రయ్యమని దూసుకెళ్లేవోన్ని/**
**మిట్టగిడిశనాగ పట్టుకు దొరక్కుండా/పరుగెత్తి సేసేవోన్ని'**

మరో కవితలో


**'యుద్ధం నాయనా యుద్ధం/**
**కత్తికి కర్రకి యుద్ధం/**
**మనిసికి మనిసికి మద్దిన యుద్ధం/**
**మేం మనుసులమన్నందుకు యుద్ధం'**

అని చుండూరు ఘటనను తలుస్తాడు. లక్షింపేట ఘటనకు నిరసనగా 'నిన్ను తగలెట్ట' అన్న కవిత కూడా రాశారు. 'దండోరాలు' అనే పాటలో నల్లి ధర్మారావు

**'ఊరత్తల పేటల నుంచి-నోరెత్తని దండోరాలు/**
**తరతరాల నుంచి-నోరెత్తని దండోరాలు/**
**దిక్కుమొక్కు లేని శవము-పొలిమేరలో ఉందంటేను/**
**పోలీసోళ్ళు వచ్చేవరకు-హరిచ్చంద్ర కాటిసీను'** అని

తలయారీలుగా పనిచేసే దళితుల దైన్యస్థితిని తెలుపుతారు. మొయిద శ్రీనివాసరావు 'తలాపు దీపాలు' అనే కైతలో

**'రాజకీయ రాబందుల రెక్కల చప్పుడికి/**
**లక్ష్మింపేటలోని ఇంటి దీపాలారి/**
**అయిదు తలాపు దీపాలెలిగాయి'**



అని తన నిరసనను వ్యక్తం చేస్తారు. చింతా అప్పలనాయుడు 'మా ఊరి మాలపిల్ల, ఒక మాలపేట కొన్ని దృశ్యాలు' అనే కవితల్లో మాలపేటను, మాలపడుచుపిల్ల అందాన్ని వర్ణిస్తాడిలా.

**'శంబర పోలమ్మ జాతరలో/**
**రోడ్డుమీద కొనుక్కున్న వాయిలు చీరకట్టి/**
**బొరిగిపట్టి బోడిమెట్టవైపు అడుగులేస్తుంటే/**
**దారిపొడుగునా సీతాకోకచిలుకలు/**
**సిగ్గుతో రెక్కలు ముడుచుకుంటాయి'.** రెండో కవితలో

రాత్రివేళ మాలపేటలోని స్వచ్ఛ సుందర జీవన వినోద **దృశ్యాలు ఏకరువుపెడతాడిలా.**

**'ఆటయినా పాటయినా/**
**కతయినా కయ్యమయినా/**
**బతికిబట్ట కట్టేది మాలపేటలోనే/**
**అనురాగాలు ఆప్యాయత/**

ఇలమీద ఇంకా మిగిలున్నాయని, చెప్పే మహాబోధి మాలపేట'. సిరికి స్వామినాయుడు రాసిన 'కాకెంగిలి ప్రేమ' కవితలో కుల వైరుధ్యమున్న ఇద్దరి మిత్రుల అంతర్మథనముంది.

**'వీడొక నల్ల చామంతి నేనొక తెల్ల గులాబి/**
**అయితేనేం ఇద్దరం మనుషులమే/**
**మా అమ్మ గుండెలు ఎండిన చెలమలైతే/**
**ఒక తల్లి రొమ్మును పంచుకున్న వాళ్లమే/**
**ఒకరి భుజాలను ఒకరు తీగల్లా అల్లుకొని**
**ఒరే తురే అని పిలుచుకున్న/**
**తేనె పిలుపులు కమ్మదనాలమే/**
**ఎవరు మమ్మల్ని విడదీసింది/**
**ఏ సమాజం మమ్మల్ని ఎడబెట్టింది/**
**ఏ కులం మా మధ్య గీత గీసింది'.**

'స్మశానం కోసమే'లో దళితులకు ప్రత్యేకంగా స్మశానముండాలని ధిక్కార స్వరం వినిపిస్తాడిలా. 'ఓటుకు ఒకే విలువ ఉన్నప్పుడు/మనిషికి ఒకే విలువ ఎందుకుండదు/మీదైనా మాదైనా పోయే ప్రాణం విలువ ఒకటైనప్పుడు/కనీసం శవ సంస్కారంలోనైనా సమానత్వం ఉండొద్దా'. పాయల మురళీకృష్ణ 'కరవాలం చెప్పిన రహస్యం' కైతలో..పోస్టుమార్టంలో పాల్గొన్న దళితుని జీవన సమరంలో గల మానసిక స్థితిని చెబుతాడిలా. 'ఒక్కోసారి పెల్లుబికే దుర్వాసనల్లో కూడా/వెచ్చని ఊపిరుల పరిమళమై/విడివిడి శరీర భాగాల తన సమయాలను/వైద్యుడు ముందు ఎలా రాసి పోసాడో'. గవిడి శ్రీనివాస్ 'దళిత స్వరం' లో దళిత అమానుష సంఘటనలను తలచుకొంటాడు.

**'శీలం ఎవరిదైనా ఒకటేగా/**
**సోకం ఎవరిదైనా బాధేగా/**
**క్షోభ పడ్డ క్షణాలు/**
**దళిత స్వరాలై/దేశ నలుదిక్కులా పొగలు కక్కుతున్నాయి'.**

కంచరాన భుజంగరావు 'ప్రాణమున్న కట్టెలు గురించి' లో 'పేట పైటల పొత్తి కడుపుల దిగువున/మోతుబరి మీసాల దొష్ట్యపు చూపులు/ఇప్పటి కథా నేపథ్యం మారిందేమో/తప్ప కథ మారలేదు' ఇప్పటికీ దళితుల స్థితిగతులు మారలేదంటాడు. లండ సాంబమూర్తి **'నా గాయాలు నావి' కైతలో**

**'కులంబట్టి కుండలుంటాయని/**
**కుండలనుబట్టి నీళ్లుంటాయని తెలీక/**
**పిడచగట్టిన నాలుకతోనే/**
**చివరి నిద్రలోకి జారుకుంటున్నాను/**
**అనేక నెత్తుటి పాటల తర్వాత/**
**ఊరి కొసనున్న నా గూటిని/**
**అపార్టుమెంటుల ఇరుకు జాగాలో సర్దుకున్నా/**
**ఇప్పటికీ డ్రైనేజీల కుళ్లులోనో/**
**సెప్టిక్ ట్యాంకుల పాయఖానాల కంపులోనో/**
**నాలుగు మెతుకుల్ని రాల్చుకుంటున్నాను'** అంటూ

దైన్యమైన దళిత జీవన వేదనలను తడుముతాడు. కె.క్యూబ్ వర్మ 'భూమి రంగు మనుషులు' లో దళిత స్వరాన్ని వినిపించారు. మట్టితో సహవాసం చేసే మూలవాసులకు ఈ మట్టిపై హక్కు లేకపోవడాన్ని గర్జిస్తాడిలా.

**'తరాలుగా ఏలుతున్న/అంటరానితనం**
**పేర్ల చివర/మిగిలి వెక్కిరిస్తుంది/**
**నేలంతా పరచుకున్న వివక్ష/**
**నేడు ఆగ్రహజ్వాలగా మారి/**
**నిన్ను నేలమాళిగలోకి నెట్టివేస్తుంది/**
**దాక్కున్నా వదలని/నెత్తుటి పాపం/**
**నిన్ను వేటాడక మానదు'.**

బాలసుధాకరమౌళి దళిత స్వరాన్ని అందుకున్న కవి. 'చెన్న' అనే కవితలో 'సామాజిక వ్యాధినే నిలబడి తట్టుకున్న మనిషికి/ఇప్పుడు ఈ వ్యాధో లెఖ్ఖా' అని కరోనా టైంలోని సఫాయి కార్మిక పిల్లవాడిని గుర్తు చేసుకుంటాడు. 'జీవన్ నీ పాటలో' లో గాయకుడైన తన విద్యార్థిని జ్ఞప్తికి తెచ్చుకుంటాడు.

**'నీలాంటి కోయిలల/రెక్క నిమరలేని/**
**ఈ మనుషులను/నిజంగా దయ లేకుండా/**
**త్యజిస్తున్నాను/నీ పాటని-నిన్ను/**
**తలకెత్తుకుని/సిగమూగుతున్నాను'.**

గంటేడ గౌరునాయుడు 'ఓ గాయకుడా' అనే కవితలో దళిత సామాజిక జీవనాన్ని రాసారిలా.

**'పాటకు పొంగిన పల్లె హృదయాల/**
**చప్పట్ల సన్మానాలే కాదు/అ**
**న్యాయాలకెదురు తిరిగి పాట కట్టినందుకు/**
**బుగత బావుల కోపానికి/పచ్చిపుండయిన**
**నీ వొళ్ళు సంగతి/కొరడావోరుకొస**
**తగిలినట్టు/ఛెళ్ళుమని గుర్తుకొస్తుంటుంది'** ఇందులో

మాస్టారు మెన్షన్ చేయనప్పటికీ, ఓ గాయకుడి దళిత నేపథ్యమే కానవస్తుంది. 'గాయం' లో కూడా దళితులపై జరుగుతున్న హింసకాండను చూపిస్తారు. 'గాయం మళ్ళీ మళ్ళీ రేగుతూనే ఉంటుంది/గాయానికి ఒకచోట ఒకో పేరుంటుంది/మొన్న దానిపేరు కారంచేడు/నిన్న దాని పేరు పదిరి కుప్పం/నేడు దానిపేరు నీరుకొండ/రేపు& ?' రెడ్డి శంకరరావు 'వెలుతురు వాకిటి' కవితలో

**'చేతులతో నేలను ముద్దాడి/**
**చెత్తను గుండెకు హత్తుకొని/**
**ముక్కుపుటలదిరే దుర్గంధాన్ని/**
**కంఠం నిండా నింపుకున్న/**
**గరళకంఠులు వీరు'**

అని సఫాయి కార్మికుల వెతలను విశదీకరిస్తారు. 'కలమట దాసుబాబు' ప్రస్తుతమున్న ఈ ప్రాంత సీరియస్ సాహిత్యాన్ని రాస్తున్న ఏకైక దళిత కవి. 'ప్రవహిస్తున్న పాట' లో ఒక దళిత జముకు కళాకారుడు రైలులో తన గాన కళా కౌశలంతో ప్రయాణికులను ఆకర్షిస్తాడిలా.

**'మండుతోన్న ఆత్మగౌరవాన్ని/**
**ఆకలి కడుపున అదిమిపెట్టి/**
**అలుపెరగని గానమై అతడు/**
**రైలుబోగీ నిండా ప్రవహిస్తూనే ఉన్నాడు'.**

'నాయన'లో జముకు, డప్పు, తుడుములను వాయిస్తూ కాలం గడిపిన నాయనను గుర్తు చేసుకుంటాడు. 'నాయనా/ఏ బుగతమ్మో నీకు పెట్టిన పిడికెడు కూర మెతుకుల్ని/గావంచ చాటున గుట్టుగా తెచ్చి/నాకు గోరుముద్దలు పెట్టిన అపూర్వ వాత్సల్యుడివి'... ఇంకా ఇలా 'పాటగాడుగా, పాలేరుగా, నౌకరోడిగా, దాసుడిగా/రేయింబవళ్ళు రెక్కలు ముక్కలు చేసుకొని పరిశ్రమించిన వాడివి' దళిత జీవితాన్ని వడకాచినట్లు ఈ కవి కవిత్వీకరిస్తారు. 'మా ఆకలి నిషిద్ధమే' కైత పెత్తందారుల తోటలోపడి రెండు మామిడికాయలు దొంగిలించాడని ఓ దళితుణ్ణి ఉరివేసి చంపే సంఘటనకు చలించి రాసారు.

**'ఈ వివక్షల చీకట్ల మధ్య/**
**విసిగి విసిగి మీపై ఉరిమే సందర్భం కోసం/**
**అగ్గిపిడుగులమై ఎదురుచూస్తుంటాం/**
**తరతరాల మీ అభిజాత్యపు అహంకారాన్ని బుగ్గి చేస్తాం'**


అంటూ కవి వైప్లవాన్ని ఆశ్రయిస్తాడు. 'నెత్తుటి దమట' లక్ష్మింపేట ఘటనకు నిరసన తెలిపేది. 'దద్దీబాప్పా అంటూ వరసలు కలిపిన/మీ ఆత్మీయతానురాగాల ముసుగులో/అగ్రకుల అహంకారం/బాగుందని ఊహించలేదు'. వీరేగాక ఈ ప్రాంతం నుంచి రెడ్డి శంకరరావు, వినోద్ కుత్తుం లాంటి కవులు అడపాదడపా దళిత వస్తువుని ఎత్తుకుంటున్నారు. ఇంకా 'మజ్జి దేవిశ్రీ, నగిరి కరుణాకర్' లాంటి కవిగాయకులు దళిత వస్తువుతో పాటలు రాస్తున్నారు. అంబేద్కర్ శతజయంతి సందర్భంగా విశాఖలో ఆచార్య వెలమల సిమ్మన్న అధ్యక్షతన ఏర్పాటైన దళిత సాహిత్య పీఠం వారు కొండపల్లి సుదర్శన రాజు సంపాదకత్వంలో 'దళిత కవిత' అనే సంకలనమొకటి వచ్చింది. అలాగే తుల్లిమల్లి విల్సన్ సుధాకర్, నూకతోటి రవికుమార్ మరియు కోయి కోటేశ్వరరావుల సంపాదకత్వంలో లక్ష్మింపేట ఘటన నేపథ్యంలో 'తెగిపడినచోట తెగబడమే' అనే కవితా సంకలనం కూడా వచ్చింది. వీటిలో ఈ ప్రాంత కవులు కొద్దిమందే ఉన్నారు. ఉత్తరాంధ్రలో మరికొంతమంది దళిత కవిత్వ సృజన కారులు మరుగునపడి ఉండవచ్చు. అందువల్ల పరిశోధకులు మరింత లోతుగా పరిశీలించి ఇక్కడి దళిత కవిత్వాన్ని రికార్డ్ చేయాలి.

**– పిల్లా తిరుపతిరావు**
**7095184846**

## చదవాల్సిన పుస్తకం

# మాక్సీమ్ గోర్కీ 'అమ్మ'

'అమ్మ'ను ప్రధాన పాత్రగా చేసుకొని వందలు... వేలల్లో కవితలు, కథలు, నవలలు వచ్చాయి. ఇప్పటికీ వస్తునే ఉన్నాయి. కానీ, సాహిత్యంలో మాక్సీమ్ గోర్కీ (1868–1936) రచించిన 'అమ్మ'కు ఉన్నంత ఆదరణ మరే ఇతర నవలకు లేదనడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. రష్యన్ విప్లవ ఉద్యమం నేపథ్యంలో, సామాజిక అసమానతలకు, కార్మికుల శోషణకు, వర్గపోరాటానికి ప్రతినిధిగా నిలిచిన నవలలలో, 1906లో వెలువడిన 'అమ్మ' ఒక అపూర్వ సాహితీసృష్టి. ఈ నవల ప్రపంచ సాహిత్యంలో సామ్యవాద భావజాలాన్ని చైతన్యవంతమైన మార్గంగా పరిచయం చేసిన మహత్తర రచనగా నిలిచింది. ఒక కార్మిక తల్లి జీవితాన్ని ప్రతిబింబిస్తూ, ఆమె చైతన్య యాత్రను, సామాజిక ఉద్యమాల్లో ఆమె భాగస్వామ్యాన్ని చిత్రిస్తుంది. అమ్మ అంటే ప్రేమ, త్యాగం, మార్పుకు ప్రేరణ అనే భావనకు గోర్కీ రాజకీయపరమైన కొత్త అర్థాన్ని పరిచయం చేశాడు. అసలు పేరు అలెక్సీ మక్సిమోవిచ్ పేశ్కోవ్ అయినప్పటికీ, కలం పేరు మాక్సీమ్ గోర్కీగానే అందరికీ సుపరచితుడు. అనాథ కావడంతో బాల్యంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాడు. అందుకే, అతని రచనల్లో జీవితానుభవాలే ఎక్కువగా కనిపిస్తాయి. కార్మిక జీవితం, పేదరికం, అసమానతలు ఇతని రచనల్లో ప్రధానంగా దర్శనమిస్తాయి. రష్యన్ సమాజాన్ని లోతుగా గమనించిన రచయిత గోర్కీ . సోషలిజం వైపు ఆకర్షితుడై, లెనిన్‌తో సన్నిహితంగా ఉన్నాడు. ఆయన రచనలు విప్లవ భావజాలానికి స్ఫూర్తిగా నిలిచాయి. 'అమ్మ' నవల విషయానికి వస్తే, ఈ కథ ఒక సాధారణ తల్లి, పెలాగేయా నిలోవ్నా చుట్టూ తిరుగుతుంది. ఆమె తన కుమారుడు పావెల్ వ్లాసోవ్ ద్వారా ఉద్యమంలోకి ప్రవేశిస్తుంది. మొదట్లో భయంతో కూడిన పెలాగేయా, క్రమంగా తన కుమారుని మార్గాన్ని అర్థం చేసుకుంటూ, చివరికి అతని విధానాన్ని స్వీకరించి ఉద్యమం భాగమవుతుంది. ఈ కథ సామాజిక మార్పులకు చైతన్యం అవసరమని, మార్పు చిన్న మనుషుల నుంచే ప్రారంభమవుతుందన్న విషయాన్ని తెలిపే కథ. నవలలో ప్రముఖమైన పెలాగేయా పాత్ర ఒక సామాన్యమైన గ్రామీణ మహిళ. మొదటగా ఆమె తన భర్త చేత వేధింపులకు గురవుతుంది. భర్త మరణించిన తర్వాత కొంతమేర ప్రశాంతత. కానీ ఆమె కుమారుడు పావెల్ మెల్లగా కార్మిక ఉద్యమంలో ప్రవేశించి, తల్లిని కూడా ఆ దిశగా ఆలోచింప చేస్తాడు. ఆమె మార్పు ప్రక్రియే ఈ నవల హృదయ భాగం. సాంప్రదాయ మాతృత్వాన్ని దాటి ఆమె విప్లవాన్ని ఆదర్శంగా అంగీకరిస్తుంది. గోర్కీ రచన శైలి వాస్తవికత ఆధారంగా సాగుతుంది. నారేటివ్ శైలి సరళంగా ఉన్నా, భావాత్మకతతో నిండి ఉంటుంది. ప్రతి సంభాషణ, ప్రతి సంఘటన ఒక సామాజిక సందేశాన్ని మోసుకెళ్తుంది. గోర్కీ పాత్రలను మానవతావాదంతో కూడిన యథార్థ దృక్కోణంతో రచించాడు. తల్లి పాత్రలోని మానసిక ప్రయాణాన్ని అతను క్రమంగా తీర్చిదిద్దాడు. ఒక సాధారణ మహిళ ఎలా రాజకీయం అవుతుందో గోర్కీ నాటకీయంగా కాక, సహజంగా చిత్రించాడంటే అతని శైలి ప్రతిభ అర్థమవుతుంది. ప్రతి ఒక్కరినీ ఆలోచింప చేసే 'అమ్మ' నవల ఇప్పటికీ సాంఘిక మార్పు గురించి మాట్లాడే వేదికలపై ప్రస్తావనకు వస్తుంది. మహిళా సాధికారత, సామాజిక చైతన్యం, పౌర హక్కులపై చర్చల్లో ఈ నవల పాత్ర అపూర్వమైనదిగా నిలుస్తోంది. విద్యార్థులు, కార్మికులు, సామాజిక కార్యకర్తలు ఈ నవలలో ఒక మార్గదర్శకాన్ని చూస్తారు. అందుకే, ఈ పుస్తకం నేటి తరం తప్పక చదవాలి. అర్థం చేసుకోవాలి. సామాజిక విశ్లేషణతో ముందుకు నడవాలి.




జూన్ 18 మాక్సీమ్ గోర్కీ వర్ధంతి

A mother's heart is a deep abyss at the bottom of which you will always find forgiveness.
(Though not always directly quoted in this form from the novel, this quote captures the essence of Pelageya Nilovna's unconditional love and support for her son, Pavel. Her transformation is rooted in this deep maternal bond).


The truth is in the people. And I will go to them.
– Pavel Vlasov
(Pavel expresses his belief in the collective power of the working class. He chooses the people over personal comfort, showing his commitment to revolution and justice).

Freedom is not given— it is taken.
(A central idea in socialist and revolutionary literature. Gorky's characters fight for freedom not as a gift, but as a right to be seized).

### పుస్తకం పేరు

**నవల పేరు: అమ్మ**
**రచయిత: మాక్సీమ్ గోర్కీ**
**అనువాదం: క్రొవ్విడి లింగరాజు**
**వెల: రూ. 350**
**(ఇప్పుడు 5 శాతం డిస్కౌంట్‌తో, రూ. 333కే లభిస్తున్నది)**
**తెలుగు.. ఆంగ్లంలో ప్రతులకు..**
**నవచేతన పబ్లిషింగ్ హౌస్**
**గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068.**
**(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

'అమ్మ' నవలలో మాక్సీమ్ గోర్కీ సమాజం పట్ల తన అభిప్రాయాలను, విశ్లేషణను వివిధ పాత్రల ద్వారా చెప్పిస్తాడు. వీటిలో కొన్ని విశేషంగా ప్రచారంలోకి వచ్చాయి.




# సాహితీ ప్రపంచంలో జేమ్స్ జాయిస్ 'బ్లూమ్స్ డే'




సాహితీ ప్రపంచంలో, ప్రత్యేకించి ఆంగ్ల సాహిత్యంలో జూన్ 16వ తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. 'బ్లూమ్స్ డే'ను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. దీనిని ఒక సాహిత్యపరమైన వార్షికోత్సవంగా పేర్కోవచ్చు. జేమ్స్ జాయిస్ యొక్క ప్రసిద్ధ నవల 'యులిసిస్' (Ulysses)కు ఈ రోజును అంకితం చేస్తారు. నవలలో కథా సంఘటనలు 1904, జూన్ 16 నాడు డబ్లిన్ నగరంలో జరిగినట్టుగా ఉంటాయి. అందుకే, ఆ రోజును గుర్తుగా ఉంచుకుని ప్రపంచవ్యాప్తంగా 'యులిసిస్' ప్రేమికులు, జాయిస్ అభిమానులు బ్లూమ్స్ డేను జరుపుకుంటారు. ఈ నవలలో ప్రధాన పాత్ర లియోపోల్డ్ బ్లూమ్. ఆ పేరు మీదే బ్లూమ్స్ డే స్థిరపడింది. దీనిని కేవలం ఒక సాహిత్యపు విశిష్టమైన దినం మాదిరిగానే కాకుండా, జాయిస్ రచనా కౌశల్యానికి నివాళిగా, ఆయన రచనల ద్వారా సాహిత్య ప్రక్రియల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులకు గుర్తుగా నిర్వహిస్తారు. అంతేకాదు, భాషా ప్రయోగాలకు, మానవ మానసికతపై ఉన్న అన్వేషణకు ప్రతీక 'బ్లూమ్స్ డే'. యులిసిస్ నవలలో 1904, జూన్ 16వ తేదీని ప్రత్యేకంగా ఎంచుకోవడానికి ఒక ప్రధాన కారణం ఉంది. తన ప్రేయసి నోరా బార్నకిల్‌ను జూన్ 10న కలిసిన జాయిస్, 16వ తేదీన ఆమెతో తొలి డేట్‌కు వెళ్లాడు. అందుకే, అదే రోజును తన నవలకు ప్రధానంగా ఎంచుకున్నాడు. ఒక వ్యక్తిగత అనుభూతినే నవలలో చేర్చి, అదే రోజును ఒక సాహిత్య దివసంగా మార్చిన ఘనత జాయిస్‌కే దక్కుతుంది. బ్లూమ్స్ డేను ప్రధానంగా డబ్లింగ్ నగరంలో ఘనంగా నిర్వహిస్తారు. అభిమానులు యులిసిస్ నవల్లో పేర్కొన్న పలు ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లి, బ్లూమ్ చేసిన ప్రయాణాన్ని అనుకరిస్తారు. చాలా మంది నవలలోని పాత్రల వేషధారణలో కనిపిస్తారు. పలు సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమెరికా, బ్రిటన్, ఇటలీ, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీలు, సాహిత్య సంస్థలు ఈ బ్లూమ్స్ డే కార్యక్రమాలు నిర్వహిస్తాయి.



## ఈ వారం కవితలు

### పర్యావరణ హితమే...



పంచభూతాల పర్యావరణం
ప్లాస్టిక్ విషసర్పం కాటుకు
గురైంది.
ప్రకృతి కళ్ళలో కన్నీటి పరిణామాన్ని
అడుతున్న మానవ గుండె
ఉనికికి సాక్షిగా ప్రశ్నిస్తుంది!

రాయడానికేముంది?
ఆకులన్నీ ఆక్సిజన్ ఇవ్వలేక
పండుటాకుల్లా రాలిపోతుంటే..
మన నిర్లక్ష్యం తాలూకూ
'కాలుష్యం మాయలో'
'ఆధునిక సాంకేతిక మోజులో'
మనమంతా కరోనా మహామ్మారి వంటి
వింత రోగాల వలలో చిక్కుకొని
కనుమరుగై 'పోతుంటే'..!

ప్రపంచ వింతలైన తాజ్ మహల్ వంటి
కట్టడాలు సైతం పగుళ్ల ఓ వైపు
అవని తల్లి తల్లడిల్లి పోతూ
అధిక ఉష్ణోగ్రతల ఉక్కిరిబిక్కిరి
మరో వైపు!

ఓజోన్ గుండెకు చిల్లులు పెడుతూ
అతినీలలోహిత కిరణాల ప్రసారపు
ప్రభావం నలుదిక్కుల విస్తరిస్తూ
'జీవుల మరణం'పాటకు
కర్బన ఉద్గారాలు నాట్యం చేస్తుంటే
శతాబ్దాలుగా ప్లాస్టిక్ ప్రాణం
మట్టిలో కలిసిపోకుండా...

మన తనువులోని
అణువులుగా ఇంకిపోతుంటే
భవిష్యత్ తరాల బ్రతుకు భరోసాకై
జగమంతా ఐక్యమై పచ్చని చెట్లు
మన తోబుట్టువనుకొని ప్రాణం
పోద్దాం. మనలో మనం బాధ్యతగా
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేద్దాం.
సౌరశక్తి తోడునీడగా
విద్యుత్ ఉత్పత్తికి ప్రాణం పోద్దాం.

పర్యావరణ హితమే మన పథమై
మనందరి ఆధునిక మతమై
మన మహాత్ముడి పరిశుభ్రత
అభిమతపు ఆదర్శమని ఆచరిద్దాం!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

### చివరి వాకిలి..

చివరి వాకిటి వైపు
మొహం పెట్టి చూసింది లేదు
చెదలు పట్టిన మనసు
కులం గోడ కట్టినప్పట్నుంచి
ఆ వాకిలి ఒంటరిదై పోయింది.

పెచ్చులూడిన జ్ఞానం
శిథిలావస్థలో పడున్నప్పుడు
పిచ్చి మొక్కలా కులం
ఒక్క ఉదుటున లేచి కూర్చుంది.
నాగరికం ఎంత విచ్చుకున్నా
వృత్తిని బట్టి కులమనే సత్యాన్ని
తుంగలో తొక్కేసింది.


హెచ్చుతగ్గుల తేడాలతో
పెచ్చుమీరుతున్న ఆగడంలా
రెచ్చిపోతున్న కాలం పడగలిప్పింది.
పాలిత చేతులే కులం గీతలు గీస్తూ
హద్దులు పెట్టి రుద్దుతుంటే
మానవ జన్మ తల దించుకుంది.

బాగా అల్లుకుపోయిన తీగలా
సమాజమంతా విస్తరించిపోయి
మనోభావంపై ఉక్కు పాదం మోపింది.
ఇప్పుడు కడపటి వాకిలి ముందు
ఒక ముదుసలి ప్రాణం
సమసమాజత్వం కోసం
ఎదురు చూస్తూ కూర్చుంది.

ఎప్పటికైనా తారతమ్యమనేది
సంద్రంలో తిరగబడ్డ నావలా
కళ్ళారా చూడాలన్నదే
ఆ చివరి వాకిలి చివరి కోరిక
ఏనాటికైనా భేదం లేని మనిషితో
చేయి కలపాలన్నదే ఆఖరి ఆశ

**– నరెద్దుల రాజారెడ్డి**
**9666016636**

### 'ఆరుద్ర'



మృగశిర దుక్కులపై
తొలకరి చినుకులు
కురిస్తే తలుక్కున మెరిసి
పలకరించే పురుగు ఆరుద్ర!

పంట చేల్లో చీడపీడలు తిని
రైతన్నకు మేలు చేయు
బంగరు వన్నెల
బహు అరుదైన ఆరుద్ర!

పట్టు లాంటి మెత్తని దేహం
పట్టుకుంటే అత్తిపత్తే
ఎర్రని మొఖమల్ వస్త్రం
చుట్టుకున్న అపురూపం!

ఆరుద్ర పురుగులు నడుస్తుంటే
ఎర్ర టోపీల సైన్యమే
ఆరుద్ర పురుగుల ఆగమనం
విత్తుటకు అనువైన కాలాగ
మనం!

ఎగిరే రెక్కల పై
ఏడు నల్లటి చుక్కలు
నక్షత్ర మండలం లో
నడయాడే సప్త ఋషులే !

**పట్లోళ్ళ బక్కారెడ్డి**
**9705315250**



# జాతీయం
NATIONAL & GENERAL NEWS


## ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం..

**ఘజియాబాద్/తిరువనంతపురం :** ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. ఎయిరిండియాకు చెందిన ఐఎక్స్ 1511 విమానం ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరే ముందు సిబ్బంది సమస్యను గుర్తించారు. దాంతో విమానాన్ని నిలిపివేసి అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రౌండ్ ఇంజినీర్‌లు వచ్చి సమస్యను సరిచేశారు. సాంకేతిక సమస్య కారణంగా ఒక గంటపాటు ఎయిర్‌పోర్టులో రన్‌వేపైనే నిలిచిపోయింది. ఈ విమానాన్ని గతంలో రక్షణ శాఖ లో బలగాలను సామాగ్రిని తరలించేందుకు వినియోగించారు. ఈ మధ్యనే దీన్ని పౌర యానానికి వినియోగిస్తున్నారు.

**యుద్ధ విమానం అత్యవసర ల్యాండింగ్..**
బ్రిటన్ నేవీకి చెందిన ఓ యుద్ధ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. భారత్ మీదుగా వెళ్తున్న ఎఫ్ 35 యుద్ధ విమానాన్ని పైలట్ అత్యవసరంగా తిరువనంతపురం విమానాశ్రయంలో ఆ విమానాన్ని ల్యాండ్ చేశారు. ఎటిసి అధికారుల అనుమతితో ఎయిర్‌పోర్టులో విమానాన్ని దించా డు.ఇంధనం ఖాళీ కావడంవల్లే అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సివచ్చిందని వెల్లడించారు.

# విజయ్ రూపానీ మృతదేహం గుర్తింపు

### విమానం ప్రమాదంలో మృతి చెందిన 47 మంది మృతదేహాల గుర్తింపు
### 24 మందిని వారి బంధువులకు అప్పగింత



**అహ్మదాబాద్ :** గుజరాత్ అహ్మబాద్‌లో ఈనెల 12న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహాన్ని డిఎన్‌ఎ పరీక్ష ద్వారా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా జరుగుతుందన్నారు. మూడు దశాబ్దాలలో దేశంలోనే అత్యంత దారుణమైన విమాన విపత్తుకు గల కారణాలను పరిశోధించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) నేతృత్వంలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు విమాన ప్రమాద స్థలిలో పరిశీలన చేస్తున్నాయి. కాగా, ఇప్పటి వరకు 47 మంది బాధితులను గుర్తించామని, 24 మంది మృతదేహాలను బంధువులకు అప్పగించామని అదనపు సివిల్ సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ విలేకరులకు తెలిపారు. విషాదం జరిగిన మూడు రోజుల తర్వాత డిఎన్‌ఎ పరీక్షల ద్వారా మృతులను గుర్తించే ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ భయంకరమైన ప్రమాదంలో మరణించిన 241 మంది ప్రయాణికులలో రూపానీ కూడా ఉన్నారు. విమానంలో ఉన్న 242 మందిలో ఒకరు అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డారు. 'గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డిఎన్‌ఎ నమూనా (ఆయన కుటుంబ సభ్యులతో) ఆదివారం ఉదయం 11.10 గంటలకు సరిపోలింది' అని గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి గాంధీనగర్‌లో విలేకరులకు తెలిపారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ రూపానీ కుటుంబ సభ్యులను కలిసి డిఎన్‌ఎ మ్యాచ్ గురించి తెలియజేశారని రాష్ట్ర ఆరోగ్య మంత్రి రుషికేష్ పటేల్ తెలిపారు. ఇప్పటివరకు 32 డిఎన్ నమూనాలు సరిపోలాయని, 24 మృతదేహాలను ఇప్పటికే ఆయా కుటుంబాలకు అప్పగించారు. ఈ మృతులు ఉదయపూర్, వడోదర, ఖేడా, మెహ్సానా, అహ్మదాబాద్, బోటాడ్ జిల్లాలకు చెందినవారు అని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బిజె మెడికల్ కాలేజీలో సర్జరీ ప్రొఫెసర్ రజనీష్ పటేల్ అన్నారు. బోయింగ్ 787–8 (ఎఐ171) విమానంలో ఉన్న 242 మంది ప్రయాణికులు, సిబ్బందిలో ఒకరు తప్ప మిగిలిన వారందరూ, ఐదుగురు ఎంబిబిఎస్ విద్యార్థులు సహా మరో 29 మంది గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు. లండన్‌కు వెళ్తున్న విమానం సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరిన కొద్ది క్షణాల్లోనే కూలిపోయి అహ్మదాబాద్‌లోని మేఘనినగర్ ప్రాంతంలోని మెడికల్ కాలేజీ సమీపంలోని క్యాంపస్‌లో పడి మంటల్లో చిక్కుకుంది. కాగా ప్రమాదం పట్ల దర్యాప్తునకు ఎఎఐబి బృందం నాయకత్వం వహిస్తోంది. ఆ బృందం గత మూడు రోజులుగా ఇక్కడే ఉన్నట్లు రాష్ట్ర సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ దారుణ విషాదంపై దర్యాప్తులో వివిధ కేంద్ర సంస్థలు, రాష్ట్ర పోలీసులు సహాయం చేస్తున్నారు. బ్లాక్ బాక్స్ రికవరీ దర్యాప్తు ప్రక్రియలో చాలా ముఖ్యమైన భాగమని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎఎంసి) కమిషనర్ బంచా నిధి పాణి అన్నారు. నగర పోలీసు కమిషనర్ మాలిక్ కూడా ఆదివారం ఉదయం ప్రమాద స్థలానికి చేరుకున్నారు. విమాన ప్రమాద స్థలం నుండి ఇప్పటివరకు దాదాపు 270 మృతదేహాలను అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి తీసుకువచ్చారని బిజె మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ధవల్ గమేటి పిటికి తెలిపారు. విమాన ప్రమాదానికి 'మూల కారణాన్ని' నిర్ధారించడానికి, యాంత్రిక వైఫల్యం, మానవ తప్పిదం, నియంత్రణ సమ్మతితో సహా ఏవైనా దోహదపడే అంశాలను అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం శనివారం ఒక ఉన్నత స్థాయి బహుళక్రమశిక్షణా ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలోని ఈ ప్యానెల్ మూడు నెలల్లో తన నివేదికను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి దాదాపు 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు గతంలో తెలిపారు.

**పెరిగిన మృతుల సంఖ్య**

మరోవైపు, విమాన ప్రమాదంలో మరణించినవారి సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. దుర్ఘటనలో మరణించినవారి సంఖ్య ఆదివారానికి 278 కు చేరిందని అధికారులు వెల్లడించారు. ప్రమాదస్థలిలో శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీస్తున్నామని తెలిపారు. శనివారం బీజే మెడికల్ కాలేజీ మెస్‌పై ఒక యువతి సహా మూడు మృతదేహాలు కాలిపోయిన స్థితిలో కనిపించాయన్నారు. ఆ యువతి ఎయిర్ ఇండియా సిబ్బంది అనుమానిస్తున్నామన్నారు.

# పికప్ వాహనం, అంబులెన్స్ ఢీ

### ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం
### ఉత్తరప్రదేశ్‌లోని ఆమేథీ జిల్లాలో ఘటన



**ఆమేథీ :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమా దం జరిగింది. ఆదివారం ఆమేథీలోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై మృతదేహాన్ని, మృతుడి కుటుంబ సభ్యులను తీసుకెళ్తున్న అంబులెన్స్ ఒక పికప్ వాహనాన్ని ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందారని ఒక పోలీసు అధికారి తెలిపారు. హర్యానా నుండి బీహార్‌కు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు మరణించగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని జిల్లా ఆసుపత్రిలో చేర్చినట్లు బజార్ షుకుల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ అభినేష్ కుమార్ తెలిపారు. క్షతగాత్రులను బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన శంభు రాయ్‌గా గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మృతులను బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన రాజ్‌కుమార్ శర్మ అలియాస్ సతీష్ శర్మ, రవి శర్మ, పూలో శర్మగా గుర్తించారు. వీరితో పాటు హర్యానాకు చెందిన సర్ఫరాజ్, అబిద్ (ఇద్దరూ డ్రైవర్లు) ఉన్నారు. సమస్తిపూర్‌లోని రాంభద్రపూర్ నివాసి అశోక్ శర్మ మృతదేహంతో అంబులెన్స్ హర్యానా నుండి సమస్తిపూర్‌కు వెళుతోందని అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఎఎస్‌పి) శైలేంద్ర కుమార్ సింగ్ తెలిపారు. అంబులెన్స్‌లో ఇద్దరు డ్రైవర్లు, నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నారన్నారు. అంబులెన్స్ పికప్ ట్రక్కును వెనుక నుండి ఢీకొట్టిందని అదనపు ఎస్పీ తెలిపారు. మృతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపామన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రాణనష్టం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి సరైన చికిత్స అందించాలని ముఖ్యమంత్రి జిల్లా పరిపాలన అధికారులను ఆదేశించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కూడా ఆయన ఆకాంక్షించారు' అని సిఎంఒ కార్యాలయం పేర్కొంది.

## కాన్‌సాట్ పోటీలకు రాకెట్ లాంచ్ పరీక్ష విజయవంతం




**కుషినగర్ :** ఒక ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన రాకెట్ లాంచ్ వ్యవస్థ పనితీరును ఉత్తర ప్రదేశ్‌లోని కుషినగర్‌లో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరీక్షలను శని,ఆదివారాలలో విజయంతంగా నిర్వహించారు. నమూనా రాకెట్ వ్యవస్థపై విద్యార్థులకు కుషినగర్‌లో 'ఈ ఏడాది అక్టోబరు లేదా నవంబరులలో కాన్‌సాట్' పోటీలు నిర్వహిస్తారు. ఈ పూర్వరంగంలో పోటీలకు సన్నాహాలు చేస్తున్నారు. కాన్‌సాట్ అనేది నానో శాటిలైట్స్ ప్రయోగ ప్రక్రియకు ఉపయోగపడే రాకెట్. దీంట్లో ఒకరకమైన సోడాను ఉపయోగిస్తారు. ఈ రాకెట్ 1.1 కి.మీ ఎత్తు వరకూ వెళ్ళిన తర్వాత అందులో ఉన్న మీనియేచర్ ఉపగ్రహం (పేలోడ్) బయటకు వస్తుంది. తర్వాత ఈ రాకెట్‌ను ప్యారాఛూట్స్ ద్వారా 400 మీటర్ల పరిధిలో ఎటువైపైనా కిందికి దించుతారు. విద్యార్థులలో అనుభవపూర్వకంగా రోదసీ ప్రయోగాల జ్ఞానం పెంచడానికి ఈ కాన్‌సాట్ పోటీలు నిర్వహిస్తారు. శని,ఆదివారాలలో నిర్వహించిన పరీక్షలలో సాయంత్రం 5.14 గంటల 33 సెకన్లకు రాకెట్‌ను ప్రయోగించారు. ఇవి మీనియేచర్ శాటిలైట్‌లను 1.1 కి.మీ ఎత్తువరకూ విజయవంతంగా మోసుకువెళ్ళాయి. అక్కడకు వెళ్ళాక శాటిలైట్లు బయటకు వచ్చాయి. ఐదు మీటర్ల పరిధిలో ఈ శాటిలైట్లు కింద పడిపోయాయి. తర్వాత రాకెట్‌లను ప్యారాఛూట్ ద్వారా కిందికి దించారు. ఇస్రో శాస్త్రవేత్త అభిషేక్ సింగ్ ఈ విషయం చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో ఈ ప్రయోగాలు జరిగాయి. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచడానికే ఈ ప్రయోగాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

విద్యార్థులు భవిష్యత్‌లో నిజమైన రోదసీ ప్రయోగాలలో పాల్గొనేందుకు, ఆ సాంకేతికతను అర్థం చేసుకుని దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఈ కాన్‌సాట్ పోటీలు చేస్తున్నారు. ఈ సన్నాహాలలో భాగంగా, రాకెట్‌లను ప్రయోగించడానికి వీలుగా థ్రస్ట్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టిటిఐపిఎల్)తయారు చేసిన తయారు చేసిన నమూనా రాకెట్ లాంచ్ వ్యవస్థను రెండురోజుల పాటు విజయంతంగా పరీక్షించారు. భారత జాతీయ అంతరిక్ష ప్రోత్సాహక, సాధికార కేంద్రం (ఇన్–స్పేస్), ఇస్రోల సహాయ సహకారాలతో ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఈ నమూనా పరీక్షలు నిర్వహించింది. ఇన్–స్పేస్, ఇస్రోలకు చెందిన నిపుణుల మార్గదర్శకత్వంలో థ్రస్ట్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ రాకెట్ ప్రయోగ వ్యవస్థను అభివృద్ధి చేసింది. రాకెట్‌లను ప్రయోగించడానికి అవసరమైన ఈ నమూనా వ్యవస్థ విద్యార్థుల పోటీలకు ఉపయోగపడుతుంది. కుషినగర్‌లో నిర్వహించే ఇన్–స్పేస్, కాన్‌శాట్, మోడల్ రాకెటరీ ఇండియా స్టూడెంట్స్ పోటీలకు ఈ నమూనా రాకెట్ ప్రయోగ కేంద్రం ఉపయోగపడుతుంది. అంతరిక్షరంగ విస్తృతికి వీలుగా కొత్త తరం విద్యార్థులను తయారు చేయడానికి, శిక్షణ ఇచ్చి వారిలో అవగాహన పెంపొందించడానికి ఈ కాన్‌శాట్ పోటీలు దోహదం చేస్తాయి. స్థానికంగా కొన్ని పరీక్షలు నిర్వహించడానికి కూడా ఈ నమూనా రాకెట్ ప్రయోగ కేంద్రం దోహదం చేస్తుంది. ఈ కాన్‌సాట్ భావన మొదట 1998లో జపాన్,అమెరికాలకు చెందిన 12 విశ్వవిద్యాలయాల విద్యార్థుల తొలిసమావేశంలో రూపుదిద్దుకుంది. నాసా ఈ పోటీలు నిర్వహిస్తుంది.

# మోదీకి 3'ఇ'లే ఉన్నాయ్

### నాలుగో 'ఇ' లేదు
### మణిపూర్ వెళ్లడానికి ఏంటి సమస్య ?
### ప్రధానిపై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు ప్రధానికి ఎనర్జీ(శక్తి), ఎగ్జైట్‌మెంట్(ఉత్సుకత), ఎంథూజియాజం(ఉత్సాహం) అనే '3ఇ'లు మాత్రమే ఉన్నాయని తెలిపింది. తల్లడిల్లుతున్న మణిపూర్‌కు వెళ్లేందుకు ఎంపథీ (సానుభూతి) అనే నాలుగో 'ఇ' లేదని, ఆదివారం సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల పర్యటనకు మోదీ వెళ్లిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 2023 మే నుంచి ప్రధానమంత్రి విదేశీ పర్యటనలకు వెళ్లడం ఇది 35వ సారి అని, ఇంత సుదీర్ఘ వ్యవధిలో ఒక్కసారి కూడా మణిపూర్‌కు వెళ్లే తీరిక మోదీకి దొరకకపోవడం దారుణమని మండిపడ్డారు. మణిపూర్ రాష్ట్రాన్ని అత్యంత దారుణ రీతిలో ప్రధాని మోదీ విస్మరిస్తున్నారన్నారు. అక్కడి ప్రజల గోడును వినాలనే ఆసక్తే ఆయన లేదని, 2023 మే 3 నుంచి మణిపూర్‌కు చెందిన ఏ ఒక్కరినీ మోదీ కలవలేదని, సానుభూతి భావన(నాలుగో ఇ) ఉన్నవాళ్లు ఎవరైనా సరే మణిపూర్ ప్రజల బాధను తెలుసుకునే ప్రయత్నం చేస్తారు... కానీ, ప్రధాని మోదీకి నాలుగో ఈ లేదు అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**కెనడా, భారత్ బంధంపై మోదీ అంచనాలు తలకిందులు**

'కెనడా, భారత్‌లు (a+b)^2 సూత్రంలా ఎల్లప్పుడూ కలిసిమెలిసి ఉంటాయని 2015లో ప్రధాని చెప్పారు. మోదీ చెప్పింది అక్షరాలా తప్పు అని కాలక్రమంలో తేలిపోయింది. మారిన పరిస్థితులే అందుకు నిదర్శనం' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశంపై 2015లో మోదీ చేసిన వ్యాఖ్యలతో కూడిన ఒక వీడియో క్లిప్‌ను ఆయన తన ట్వీట్‌లో షేర్ చేశారు.

**'వాళ్లందరి మాటలను మోదీ వమ్ము చేశారు'**

'భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టే జీ7 సదస్సుకు ఆహ్వానించామని ఇటీవలే కెనడా ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని 2025 మే 24న నీతి ఆయోగ్ సిఇఒ ప్రకటన చేశారు. ఈ రెండు వ్యాఖ్యల మధ్య ఉన్న తేడాను ప్రధాని మోదీ గుర్తించాలి. జీ7 సదస్సుకు భారత్‌ను కెనడా ఆహ్వానించదేమో అనే చర్చ జరుగుతున్న తరుణంలో మోదీ అభిమానులు గట్టిగా బల్లగుద్ది ఒక విషయాన్ని చెప్పారు. కెనడా పిలిచినా మోదీ అక్కడికి వెళ్లరని భీషణ ప్రతిజ్ఞలు చేశారు. అయితే ఎప్పటిలాగే వాళ్లందరి మాటలను మోదీ వమ్ము చేశారు. ఆయన నిజస్వరూపం బయటపడింది' అని జైరాం రమేశ్ విమర్శించారు.

**మోదీ పర్యటన**

ఈసారి విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తొలుత (జూన్ 15న రాత్రి) సైప్రస్‌కు వెళ్తారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రైస్టోడౌలైడ్స్ ఆహ్వానం మేరకు అక్కడికి మోదీ వెళ్తున్నారు. తదుపరిగా జూన్ 16, 17 తేదీల్లో ఆయన కెనడాలో పర్యటిస్తారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సులో పాల్గొంటారు. అనంతరం జూన్ 18న క్రొయేషియాలో మోదీ పర్యటిస్తారు.

# ఇంద్రాయణి నదిపై కూలిన వంతెన

### ఇద్దరు మృతి, 32 మందికి గాయాలు
### మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ప్రకటన



న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని పుణెలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న వంతెన ఆదివారంకూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, 32 మంది గాయపడ్డారని, వారిలో ఆరుగురు పరిస్థితి విషమంగా ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. ఆరుగురిని రక్షించామని, కొంతమంది గల్లంతైనందున యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. విహారయాత్రకు వెళ్లేవారు తరచుగా వచ్చే కుండమల ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని అధికారులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, దీని వల్ల నది ఉప్పొంగి ప్రవహిస్తోందని వారు తెలిపారు. 'పుణే జిల్లాలోని తలేగావ్ సమీపంలోని ఇండోరిలో ఇంద్రాయణి నదిపై వంతెన కూలిపోయినపుడు జరిగిన విషాద వార్త విని నేను చాలా బాధపడ్డాను. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ఘటనలో ఇద్దరు మరణించారు. వారికి నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నాను. వారి కుటుంబాల దుఃఖాన్ని మేము పంచుకుంటాము' అని ఫడ్నవీస్ ఎక్స్‌లో తెలిపారు. డివిజనల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్, సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడానని ముఖ్యమంత్రి చెప్పారు. కొంతమంది గల్లంతైనందున యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు ప్రారంభించామని, సంఘటనా స్థలంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని ఆయన చెప్పారు. సహాయక చర్యలు వెంటనే వేగవంతం చేశామని ఆయన తెలిపారు. ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చించ్వాడ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి 'సుప్రీం' ఓకే చెప్పినా హైకోర్టులు విముఖత

**న్యూఢిల్లీ :** పెండింగ్‌లో ఉన్నటువంటి క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవడానికి తాత్కాలిక న్యాయమూర్తులను నియమించుకునే అవకాశాన్ని హైకోర్టులకు సుప్రీంకోర్టు దాదాపు 5నెలల క్రితమే కల్పించినప్పటికీ హైకోర్టులు ఆసక్తిని కనబర్చడంలేదు.ఈ విషయాన్ని ప్రభుత్వం వద్ద ఉన్న వివరాలు వెల్లడిస్తున్నాయి.హైకోర్టు కొలీజియంలలో ఏవి కూడా తాత్కాలిక న్యాయమూర్తులను నియమించడానికి పదవీవిరమణ చేసిన జడ్జిల పేర్లను ఇప్పటివరకూ సిఫార్సు చేయలేదని సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల ప్రొసీజర్ గురించి అవగాహన ఉన్న వ్యక్తులు అభిప్రాయం ప్రకారం వెల్లడైంది. దేశంలో మొత్తం 25 హైకోర్టులు ఉన్నాయి. అయితే జూన్ 11నాటికి ఇప్పటి వరు ఏ హైకోర్టు కొలీజియం కూడా రిటైర్డ్ జడ్జిల పేర్లను న్యాయ మంత్రిత్వ శాఖకు పంపించకపోవడం గమనార్హం. 18లక్షల క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండటాన్ని పరిగణనలోనికి తీసుకున్న సుప్రీంకోర్టు జనవరి 30న తాత్కాలిక జడ్జిలను నియమించుకునేందుకు అనుమతించింది. కోర్టుకు మంజూరు చేయబడిన సంఖ్యాబలంలో అది 10శాతానికి మించకూడదని స్పష్టంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 224ఎ ప్రకారం, హైకోర్టులో అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించేందుకు అడ్‌హక్ జడ్జిలను నియమించుకోవడాన్ని అనుమతించే అధికారం కల్పించింది.నిర్దేశించిన ప్రొసీజర్ ప్రకారం సంబంధిత హైకోర్టు కొలీజియంలు అభ్యర్థుల పేర్లను (రిటైర్డ్ న్యాయమూర్తులు) న్యాయమంత్రిత్వ శాఖలోని న్యాయ విభాగానికి పంపించవచ్చు. అప్పుడు న్యాయ విభాగం ఆ అభ్యర్థులకు సంబంధించిన ఆ ఇన్‌పుట్స్, వివరాలను సుప్రీంకోర్టు కొలీజియానికి పంపిస్తుంది. అప్పుడు సుప్రీంకోర్టు కొలీజియం ఒక తుదిపిలుపులో జడ్జిలుగా ఎంపికైన వ్యక్తుల నియామకాల విషయాన్ని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. రాష్ట్రపతి నూతనంగా నియమితులైన జడ్జిల వారంటె అపాయింట్‌మెంట్‌పై సంతకం చేస్తారు. ఈ తాత్కాలిక జడ్జిల నియామక ప్రొసీజర్ ఊహించినట్లు ఈ విధంగానే ఉండకుండా రాష్ట్రపతి వారెంట్ అపాయింట్‌మెంట్‌పై సంతకం చేయని పక్షంలో జడ్జిల నియామకానికి రాష్ట్రపతి సమ్మతిని కోరవచ్చు. ఒక కేసులో తప్ప పదవీవిరమణ చేసిన న్యాయమూర్తులను తాత్కాలిక న్యాయమూర్తులుగా నియమించే అవకాశం లేదని ఇంతకుముందు అధికారులు ఈ విషయాన్ని లేవనెత్తారు. హైకోర్టుల్లో తాత్కాలిక జడ్జిల నియామకాలకు సంబంధించి 2021 ఏప్రిల్ 20న వెలువరించిన తీర్పులో అత్యున్నత న్యాయస్థానం కొన్ని షరతులను విధించింది. కాగా, ఆతర్వాత అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్.గవాయ్ (ప్రస్తుత సిజెఐ), సూర్యకాంత్ లతో కూడిన ధర్మాసనం కొన్ని షరతులను సడలించింది. కొన్నింటిని నిలిపివేసింది. మాజీ చీఫ్ జస్టిస్ ఎస్ఏ.బాబ్డే రాసిన ఈ తీర్పులో పెండింగ్‌లో ఉన్నటువంటి కేసులను పరిష్కరించడానికి రెండు నుంచి మూడు సంవత్సరాల కాలానికి ప్రకటించిన వ్యవధిలో హైకోర్టులలో తాత్కాలిక న్యాయమూర్తులను నియమించవచ్చని ఆదేశించింది. మంజూరు చేసిన 80శాతం మంది న్యాయమూర్తులతో హైకోర్టు పనిచేస్తుంటే తాత్కాలిక న్యాయమూర్తులను నియామకం చేయకూడదనే ఒక షరతు ఉండగా, తాత్కాలిక న్యాయమూర్తులు ప్రత్యేకంగా కూర్చుని ధర్మాసనంలో కేసులను పరిష్కరించుకోవచ్చని మరొక షరతు తెలిపింది. అయితే ఈ షరతులను సడలిస్తూ మంజూరైన సంఖ్యాబలంలో ఆ సమయంలో కొందరి న్యాయమూర్తుల నియామకాలు నిలిచిపోయిన పక్షంలో ఖాళీల రిక్రూట్‌మెంట్ అవసరం 20శాతానికి మించ ఉండకూడదని తెలిపింది.తాత్కాలిక న్యాయమూర్తుల నియామకాన్ని రెండు నుంచి ఐదుగురు వరకు కొనసాగించాలని, మొత్తం సంఖ్యా బలంలో తాత్కాలిక న్యాయమూర్తులు 10శాతానికి మించకూడదని కూడా ధర్మాసనం తెలియజేసింది.'అడ్‌హక్ న్యాయమూర్తులు హైకోర్టు న్యాయమూర్తులు అధ్యక్షత వహించే ధర్మాసనంలో కూర్చుని అప్పీళ్లను పరిష్కరిస్తారు'అని అత్యున్నత న్యాయస్థానం ఆదేశం వెల్లడించింది. 'ఏ రాష్ట్రానికి చెందిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినా ఏ సమయంలోనైనా రాష్ట్రపతి ముందస్తు అనుమతి తీసుకుని ఏ వ్యక్తినైనా ఆ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించే అవకాశం లేదా ఏ ఇతర హైకోర్టు న్యాయమూర్తి పదవినైనా ఏ ఇతర వ్యక్తికైనా అప్పగించమని అభ్యర్థించవచ్చు' అని రాజ్యాంగంలో అరుదుగా ఉపయోగించే ఆర్టికల్ 224ఎ తెలియజేసింది.

## వాడివేడి వాదనల మధ్య... బిఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కాల్చివేత

**న్యూఢిల్లీ / కోల్‌కతా :** తీవ్రస్థాయిలో వాడివేడి వాదనల నడుమ ఆవేశం పతాకస్థాయికి చేరడంతో సరిహద్దు భద్రతా దళానికి (బిఎస్ఎఫ్) చెందిన ఒక జవాన్ తన సీనియర్‌ను కాల్చి చంపాడు. ఈ సంఘటన పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాలోని ఒక క్యాంపు వద్ద జరిగింది. ఆదివారం అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సంఘటన శనివారం రాత్రి ధులియన్‌లోని ఒక బిఎస్ఎఫ్ క్యాంపు వద్ద దాదాపు 1030గంటల సమయంలో చోటుచేసుకుందని వారు చెప్పారు. ఇరువురు మధ్య వేడెక్కిన వాదనల నడుమ కానిస్టేబుల్ శివకుమార్ మిశ్రా తన సర్వీస్ రైఫిల్‌తో తన సీనియర్ అయిన హెడ్‌కానిస్టేబుల్ రతన్‌సింగ్ షెకావత్‌ను కాల్చి చంపాడని, వెంటనే నిందితుడైన కానిస్టేబుల్ శివకుమార్ మిశ్రాను అరెస్ట్ చేశామని అధికారులు చెప్పారు. ఇటీవల ముర్షీదాబాద్‌లో చోటుచేసుకున్న మత ఘర్షణల తర్వాత ఈ ప్రాంతంలో ఉన్న బిఎస్ఎఫ్ యూనిట్ ఈ ఇద్దరూ ఉన్నారని వారు వివరించారు. కాగా, ఈ సంఘటనపై బిఎస్ఎఫ్ ఈ సంఘటన వెనక ఉన్న ఖచ్చితమైన కారణాలను నిర్ధారించేందుకు ఒక కోర్టు ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించినట్లు అధికారులు తెలియజేశారు. 56 ఏళ్ల హెడ్‌కానిస్టేబుల్ రతన్‌సింగ్ షెకావత్ సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్)లో 1989లో చేరారు. ఆయన 119బెటాలియన్ దళంలో నియమించబడ్డారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన షెకావత్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. నిందితుడు శివకుమార్ మిశ్రా కూడా అదే బెటాలియన్‌కు చెందిన వాడని అధికారులు చెప్పారు.

# 272 మిలియన్లకు పైగా పిల్లలు బడి బయటే !

### 'యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్' బృందం తాజా నివేదిక

**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా బడి బయట ఉన్న వారి సంఖ్య నానాటికీ అధికం అవుతోంది. దీంతో యావత్ ప్రపంచం ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా బడి బయట ఉన్నవారి సంఖ్య 272మిలియన్లు కాగా, అది గత అంచనా కంటే 21మిలియన్లకు పైగా ఎక్కు వని 'యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్' (జెమ్) టీమ్ తెలిపింది.2025నాటికి దేశాలు వారి జాతీయ లక్ష్యాల కంటే 75 మిలియన్ల మంది దారితప్పనున్నాయని యునెస్కో 'జెమ్' బృందం తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ పెరుగుదలకు నివేదిక రెండు కారణాలను విపులీకరిస్తోంది. 'కొత్త నమోదు లేదా హాజరు డేటా అకౌంట్ 8మిలియన్లకు లేదా 38శాతం పెరుగుదలకు కారణం అయ్యింది.2021సంవత్సరంలో ఆఫ్ఘనిస్థాన్‌లో మాధ్యమిక పాఠశాలల వయస్సు బాలికలపై నిషేధం కూడా ఈ పెరుగుదలకు దోహదపడింది' అని ఆ నివేదిక చెప్పింది. రెండవకారణం నవీకరించబడిన ఐక్యరాజ్యసమితి అంచనాలు 13మిలియన్లు లేదా మిగిలిన 62శాతం పెరుగుదలకు కారణమయ్యాయి. పాఠశాల వెలుపలి నమూనాలో చివరిగా ఉపయోగించిన అంచనాలతో పోలిస్తే 2024 ప్రపంచ జనాభా ప్రాస్పెక్ట్స్ అంచనా ప్రకారం 2025లో 6నుంచి 17సంవత్సరాల వయసుగల వారి సంఖ్య 49మిలియన్ల కంటే అధికంగా (లేదా 3.1శాతం) ఉందని ఆ నిదేదిక జోడించింది. పాఠశాల వెలుపల ఉన్న జనాభాపై సంఘర్షణల ప్రభావాన్ని సంఘర్షణలు తక్కువగా అంచనా వేయవచ్చని, దీనిని 'సంఘర్షణల డేటా సేకరణ' అంటారని కూడా ఆ రిపోర్ట్ పేర్కొంది. ప్రపంచ జనాభా అంచనాలలో మార్పు బడి బయట ఉన్నవారి రేటు, జనాభా అంచనాలను ప్రభావితం చేస్తుంది. అయితే ఆ ప్రభావం పరిమాణం నమోదు, హాజరు డేటా మూలంపై ఆధారపడి ఉంటుంది. మూలం పరిపాలనా డేటా అయితే, పూర్తి పెరుగుదల జనాభా పాఠశాల వెలుపల ఉన్న జనాభాకు బదిలీ చేయబడుతుంది. ఎందుకంటే నమోదు హాజరుపై డేటా మూలంపై ఆధారపడి ఉంటుంది. కానీ మూలం సర్వే డేటా అయితే జనాభా పెరుగుదల పాఠశాలలో, పాఠశాల వెలుపల జనాభాకు దామాషా ప్రాతిపదికన బదిలీ అవుతుంది.పాఠశాల వయసు జనాభాలో కొంత భాగం మాత్రమే పాఠశాలకు దూరంగా ఉన్నట్లు అంచనావేయబడింది' అని యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ టీమ్ పేర్కొంది. మొత్తం మీద 11 శాతం ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లలలో (78మిలియన్లు), లోయర్ సెకండరీ స్కూల్ వయస్సుగల కౌమారదశలు (64మిలియన్), 31శాతం అప్పర్ సెకండరీ పాఠశాల వయస్సు యువత (130మిలియన్లు) బడికి దూరమయ్యారు. ప్రాంతీయ, సగటుల అంతర్గతంగా స్థిరమైన ధోరణులను రూపొందించడానికి ఈ నమూనా బహుళ డేటా వనరులను ఉపయోగించింది.

బడికి దూరమైన జనాభా సంఘర్షణ ప్రభావాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారని జెమ్ టీమ్ నివేదిక తెలిపింది. దీర్ఘకాలిక ట్రెండ్ కొనసాగుతుందని భావించలేం కానీ సంక్షోభాల స్వల్ప, మధ్యకాలిక ప్రభావాలను అర్థం చేసుకోవడానికి సాధారణంగా సమాచారం తగినంత ఉండదని,పాఠశాల భాగస్వామ్యంపై సంఘర్షణలు పేరుకుపోతున్నాయని, అందువల్ల బడిబయట ఉన్న జనాభాను తక్కువగా అంచనా వేసే అవకాశం లేకపోలేదని ఆ నివేదిక వెల్లడించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బిసి సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేలా బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడి చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కాంగ్రెస్ డిక్లరేషన్ అమలు పైన ప్రత్యేక మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలనిడిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసిల విషయంలో కాంగ్రెస్ నయవంచన చేసిందని ఆరోపించారు.
కులగణనను తప్పుల తడకగా చేశారని, జనాభాలో 60 శాతం ఉన్న బిసిలకు మూడు మంత్రిపదవులు ఇస్తారా? అని ప్రశ్నించారు. బిసి సబ్ ప్లాన్ కు చట్టబద్ధత ఏదని,బిసి మంత్రుల వద్ద కీలక శాఖలు లేవని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.



## తొలి మహిళా డ్రైవర్ వాంకుడోత్ సరితకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా చేరిన వాంకుడోత్ సరితకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అవకాశాలు వస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరని సరిత నిరూపించారని అన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసిన సరితకు సిఎం అభినందనలు చెప్పారు. ప్రస్తుతం ఆర్‌టిసి బస్సులకు మహిళలనే యజమానులుగా చేస్తున్న సందర్భంలో మహిళా డ్రైవర్ నియామకం ఓ కీలక ముందడుగు అన్నారు. మహిళలు విద్య, విజ్ఞానం, వృత్తి, వ్యాపారం, క్రీడలు, సైన్యం వంటి అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. గృహ బాధ్యతలతో పాటు సమాజ నిర్మాణంలోనూ మహిళల పాత్ర అపూర్వమైందన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ, అడ్డంకులను అధిగమించి మహిళలు విజయాల బాటలో ముందుకెళ్తున్నారని, సరిత అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. ఇందిరా మహిళా శక్తి పథకంతో రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలకు సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కోటి మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యసాధన కోసం ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు.

**రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్**

ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సిత్య తండాకు చెందిన వి.సరిత మిర్యాలగూడ డిపోలో డ్రైవర్‌గా విధులలో చేరారు. సరిత హైదరాబాద్ టూ మిర్యాలగూడ బస్సును నడుపుతున్నారు. గతంలో ఢిల్లీలో రవాణా సంస్థలో 10 సంవత్సరాలు డ్రైవర్‌గా విధులు నిర్వహించారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తనకు స్వస్థలంలో డ్రైవర్‌గా అవకాశం ఇవ్వాలని ఇటీవల రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో మాట్లాడి, తెలంగాణ ఆర్‌టిసి మిర్యాలగూడ డిపోలో నియమించారు. తనకు అవకాశం ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మహిళా డ్రైవర్ సరిత ధన్యవాదాలు తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు, తాజాగా ఆర్‌టిసిలో మహిళా డ్రైవర్‌గా అవకాశం ఇవ్వడం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళా డ్రైవర్ వి. సరితను మంత్రి పొన్నంప్రభాకర్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



## అన్ని సంస్థల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి

మంత్రి జయంత్ చౌదరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని సంస్థల సహకారంతో విద్యా అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి సూచించారు. విద్య ఒక్కటే సమాజంలో పరివర్తన తీసుకొస్తుందన్నారు. కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి హైదరాబాద్‌లోని ఎస్‌సిఇఆర్‌టిని ఆదివారం సందర్శించారు ఈ సందర్భంగా గోదావరి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనలో కెజిబివి పాఠశాల విద్యార్థులు తరగతిగదులలో వినియోగిస్తున్న బోధనాభ్యసన సామాగ్రి, బడిబాట, సమ్మర్ క్యాంప్ లాంటి వివిధ ఫోటోలన ఆయన తిలకించారు. అలాగే విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఉచిత యూనిఫాములను కూడా పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి జయంత్ చౌదరి మాట్లాడుతూ డైట్స్, ఎస్‌సిఇఆర్‌టి నిర్వహించే పరిశోధనలను , అధ్యయనాలను క్షేత్రస్థాయిలో అమలుజరిగేలా చూడాలన్నారు. ప్రపంచంలోనే ఐటి కి కేంద్రంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు కొత్త సాంకేతికతను తరగతి గదిలో ఉపయోగించాలని ఆయన సూచించారు.

## వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో విద్యుత్ ప్రమాదం

ఇద్దరు మృతి, 8మందికి గాయాలు



**ప్రజాపక్షం/కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో ఘోర ప్రమాదం జరిగింది. కోరుట్లలో బాలాజీ వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో వినాయక విగ్రహాలు ఒకచోటు నుండి మరోచోటుకు తరలించే సమయంలో 33 కె.వి విద్యుత్ తీగలు తాకడం వలన ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వెల్లుట్ల సాయి, అల్వాల వినోద్ ఇద్దరు మృతి చెందారు. మరో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, మరికొందరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తయారు చేసిన విగ్రహాలను మరో చోటికి తరలించే క్రమంలో హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. అయితే గాయపడినవాళ్లు మరో ఇద్దరు పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిలో అలువాల నితిన్, వెంకట్ రెడ్డి రాజేష్, వెల్లుట్ల కృష్ణ, సాయినాథ్, హనుమంతు, ఆకాష్, రోషన్, హర్షద్‌లు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేరుకొని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మోదీకి స్వాగతం పలికిన సైప్రస్ అధ్యక్షుడు



**నికోసియా :** మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారంనాడు తొలి విడతగా సైప్రస్‌కు చేరుకున్నారు. రెండురోజులపాటు ఆయన సైప్రస్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్ తో సమావేశమై రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు కృషి చేస్తారు. అదేవిధంగా ఒక ప్రత్యేక విశేషం ఏమిటంటే, సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలిడ్స్ లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్ళి ప్రధానమంత్రి మోదీకి స్వాగతం పలికారు. గడచిన రెండు దశాబ్దాలలో సైప్రస్‌లో పర్యటించిన మొదటి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాత్రమే. ‘‘సైప్రస్‌కు చేరుకున్నాను, సైప్రస్ దేశాధ్యక్షుడికి నా కృతజ్ఞతలు. ప్రత్యేకంగా విమానాశ్రయానికి వచ్చి ఆహ్వానం పలికారు. ఈ పర్యటనలో భారత్–సైప్రస్ సంబంధాలు ప్రాముఖ్యత సంతరించుకుంటాయి’’ అని ఎక్స్ వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు. సైప్రస్‌కు బయలుదేరేముందు మోదీ ఒక పోస్టింగ్ పెడుతూ, యూరోపియన్ యూనియన్‌లో సైప్రస్ భారత్‌కు ఒక సన్నిహిత మిత్రదేశమని, ఒక ముఖ్యభాగస్వామి అని పేర్కొన్నారు. నికోసియాలో మోదీ వ్యాపార దిగ్గజాలతో సమావేశమవుతారు. ఇది చారిత్రక పర్యటన అని సైప్రస్ అధ్యక్షుడు మోదీకి స్వాగతం పలికిన సందర్భంగా అన్నారు. ‘‘సైప్రస్‌కు స్వాగతం ప్రధానమంత్రి మోదీగారూ. ఒక వ్యూహాత్మకమైన భాగస్వామ్యానికి ఇక పరిమితి లేదు’’ అని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.
సైప్రస్‌లో హోటల్‌కు మోదీ చేరుకోగానే అక్కడ ఉన్న భారతీయులు ఆయనకు ఆహ్వానం పలికారు. వందేమాతర గీతం ఆలపించారు. భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. స్థానికంగా ఉన్న భారతీయులతో అనుభూతులను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అదేవిధంగా సైప్రస్ వెళ్ళిన భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్‌తో ఆ దేశ విదేశాంగమంత్రి కాంబోస్ సమావేశమయ్యారు. విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు. సైప్రస్ నుండి మోదీ కెనడాలో జరుగుతున్న జి–7 సదస్సుకు వెళతారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఆయన సదస్సుకు వెళుతున్నారు. ఆ తర్వాత ఆయన క్రొయేషియాలో పర్యటిస్తారు.

## స్మార్ట్ సిటీ పేరుతో 70వేలమందికి కుచ్చుటోపీ

రూ.2,700కోట్లు దోచుకున్న ఇద్దరు సోదరులు



**జైపూర్ :** రాజస్థాన్ కు చెందిన సుభాష్ బిజరాణీ, రణవీర్ బిజరాణి స్మార్ట్ సిటీ పేరు చెప్పి, దాదాపు 70 వేలమందిని, వారి బంధువులను మోసంచేసి, దాదాపు రూ,2,676కోట్ల రూపాయలు దోచుకున్నారు. రాజస్థాన్‌లోని సికార్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు అన్నదమ్ములు నెక్సా ఎవర్‌గ్రీన్ అనే కంపెనీని పెట్టి, గుజరాత్ లోని ధోలేరా స్మార్ట్ సిటీలో ఇళ్ల స్థలాలను కొంటే పెద్దఎత్తున లాభం వస్తుందని ఆశపెట్టి వేలాది మంది పెట్టుబడిదారులను మోసం చేశారు. ధోలేరా స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి అందమైన భవంతుల చిత్రాలు చూపి కలల ప్రపంచంలో విహరింపజేసి మోసం చేశారని పెట్టుబడిదారులు ఆరోపిస్తున్నారు. కోట్లు చెల్లించిన వారంతా ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఆకర్షణీయమైన స్కీమ్‌లు పెట్టి చాలా మందికి కమిషన్లు ఆశచూపి, కొత్తవారిని చేర్పించడంలో టార్గెట్లు పెట్టి, పలువురికి ల్యాప్‌టాప్‌లు, బైక్‌లు, కారులు కూడా బహుమతిగా ఆఫర్ చేసి, పెట్టుబడిదారులను విపరీతంగా పెంచుకున్నారు. కొందరికి ప్రత్యేక ఐడీ గుర్తింపు ఇచ్చి, ఎంత ఎక్కువ మంది పెట్టుబడిదారులను చేర్పిస్తే అంత అదనంగా కమిషన్ వస్తుందని హామీలు ఇచ్చి బుట్టలో వేసుకున్నారు.

**ధోలేరా స్మార్ట్ సిటీ స్కామ్**

రణవీర్ బిజారాణి మొదట 2014లో ధోలేరాలో కొంత భూమిని కొనుగోలు చేశాడు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అయిన సుభాష్ కూడా రిటర్మెంట్ తర్వాత వచ్చిన రూ.30లక్షలతో అక్కడే భూమి కొనుగోలు చేశాడు. 2021లో ఇద్దరు అన్నదమ్ములు నెక్సా ఎవర్ గ్రీన్ కంపెనీని స్థాపించి అహ్మదాబాద్‌లో రిజిస్టర్ చేశారు. ఆ కంపెనీ ధోలేరా స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగమని ప్రచారం చేసుకున్నారు. తమ వద్ద 1300 బిఘాల భూమి ఉందని, దీనిని ప్రపంచ స్థాయి స్మార్ట్ సిటీగా మార్చబోతున్నామని పబ్లిసిటీ చేశారు. ఫ్లాట్లు, పాట్లు, పెట్టుబడి స్కీమ్‌లతో భారీ లాభాల ఆశచూపి 70వేల మంది ప్రజలను ఆకట్టుకుని పెట్టుబడులు వసూలు చేశారు. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన వారి నుంచి ఏకంగా రూ.2,676కోట్ల రూపాయలు వసూలు చేశారు. కంపెనీ అధికారులుగా సలీం ఖాన్, సమీర్, దతార్‌సింగ్, ఓంపాల్ వంటి వారిని ఎంచుకున్నారు. రాజస్థాన్ లో వేలాది మంది ఏజెంట్లను నియమించుకుని వారికి భారీ కమిషన్లు ముట్టచెప్పారు. కేవలం కమిషన్ గానే 1500 కోట్ల రూపాయలు చెల్లించారంటే ఎంత పెద్దఎత్తున మోసం చేశారో తెలుస్తుంది. తర్వాత వారు రాజస్థాన్‌లో లగ్జరీ కార్లు, గనులు, హోటళ్లు, అహ్మదాబాద్‌లో ఫ్లాట్‌లు, గోవాలో 25 రిసార్ట్ లు కొనుగోలు చేశారు.
250 కోట్ల రూపాయలు ఉంచుకుని, మిగతా డబ్బు 27షెల్ కంపెనీలకు బదిలీ చేసి, తర్వాత ఓ రోజు ముహూర్తం చూసుకుని,అన్ని ఆఫీసులు మూసివేసి పరారయ్యారు. రాజస్థాన్ పోలీసులు జోథ్‌పూర్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు 1034 రైతు వేదికల్లో ‘రైతు నేస్తం’

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేడు సాయంత్రం 4 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 1034 రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆడిటోరియం వద్ద ఏర్పాట్లను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, రాష్ట్ర వ్యాప్తంగా 1600 రైతువేదికలలో, ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఈ ఆడిటోరియంలో దాదాపు 1500 మంది రైతులు పాల్గొంటారని తెలిపారు. తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ఇప్పటికే 566 రైతువేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి, ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా ముఖాముఖి ఆదర్శరైతుల అనుభవాలు, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను రైతులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 6.35 లక్షల మంది రైతుల ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడమే కాకుండా, వివిధ రైతుల అనుభవాలను తెలుసుకున్నారని చెప్పారు. ఇప్పటికే మన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ఒకటిన్నర సంవత్సరంలోనే దాదాపు 78000 కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేశామన్నారు. రుణమాఫీ, సన్న ధాన్యానికి బోనస్, అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు, అన్ని పంటలకు సబ్సిడీపై సూక్ష్మ సేద్య పరికరాల సరఫరా వంటివి మచ్చుతునక అన్నారు. ఈ కార్యక్రమాన్ని వారి వారి జిల్లాల్లో ఉన్న రైతు వేదికల నుంచి ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రైతులు, పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విజ్ఞప్తి చేశారు.

## గవర్నర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ అవార్డు అందుకున్న పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** అత్యధిక సంఖ్య లో రక్తదానాన్ని చేసేందుకు ప్రోత్సాహించినందుకు గాను వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదివారం రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రా జ్ భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు జిష్ణు దేవ్ వర్మచేతుల మీదుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హై బ్లడ్ డోనార్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు.



## ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడలు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న జిల్లాస్థాయి బాడ్మింటన్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశా యి. ఈ ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రంజిత్‌రెడ్డి హాజరై క్రీడాకారులు బహుమతి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విజేతలైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. సెక్రటరి డాక్టర్ కొమ్ము రాజేందర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి 75ఎంట్రీలు రావడం, క్రీడాకారులు ఉచిత భోజన సౌకర్యం కల్పించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి పాల్గొన్న క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్హత సాధించారన్నారు.అనంతరం అసోసియేషన్ బాధ్యులు రావుల మురళి, ఆర్.సాంబమూర్తి, కొప్పుల శంకర్ బహుమతులు అందజేశారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకూ ఉద్యమిస్తాం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువత, విద్యార్థులకు తెలంగాణ జాగృతి ఒక రాజకీయ శిక్షణ వేదికగా మారబోతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు ఉద్యమిస్తామని ప్రకటించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ‘లీడర్’ పేరుతో నిర్వహించబోయే రాజకీయ శిక్షణా తరగతుల పోస్టర్‌ను కవిత హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా మూడు రోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహిస్తామని, జులైలో హైదరాబాద్ లో శిక్షణా తరగతులు ప్రారంభించి, ఆగస్టు నుంచి జిల్లాల్లో ప్రతి నెలా నిర్వహిస్తామని కవిత తెలిపారు. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, యువత శిక్షణా తరగతుల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లోకి వస్తే స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడు తుందని, తెలంగాణ గడ్డకు ప్రశ్నించేతత్వం ఉన్నదని, ఆ ప్రశ్నించేతత్వాన్ని ముందుతరాలకు కూడా నేర్పించాలన్నారు. సర్పంచ్ మొదలుకొని ఎమ్మెల్యే, ఎంపి వంటి ప్రజాప్రతినిధుల విధులు, పరిధి, పరిమితులు అందరికీ తెలియాల్సిన అవసరం ఉన్నదని, ప్రజాసమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడం, అభివృద్ధికి నిధులు సాధించడం వంటి అనేక అంశాలు శిక్షణ తరగతులలో వివరిస్తారని కవిత తెలిపారు. యువతను, మహిళలను, తెలంగాణ వాదాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రతీ ఒక్క నాయకత్వాన్ని తాము ప్రోత్సహిస్తున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం నేపథ్యంలో రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో 33 శాతం మహిళ నాయకులు కావాల్సిన అవసరం ఉన్నదని, డీలిమిటేషన్ తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 153కు పెరుగుతాయని, లోక్ సభ సీట్లు కూడా పెరుగుతాయని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మహిళా నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ నిర్ణయాలు జరిగే చోట మహిళల అభిప్రాయాలు కూడా ఉండాలన్నారు. కాగా యువత, విద్యార్థులు కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు.

# రాఫెల్‌ను కూల్చేశామనడం పాక్ కట్టుకథ

వాటి ముందు చైనా,అమెరికా జెట్స్ దిగదొడుపే

దస్సాల్ట్ ఎవియేషన్ సిఇఒ ప్రకటన



**పారిస్ :** ఆపరేషన్ సింధూర్ సందర్భంగా రాఫెల్స్ యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్థాన్ ప్రచారం చేయడాన్ని దస్సాల్ట్ ఎవియేషన్ చైర్మన్–సిఇఒ ఎరిక్ ట్రాపియర్ నిర్ద్వంద్వంగా కొట్టిపారేశారు. రాఫెల్ ముందు అమెరికా, చైనాలకు చెందిన యుద్ధవిమానాలు ఎందుకూ పనికిరావని, రాఫెల్ యుద్ధ విమానాలు సర్వోత్కృష్టమైనవని ఆయన స్పష్టం చేశారు.రాఫెల్ ఫైటర్ జెట్ ప్రపంచంలో బహుముఖంగా పోరాడగల శక్తిసామర్థ్యాలున్న యుద్ధ విమానమని చెప్పారు. గగనతలం నుండి గగనతలంలో దాడులు చేయడంలో, గగనతలంనుండి భూతలంపైకి దాడులు చేయడంలోగానీ, అణుశక్తిసామర్థ్యం కలిగి ఉండటంలోగానీ, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఆపరేషన్స్‌లోగానీ రాఫెల్ బహుముఖ ప్రజ్ఞాపాటవం ముందు ఏదీ సరిపోదన్నారు. ఐతే అమెరికాకు చెందిన నార్త్రోప్ బి–2 స్పిరిట్ బాంబర్ ఎఫ్–22 యుద్ధ రంగంలో అగ్రస్థానంలో ఉందని అంగీకరిస్తూనే, ఎఫ్–35తో పోలిస్తే కార్యాచరణలో చాలా అత్యుత్తమమైన పనితీరును ప్రదర్శిస్తుందన్నారు. చరిత్రలో విజేతలకు కూడా సైన్యాలను కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్ సక్సెస్‌ను స్పష్టంగా తెలియజేస్తోందన్నారు.
రాఫెల్ విమానాలలో లోపాలు ఉన్నాయంటూ భారత వైమానిక దళం (ఐఎఎఫ్) నుండి దస్సాల్ట్‌కు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని ఫ్రెంచ్ పత్రిక ‘‘‘ఛాలెంజెస్’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రాపియర్ చెప్పారు. పారిస్‌లో త్వరలో వైమానికదళ ప్రదర్శన జరగబోతున్నది. ఈ సందర్భంగా ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. మూడు రాఫెల్ యుద్ధ విమానాలను కూల్చివేశామని పాకిస్థాన్ కట్టుకథలు చెబుతోందని, అవన్నీ అసత్యాలేనని అన్నారు. ‘‘రాఫెల్ యుద్ధ విమానాలను భారత దేశం నష్టపోయిందని చెప్పడం ఖచ్చితమైన సమాచారం కాదన్నారు. ‘‘భారత ప్రభుత్వం మాకు దీని గురించి ఎలాంటి సమాచారం చెప్పలేదు, అందువల్ల ఏం జరిగిందనే విషయం మాకు సరిగ్గా తెలియదు, మాకు ఇప్పటికే తెలిసిన విషయం ఏమిటంటే, పాకిస్థాన్ చెబుతున్నదంతా సరైందికాదు’’ అని ట్రాపియర్ అన్నారు. ‘‘పాకిస్థాన్ చెప్పుకుంటున్నదంతా పచ్చి అబద్ధం’’ అన్నారు.
గగనతలంలో జరిగే ఆధునిక యుద్ధ కార్యకలాపాలను గురిచూసి లక్ష్యాలను దెబ్బతీసే కార్యకలాపాలద్వారా నిర్ధారించాల్సి ఉంటుందిగానీ, అసత్య ప్రచారాలద్వారా నిర్ధారించడం సాధ్యంకాదని అన్నారు. యుద్ధ విమానాలను మీరు నడిపేటప్పుడు కోరుకునే ఫలితం నష్టాలను తప్పించుకోవడం కాదనీ, దాని ద్వారా సాధించాల్సిన కార్యాలను, లక్ష్యాలను పూర్తిచేయడం కోసమేనని అన్నారు. ఆధునిక యుద్ధతంత్రంలో విజయం అనేదాన్ని వ్యూహాత్మక ఫలితాలద్వారా కొలిచిచూడాలిగానీ, ఎంత నష్టం జరిగిందనే ప్రాతిపదికపై చూడకూడదన్నారు. చరిత్రలో జరిగిన యుద్ధాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుకుతెస్తూ, రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్‌కు వ్యతిరేకంగా కూటమి దేశాలు కూడా సైన్యాన్ని కోల్పోయాయనీ, అంతమాత్రంచేత యుద్ధ కూటమి రెండో ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిందని ఎవ్వరూ చెప్పలేదని అన్నారు. ‘‘అక్కడ ఏదైనా నష్టాలు జరిగాయా? లేక రాఫెల్ ద్వారా తలపెట్టిన యుద్ధ లక్ష్యాలు నెరవేరలేదా? అనే విషయాలను మనం పరిశీలించాల్సి ఉంది, అప్పుడే పూర్తి నిజాలు బహిర్గతమవుతాయి, అప్పుడు కొంతమందికి దిగ్భ్రాంతి కలగవచ్చు’’ అన్నారు.

**2028 నాటికి హైదరాబాద్‌లో రాఫెల్ ప్రధానభాగాల నిర్మాణం**

ఇదిలా ఉండగా, గతవారంలో జరిగిన పరిణామం ఒక శుభవార్తను భారత్‌కు తెలియజేసింది. దస్సాల్ట్ ఎవియేషన్, భారత్ టాటా అడ్వాన్స్‌డ్ సిష్టమ్స్ లిమిటెడ్ (టిఎఎస్ఎల్) కలిసి ఒక ఒప్పందాన్ని తయారుచేసుకున్నాయి. దీని ప్రకారం రాఫెల్ యుద్ధవిమానాల ప్రధాన శరీరభాగాన్ని భారత్‌లోనే పూర్తిగా తయారు చేస్తారు. టిఎఎస్ఎల్ భాగస్వామ్యంలో అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌లోనే కీలకమైన రాఫెల్ నిర్మాణాన్ని ఉత్పత్తి చేసేందుకు తగిన సదుపాయాలు సమకూర్చనున్నారు. 2028 నాటికి ఈ ప్రధానభాగాల నిర్మాణం ప్రారంభం అవుతుందని అంచనావేస్తున్నారు. రాఫెల్‌కు సంబంధించిన ముఖభాగం, కేంద్రభాగం, వెనుకన ఉండే భాగాలు హైదరాబాద్‌లోనే ఉత్పత్తి చేస్తారు. ఫ్రాన్స్ వెలుపల వాటి ఉత్పత్తి కాబోతున్నాయి. ఇదొక మైలురాయి ఘట్టం. తద్వారా భారత్–ఫ్రాన్స్ రక్షణ వ్యవస్థలమధ్య భాగస్వామ్య బంధం మరింత బలోపేతం కానున్నది. ప్రపంచ వ్యాప్తంగా భారత్ సప్లైచైన్ పాత్ర కూడా బ్రహ్మాండగా పెరగనున్నది.

## పేదరికం జయించి నీట్ ఫలితాలలో మెరిసె



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** నారాయణపేట్ జిల్లా ఊట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎన్.చిన్నరాజు జయమ్మ దంపతుల కూతురు ఎన్.రమాదేవి శనివారం వెలువడిన నీట్ ఫలితాలలో 436 మార్కులు సాధించింది. ఎన్.రమాదేవి తండ్రి చిన్నరాజు వ్యవసాయం చేస్తూ కూతురును చదివించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎన్.రమాదేవి జాతీయ స్థాయిలో రాణించడంతో ఆదివారం గ్రామవాసులు బంధువులు స్నేహితులు చాలా సంతోషం వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండలం, గుమ్మడం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ , బీఆర్ఎస్ పార్టీ విభాగానికి చెందిన భువనేశ్వర్ రెడ్డి తల్లి సోమమ్మ దశ దినకర్మ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పెబ్బేరు మండలం యపర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ఆరోగ్య బాగాలేదని తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి ఆరరోగ్య పరిస్థితి తెలుసుకొని పరామర్శించారు. మాజీ మంత్రి వెంట మండల అధ్యక్షులు వనం రాములు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/ ధన్వాడ :** మండల కేంద్రంలోని కంసాన్ పల్లి గ్రామానికి వెళ్లే రహదారి సింపుల్‌లోని కాలువ దగ్గర రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడి నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని సిపిఐ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు పి.వెంకటేష్ ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ధన్వాడ మండల కేంద్రంలో సీసీ రోడ్డు గుంతలమై పోయిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం నాణ్యతలేని సిసి రోడ్ల వేసి అక్కడ కొత్త బ్రిడ్జ్ నిర్మాణం చేయకుండా పనులు చేశారని ఆయన గుర్తు చేశారు. గుంతలు ఏర్పడి నెలలు గడుస్తున్న మండల అధికారులు గానీ జిల్లా స్థాయి పంచాయతీ రాజ్ అధికారులు కానీ పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. రెండు రోజుల్లోపు గుంతలను పూర్తి నిర్మాణ పనులు చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో రోడ్డు పై రాస్తారోకో కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, మల్లేష్, రాజు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడియాక్టు



**ప్రజాపక్షం/అచ్చంపేట :** రైతులకు విత్తనాలు , పురుగుమందులు , ఎరువులలో అక్రమాలు జరిగితే పిడియాక్టు నమోదు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని విత్తనాలు , ఫర్టిలైజర్ షాపులను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే పిడియాక్టు నమోదుచేస్తామన్నారు. రైతులు విత్తనాలు కొనే ముందు రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చిత్తుకాగితంపై రశీదులు తీసుకోవద్దని, షాపుపేరుమీద ఉన్న రశీదు, బ్యాచ్‌నెంబర్, విత్తనాలట్యాగ్‌నెంబర్, వ్యవసాయ అధికారి తనిఖీతేదితోపాటు విత్తనాలు ఏప్రాంతంలో తయారుచేశారో అవి ఉన్నట్లు చూసుకోవాలన్నారు. స్టాక్ నిర్వహణ రికార్డులు, ఎరువుల బస్తాల లాట్‌నెంబర్లు, సోర్స్‌సర్టిఫికెట్లను పరిశీలించారు. వ్యాపారులు నకిలీవిత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఆమోదించబడిన షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలుచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయచైర్మన్ రాజేందర్, మాజీఎంపిపి రామనాథం, దర్గాకమిటి అధ్యక్షులు రఫీ, కోఆప్షన్‌మెంబర్ ఖాదర్ పాల్గొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/వంగూర్ :** ఈనెల 17న హైదరాబాద్ పట్టణంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న రాష్ట్ర రజకసంఘం మహాసభను విజయవంతంచేయాలని వంగూరు మండల రజకసంఘం కన్వీనర్ సాయిలు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో గోడపోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో తాలుకా సంఘం నాయకులు పాల్గొన్నారు.


## గర్భిణీలకు మెడికల్ కిట్ల పంపిణీ



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాటిలోని 5వవార్డునందు ఉప్పల చారిటబుల్‌ట్రస్టుచైర్మన్, తెలంగాణ మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పలవెంకటేష్ సహకారంతో గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు మెడికల్‌కిట్లని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీ నాయకులు శ్రీరాములు, శివ, గణేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## 17న చలో హైదరాబాద్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో భవన నిర్మాణ కార్మికసంఘం నాగర్‌కర్నూల్ మండలకౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశ అధ్యక్షులుగా సిద్దేశివిజయ్, భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా శివశంకర్, ఎఐటియూసి భవననిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్నపాగశ్రీనివాసులు, భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్మికవర్గానికి చాలాతీరని అన్యాయం చేస్తుందన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోడి కార్మికచట్టాలను యథావిధిగా కొనసాగించాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అదేవిధంగా తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమబోర్డును ఇన్సూరెన్స్‌రంగానికి అప్పుజెప్పే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. ఈనెల 17న కమీషనర్ కార్యాలయంముందు జరిగే ధర్నాను విజయవంతంచేయాలని , నాగర్‌కర్నూల్ మండల భవనకార్మికులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.






ఎల్‌బినగర్‌లో దారుణం..

# హైటెన్షన్ వైర్లు తెగిపడటంతో ఇద్దరు సజీవదహనం

**హైదరాబాద్ :** హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధి సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో దారుణం చోటు చేసుకుంది. ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరు యాచకులపై చింతలకుంట ఫీడర్‌కు సంబంధించిన 11 కెవి వైర్లు తెగిపడ్డాయి. ఈ సంఘటనలో ఇద్దరు యాచకులతో పాటు ఒక కుక్క మృతి చెందింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, సాగర్ రింగ్ రోడ్ సమీపంలోని బాబాయి హోటల్ ఎదురుగా ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయం ముందు ఫుట్‌పాత్‌పై ప్రతిరోజు ఇద్దరు యాచకులు (ఓ వ్యక్తితో పాటు మహిళ) నిద్రిస్తుంటారు. వారిద్దరూ భార్యాభర్తలు అయి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ప్రతి రోజు రోడ్లపై చెత్త కాగితాలను సేకరించి అమ్ముకోవడంతో పాటు భిక్షాటన చేస్తూ జీవితాన్ని గడుపుతున్నారు. రోజు మాదిరిగానే భిక్షాటన అనంతరం శనివారం రాత్రి సదరు మహిళ, వ్యక్తి ఇద్దరు రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద ఉన్న ఫుట్‌పాత్ నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 1:50 గంటల సమయంలో పెద్ద శబ్దంతో 11 కెవి విద్యుత్ వైరు తెగి రేణుక ఎల్లమ్మ తల్లి గుడి ఎదురుగా నిద్రిస్తున్న కుక్కపై మొదట పడి పోయాయి. విద్యుత్ షాక్‌కు గురైన కుక్క ఎగిరి కొంత దూరంలో పడే సమయంలో సదరు 11 కెవి విద్యుత్ వైర్లు పక్కనే నిద్రిస్తున్న ఇద్దరు యాచకులపై పడ్డాయి. విద్యుత్ వైర్లు మీద పడటంతో ఇద్దరు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. అదే సమయంలో స్కూటీపై అటు నుంచి వెళుతున్న ఓ వ్యక్తి విషయాన్ని గమనించి ఎల్బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అప్రమత్తమైన ఎల్బీనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అప్పటికే ఇద్దరు యాచకులతోపాటు ఒక కుక్క ఈ సంఘటనలో మృతి చెందింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుల వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన కొద్ది దూరంలో విద్యుత్ స్తంభానికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడం వల్లనే 11 కెవి విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. వాహనం గుద్దిన తీవ్రతకు ఇన్సులేటర్ మెటల్ రాడ్ విరిగి విద్యుత్ వైర్లు తెగినట్లు భావిస్తున్నాం. ఈ సంఘటనలో ఇద్దరు మృతి చెందడం దురదృష్టకరం. విద్యుత్ వైర్లు తెగడానికి మరి ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నాం.

### కారణం తెలియాల్సి ఉంది: ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

యాచకులు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆదివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 కెవి విద్యుత్ వైర్లు తెగిపోవడం అంత సులువైన విషయం కాదని అన్నారు. విద్యుత్ వైర్లు తెగి పడిన ఘటనలో ఇద్దరు యాచకులు మృతి చెందడం ఎంతో బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమా.. లేక మరి ఏదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ చేపట్టాల్సి ఉందన్నారు. పరిస్థితులను చూస్తుంటే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు కనిపిస్తుందని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ఆహ్వానం

**ప్రజాపక్షం/పెబ్బేరు:** కళాశాలలో గంటల ప్రాతిపదికన పని చేయడానికి ఫిజిక్స్ పోస్ట్ భర్తీ కోసం అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. తూర్పింటి నరేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పిజిబిఎడ్ తో పాటుగా టెట్ పరీక్షను పూర్తి చేసి ఉండాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు సోమవారం నుండి బుధవారం వరకు తమ బయోడేటాతో కళాశాల పని సమయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/- మద్దూర్:** ఆదివారం తెల్లవారుజామున నాగిరెడ్డిపల్లి వాగు నుండి అక్రమంగా ఇసు క తరలిస్తున్న ట్రాక్టర్ (AP22AQ3418) ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. పర్సాపూర్ గ్రా మానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కోరవోని నరేష్. ఓనర్ కోరవొరి సురేష్‌ల మీద కేసు నమోదు చేయడం జరిగిందని మద్దూరు ఎస్సై వివరించారు.

## మక్తల్ కేంద్రంలో ఘనంగా కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణ కేంద్రం పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయురోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం బిజెపి రాష్ట్ర అధికారి ప్రతినిధి శంకరోళ్ళ రవికుమార్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో క్షేత్రస్థాయి నుంచి నిబద్ధతతో అడుగులు వేస్తూ కేంద్ర మంత్రి గా కిషన్ రెడ్డి ఎదిగారని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్దేశించిన లక్ష్యాలు అందుకునేందుకు బొగ్గు గనుల శాఖ ఎంతో కీలకమని ఆ శాఖకు ఎంతో వన్నె తెచ్చి విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. మన రాష్ట్రంలో వెనుకబడిన బిజెపి పార్టీని 8 ఎమ్మెల్యే స్థానాలను 8 ఎంపీ స్థానాలను మూడు ఎమ్మెల్సీలను కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో గెలుచుకున్నము రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని రోజురోజుకు దిగజారే రాజకీయం చేస్తుందని బిజెపి నాయకులు దృష్టిలో ఉంచుకొని రాబోయే స్థానిక సంస్థల గత ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గంలో ఊరూరా బిజెపి జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ జిల్లా కార్యదర్శి కల్లూరి నాగప్ప మున్సిపల చైర్ పర్సన్ పావని మల్లికార్జున్ బిజెపి కృష్ణ మండల మాజీ అధ్యక్షులు జగ్గలి హుస్సేనప్ప జి.శ్రీనివాస్ మాగనూరు మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ మక్తల్ బిజెపి నాయకులు కురవ లింగం విద్యాసాగర్ శివరామ్ మాజీ ఎంపిటిసి తిమ్మప్ప మహేష్ సాగర్ పీకే నరసింహ రాజాగౌడ్ సురేష్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/మద్దూర్ :** 15 సంవత్సరాల తర్వాతపూర్వ విద్యార్థుల సమ్మేళనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు మద్దూర్‌లో 2009–10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దూర్‌లో చదవిన పద వ తరగతి విద్యార్థులు 15 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం తాము చదివిన పాఠశాలల్లో కలుసుకున్నారు. తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 60 మంది పూర్వ విద్యార్థుల ఆత్మీయ స మ్మేళనంలో హాజరైనారు దాదాపుగా 15 సంవత్సరాలు విడిపోయి మళ్ళీ కలుసుకోవడం స్నేహితులు ఉపాధ్యాయులు పరస్పరము పలకరింపుతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకొని సెల్ఫీ ఫోటో లో వారి జ్ఞాపకాలు నెమరు వెసుకుంటూ ఉల్లాసంగా సంతోషంగా గడిపారు. అనంతరము విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వేణుగోపాల్, బాలాజీ హెచ్ భాను ప్రకాష్, లాజర్, లింగప్ప, దానప్పలకు పూలమాల శాలువా పాదాభివందనాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రిటైర్ట్ హెడ్మాస్టర్ ఉపాధ్యాయు ఈ కార్యక్రమంలోమాట్లాడుతూ ఆ రోజుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రపంచలో అన్నింటికన్నా స్నేహం వెలకట్టలేమని పేర్కొన్నారు.

## బిజెపి ప్రభుత్వ పాలనలో దిగజారిన దేశ ప్రతిష్ట

### విద్వేషాలు, ఉద్రిక్తతలే మోదీ ఆయుధాలు
### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**ప్రజాపక్షం / పాన్‌గల్ :** బిజెపి ప్రభుత్వ పాలనలో దేశ ప్రతిష్ట దిగజారిందని, విద్వేషాలు, ఉద్రిక్తతలే మోదీ ఆయుధాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. బిజెపి పాలనపై ప్రజలలో తీవ్ర అసంతృప్తి పెరిగింది. పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారమని, వర్గ పోరాటం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంకోసం ప్రతి సభ్యులు పని చేయాలని, రాష్ట్రంలో దేశంలో అన్ని రకాల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్యలు పరిష్కారానికి ప్రతి సభ్యుడు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతుల కల్తీ విత్తనాలను అరికట్టాలని, ఎరువులు రైతులకు సబ్సిడీతో అందించాలన్నారు. బోనస్ వెంటనే వేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని ఈ సమస్యల పై ప్రజలు పోరాటాల ద్వారా పరిష్కారం అయ్యేటట్లు పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, అన్ని రకాల ప్రజలను, పెట్టుబడిదారులు దోపిడీ చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారుతో విధ్వంసం సృష్టించే విధంగా ప్రయత్నం చేస్తుంది. ఒకవైపు పాకిస్తాన్‌తో యుద్ధం ఆపి, చర్చలు చేస్తామంటున్నారు. అదే మన భారత దేశంలో మావోయిస్టులు కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధమని చెప్పినా వినకుండా నిర్భందంగా ఎన్‌కౌంటర్లు జరుగుతుందని, వెంటనే ఆపరేషన్ కగార్ ఆపాలని కేంద్రా న్ని డిమాండ్ చేశారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎండి జబ్బార్ మాట్లాడుతూ పార్టీ నిర్మాణం పని పద్ధతులు గురించి వివరించారు. ప్రజా పోరాటాలు చేసి పార్టీని బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి. వెంకటయ్య, బాల్ రెడ్డి, మహబూబ్ పాషా , ఆది, నాయకులు వేణుగోపాల్ , దేవేందర్ , వెంకటేష్ , రాజేందర్ గౌడ్ , సూర్యమంశం రాము, భగత్ , వెంకటయ్య, భాస్కర్ , ఖాజా, మహేష్ , మల్లేష్ , శేఖర్ , కవిత, చిట్టెమ్మ, రాణి, కమలాకర్ , తదితరులు పాల్గొన్నారు.

## పాలనలో తనదైనశైలిలో కలెక్టర్ ఉత్తమ సేవలు




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** విపత్తులనుసైతం సమర్థవంతంగా ఎదుర్కొంటూనే, జిల్లా అభివృద్ధిని పరుగులుపెట్టించేలా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఏడాదిపాలన సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో మూడు పర్యాయపర్యటనలు విజయవంతం చేయడంలో కీలకభూమిక పోషించారు. జూన్ 16, 2025 నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలుచేపట్టి సరిగ్గా ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పాలనరంగంలో తనదైన ముద్రనుపదిలంగా వేశారు. తన నిబద్ధత, దార్శనికత, కఠోరశ్రమతో జిల్లాప్రజలకు మెరుగైన సేవలందిస్తూ , ప్రభుత్వ పథకాల అమలులో ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న మరుసటిరోజునుంచే ప్రతిపనిలోను తనదైనశైలిలో ఉత్తమంగా ఉండేలా ప్రయత్నం చేస్తున్నారు. సమీక్షలు , సమావేశాలు , జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన, వివిధ మండలాలలోని గురుకుల, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలుభోదిస్తూ, అంగన్‌వాడి సెంటర్లను, పల్లె దవాఖానాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలను పరిశీలిస్తున్నారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించి ఈఏడాది పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో గత సంవత్సరం జిల్లా 23స్థానంనుండి 13వస్థానానికి చేరుకునేలా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ కృషి ప్రత్యేకమైనది. తనదైనశైలిలో ఉత్తమంగా పాలన కోసం తాను క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలుచేపట్టి అధికారులను పరుగులు పెట్టిస్తూనే, ఊహించని విపత్తులు అధిక వర్షాలవరదలు, ఎస్ఎల్‌బిసి వంటి విపత్తులను సైతం సమర్థవంతంగా ఎదుర్కొంటూనే జిల్లా అభివృద్ధికి నిర్విరామంగా అహర్నిశలు కృషిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

## రానున్న రోజుల్లో తెలంగాణలో జనసేనదే ముఖ్యపాత్ర



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** రాబోయే రోజుల్లో తెలంగాణలో జనసేన పార్టీ జెండాను ఎగరవేయడం ఖాయమని ముకుంద నాయుడు అన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం జనసేన పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ నాయకులు, వనపర్తి కో ఆర్డీనేటర్ ముకుంద నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముకుంద నాయుడు మాట్లాడుతూ తెలంగాణ ఇంచార్జీ శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్య నాయకుల సూచనలనతో గతంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ఐడికార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టి జిల్లాలోని వాలంటీర్స్ నాయకులకి, మండల అధ్యక్షులకు వారి పరిదిలోని సభ్యుల ఐడి కార్డులను అందించటం జరిగిందని త్వరలో వచ్చే వారాల్లో వారి సమక్షంలోనే మండల కేంద్రాల్లో , గ్రామాల్లో క్రియాశీలక సమావేశాలు చేపట్టి సభ్యత్వ కార్డులు అందిస్తామని తెలిపారు. ప్రజల కష్టాలు, సమస్యలపై జనసేన ఎల్లప్పుడూ పోరాడుతుందని జన సైనికులు ప్రజలకు అండగా ఉండాలని తెలిపారు. వనపర్తి జిల్లా సభ్యత్వాలు నమోదు చేయించాలని కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వ నమోదులో వనపర్తి జిల్లా వ్యాప్తంగా త్వరలో జరిగే సభ్యత్వ నమోదులో అధిక స్థాయిలో జనసేన పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వ నమోదులో వనపర్తి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుతామని ఆకాంక్షించారు. జనసేన పార్టీ కార్యకర్తలకు 5 లక్షల రూపాయల ప్రమాదభీమా సౌకర్యం , 50 వేల మెడికల్ ఇన్సూరెన్స్ కల్పించడం పవన్ కళ్యాణ్ దాతృత్వానికి నిదనర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు, వనపర్తి కో ఆర్డీనేటర్ ముకుంద నాయుడు, వనపర్తి మండల అధ్యక్షులు ఉత్తేజ్ , పట్టణ అధ్యక్షులు సురేష్ యాదవ్ , ఘనపూర్ మండల అధ్యక్షులు గోపాల్, సోషల్ మీడియా కన్వీనర్ ఆర్. క్రిష్ణ, కొత్తకోట నాయకులు రాములు సాగర్ , శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ఎఎస్ఐ



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు వాహన దారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అలాగే ప్రజలు సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం సాయంత్రం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చూరస్తాలో నారాయణపేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిరహించి వాహనదారులకు రోడ్డు భద్రత నియమాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పకుండా ఉపయోగించాలని, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, త్రిబుల్ రైడింగ్ లో వాహనాలు నడపరాదని తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా వెళ్లాలని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురి కారాదని తెలిపారు. యువకులు డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి అలవాటు వల్ల అవి వ్యసనంగా మారే అవకాశం ఉంటుందని, కావున వాటిని ఆదిలోనే తుంచి వేయాలని తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ఆదివారం భారతీయ జనతా పార్టీ నారాయణపేట పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్ పట్టణ కమిటీని 11 గురు సభ్యులు , 40 కార్యవర్గ సభ్యులతో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్, లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ సమక్షంలో ప్రకటించబడడం జరిగింది. ప్రధాన కార్యదర్శులుగా వడ్డె దత్తు, నక్క సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా పరిగి శ్రీనివాస రెడ్డి, సిద్ధి విశాలాక్షి వెంకట్ రాములు, హనుమంతరావు చామకూర, చలపతి యాదవ్‌లను, కార్యదర్శులుగా బాబు మేస్త్రి, జయశ్రీ , విజయ నవలె, మొగ్గుల ప్ప యాదవ్ , కె. రాఘవేంద్ర పళ్ళ , కోశాధికారిగా కల్పన, రఘురామయ్య గౌడ్ లను ముఖ్య కమిటీ సభ్యులుగా, కార్యవర్గ సభ్యులుగా ఉమాకాంత్, మాలే మ ల్లేష్, పొలమోల్ల అంజి, నీలి కవి, కురువ శీను, భీమ్ రాజ్, ఉషన్న యాదవ్, అన్వేష్, ఆకుల సత్యనారాయణ, సతీష్ సింగల్ బేస్, రాట్నం శ్రీను, చంద్రశేఖర్ పళ్ళ తదితరులను ఎన్నుకోవడం జరిగింది.

## 'షోటోకాన్' బెల్ట్ ఎగ్జామ్ టెస్ట్



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడు ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ ఎగ్జామ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ కరాటే బెల్ట్ ఎగ్జామ్ టెస్టులో విద్యార్థులు చాలా చక్కని ప్రతిభను చూపించి బెల్ట్ సర్టిఫికెట్‌ని సాధించడం జరిగిం ది. ఈ బెల్ట్ ఎగ్జామ్ అభి మణికంఠ విద్యార్థులు 80 శాతం మార్కులతో ప్రమోషన్ పొందడం జరిగింది. వారు వైట్ బెల్ట్ నుండి గ్రీన్ బెల్ట్ సాధించడం జరిగింది. ఈ విద్యార్థులకు ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్ఐ ఖాదర్, కరా టే మాస్టర్ జగర్ విఐపి అకాడమీ స్టేట్ ప్రెసిడెంట్ తన్వీర్ అలాగే విఐపి లీగల్ అడ్వకేట్ ఇంతియాజ్ ఎగ్జామినర్ ఇలియస్ మాస్టర్ అలాగే నిర్వాహకులు సయ్యద్ అశ్వక్ మాస్టర్ కలిసి విద్యార్థులకు అభినందనలు తెలపడం జరిగింది.

## మూడు రోజుల్లో కొత్త రేషన్ కార్డు

### ఎవ్వరికీ డబ్బులివ్వొద్దు :ఎమ్మార్వో

**ప్రజాపక్షం/తుర్కపల్లి:** ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డుల విషయంలో ఏ ఒక్కరు, ఎవ్వరికీ కూడా డబ్బులు ఇవ్వకూడదని, ప్రజలు ఒక్క రూపాయి ఇవ్వకుండా రేషన్ కార్డు పొందవచ్చునని తుర్కపల్లి ఎమ్మార్వో దేశ్య మండల ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు దరఖాస్తు దారులు చేయాల్సిన పని, ఇదివరకు మీపేరు రేషన్ కార్డులో లేకుంటే, మీ కుటుంబ రేషన్ కార్డులో చేరడానికి అవకాశం ఉంటుందని, లేదా ప్రత్యేక రేషన్ కార్డు కావాలంటే మీకు గతంలో ఉన్న రేషన్ కార్డులో మీ పేరును తొలగించుకొనుటకు తుర్కపల్లి మండల కేంద్రంలోని మీ సేవ ద్వారా అప్లై చేసుకుంటే చాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డు కొరకు అప్లై చేసుకున్న వారికి 3 రోజులో రేషన్ కార్డు వస్తుందని తెలిపారు. ఈ దరఖాస్తు ప్రక్రియలో ఎవర్ని సంప్రదించాల్సిన అవసరం లేదని, ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన, తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించగలరని సూచించారు.

## సిపిఐ బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలం ఐదు దోనల తండాలో సిపిఐ గ్రామ శాఖ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో నాయకులు మాట్లాడుతూ 100 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర సీపీఐకి ఉన్నదని అనేక ఉద్యమాలు ఆటుపోట్లు ఎదుర్కొని పేద ప్రజల కోసం ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రాచకొండ ప్రాంతం అభివృద్ధి కోసం అమరజీవి గులాం రసూల్, కురుమిద్ద లింగయ్య, పాలకులను ఒప్పించి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఫీల్ ఫైరింగ్ రేంజ్‌ను వ్యతిరేకించి ఉపసంహరించుకునే అంతవరకు సిపిఐ పోరాటాన్ని ఆపలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాల య్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు కలకొండ సంజీవ, గ్రామ శాఖ సీపీఐ నాయకులు లచ్చు, చందర్, కోట, శంకర్ పాల్గొన్నారు.



## లోక్ అదాలత్‌లో 16,460 కేసుల పరిష్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 16,460 కేసుల పరిష్కారం అయ్యాయని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లో నమోదు అయిన అండర్ ఇన్వెస్టిగేషన్ కోర్టు విచారణలో ఉన్న ఐపిసి కేసులు 706. డ్రంక్ అండ్ డ్రైవ్ ఎం.వి యాక్ట్ కేసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు 4695 పెట్టి కేసులు 11026. సైబర్ క్రైమ్ కేసులు 33 పరిష్కారమయ్యాయి అని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో వివిధ రాజీ పడదగిన కేసులలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా షెడ్యూల్ ప్రకారం, రాజీ మార్గాన కేసులను పరిష్కరించడానికి శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో రాజీ మార్గమే రాజమార్గంగా కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించి నిందితులు, కక్షిదారులకు సమాచారం అందించి వారికి అవగాహన కల్పించాలని అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్‌లో 16,460 కేసులు పరిష్కరించడం జరిగిందనిఈ కేసులను పరిష్కరించడంలో చక్కగా వ్యవహరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని, కోర్టు కానిస్టేబుళ్లను అభినందించారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి : దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ వలిగొండ మండల కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ కట్ల యాదగిరి అధ్యక్షతన స్థానిక దేవి శ్రీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి విధంగా వివరిస్తున్నాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను హతమార్చడం బిజెపి నాయకుల అవినీతి కుంభకోణాలతో కురుకుపోయారని వారు అన్నారు. దేశంలో తీవ్రవాదుల పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ రైతు కార్మిక, కర్షక సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. భారతదేశ సంపదను అదానీ, అంబానీ చేతులలో పెట్టడానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలిగంజి వీర స్వామి, మండల నాయకులు బాలగోని సత్యనారాయణ, బోడిగే సుదర్శన్, నరిగె యాదయ్య, సల్వాద్రి రవీందర్, సుద్దాల సాయికుమార్, పులిపలుపుల మల్లేశం, సలిగంజి కృష్ణ కుమార్, మచ్చ లక్ష్మి నారాయణ, యాస జనార్ధన్ రెడ్డి, నార్కట్ పల్లి మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో కెఎల్ఎన్ ప్రభంజనం



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** వెలువడిన నీట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బి.అఖిల 2783, ఆర్.అనిత 8658, ఆర్.హాసిని 15431వ ర్యాంకులు సాధించి జిల్లాలో అగ్రగామిగా నిలిచారన్నారు. ఇంకా సీట్లు సాధించే వారు ఇద్దరు ఉన్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు పీఎల్ఎన్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, హనుమంతరెడ్డిలు అభినందించారు.

## సంతోష్‌బాబు త్యాగం వెలకట్టలేనిది

### సూర్యాపేట ఎస్‌పి నర్సింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** కల్నల్ సంతోష్‌బాబు ఆర్మీ జవానుగా వీరోచితంగా పోరాడి దేశ రక్షణలో అసువులు బాసారని, వీరి త్యాగం వెలకట్టలేనిదని జిల్లా ఎస్‌పి కె.నర్సింహ అన్నారు. ఆదివారం కల్నల్ సంతోష్‌బాబు 5వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల సంతోష్‌బాబు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశ రక్షణలో తల్లిదండ్రులకు, భార్య, పిల్లలకు చాల బాధ కలిగిస్తుందని అయినప్పటికీ దేశ వ్యాప్తంగా కల్నల్ సంతోష్‌బాబు త్యాగాన్ని గుర్తించి నివాళులర్పించి స్మరించుకోవడం ఆ కుటుంబానికి ఓదార్పు అన్నారు. ఆదర్శంగా తీసుకుని దేశ రక్షణకు పౌరులు కృషి చేయాలన్నారు. యువత దేశానికి భవిష్యత్ ఇలాంటి యువత నేడు చెడు వ్యసనాలకు గురై నిర్వీర్యం అవుతున్నారని, యువత కల్నల్ త్యాగాన్ని, ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్నల్ కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులు, ఆర్మీ జవాన్లు, సంక్షేమ సంఘం, ఎన్‌సిసి విద్యార్థులు, పౌరులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యూరీ సభ్యులు మధుకు మెమెంటో అందచేత



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్టు, ఎఫ్‌డీసీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ వాకిటి మధు శనివారం హైద్రాబాద్ హైటెక్ సిటీలో జరిగిన గద్దర్ అవార్డులో బెస్ట్ జ్యూరీ మెంబర్‌గా మెమెంటో, ప్రశంసాపత్రాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనకు ఉత్తమ జ్యూరీ సభ్యుడిగా ఫిలిం అవార్డు ఎంపికలో ఉత్తమ విధులు నిర్వహించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ఇష్టారాజ్యం

### అనర్హులకే కేటాయింపు... గ్రామాల్లో మొదలైన లొల్లి



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అర్హులైన పేదలకు పార్టీలకు అతీతంగా కేటాయించాల్సిన ఇందిరమ్మ ఇండ్లను అనర్హులకు కేటాయిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లొల్లి మొదలైంది. దీంతో ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతోంది.

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలలో ప్రకటించింది. దీనిలో భాగంగా ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికి ఇంటిస్థలం ఉన్న వారికి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇండ్లు నిర్మాణం చేసుకుంటే రూ.5 లక్షలు ప్రకటించింది. దీనిలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి మొదట విడతగా 3500 ఇండ్లను మంజూరు చేసింది. దీనికి ముందు ఆయా నియోజకవర్గాల్లోని ఒక గ్రామాన్ని ఫైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి అర్హులకు ఇండ్లను కేటాయించింది. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన వారికి ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గ్రామస్థాయిలో ఎంపిక చేసిన అర్హుల జాబితాకు అనుగుణంగా అధికారులు ఇండ్లు కేటాయించడం జరుగుతుంది. ఇంత వరకు భాగానే ఉన్నా ఇండ్ల కేటాయింపుల్లో ఇందిరమ్మ కమిటి సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరించి అనర్హులకు కేటాయిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ కమిటి సభ్యులుగా వ్యవహరిస్తున్న వారు బంధుప్రీతి ప్రదర్శించడంతో పాటు తమకు అనుకూలమైన వారికి, తాము అడిగినంత డబ్బులు ఇచ్చిన వారికే కాంగ్రెస్ పార్టీ కానివారిని అర్హుల జాబితాలో పేరు నమోదు చేసేందుకు నిరాకరిస్తున్న పరిస్థితి. దీంతో ఆయా గ్రామాల్లో అర్హులు కమిటి సభ్యుల తీరుతో గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గంలోని వెలుగుపల్లి గ్రామంలో బయ్యా కనకయ్య అనే నిరుపేద తనకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి కొంతమంది కాంగ్రెస్ నాయకులు మోసం చేశారని, ఇల్లు కేటాయింపుకు రూ.20వేల రూపాయలు తన వద్ద తీసుకున్నారని, ఐనా అర్హుల జాబితాలో తనపేరు రాకపోవడంపై మనస్థాపం చెంది గ్రామంలోని వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా తాజాగా సూర్యాపేట నియోజకవర్గంలోని ఏనుబాముల గ్రామానికి చెందిన కలకొట పాండు అనే నిరుపేద దళితుడు తనకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఆ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట గుడిసె వేసుకుని భార్య పిల్లలతో నిరసన తెలిపారు. పాండుకు గ్రామంలో ఒక అర ఎకరం వ్యవసాయ భూమి ఉన్నా, అదికూడా అసైన్డ్ ల్యాండ్ కావడంతో, గ్రామంలో పక్కా ఇల్లు లేక పూరిగుడిసెలో భార్య, ముగ్గురు కుమార్తెలు ఆ ఇంట్లోనే ఏళ్ల తరబడి నుండి నివాసం ఉంటున్నాడు. ఇందిరమ్మ ఇళ్లుకు తాను అర్హుడని చెప్పిన అధికారులు, తన ఇల్లు చూసి ఫోటో కూడా దింపికొని వెళ్లారని, ఇలా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరును చేర్చలేదని మీడియా ఎదుట తన ఆవేదన వెలిబుచ్చాడు. ఇదిలా ఉండగా చివ్వెంల, పెన్‌పహాడ్‌తో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, అర్హులకు ఇండ్లు కేటాయించకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా ఎంపికలు చేశారని, సంబంధిత అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.

**ఇందిరమ్మ కమిటీ సభ్యుల తీర్మాణంతోనే ఇండ్ల కేటాయింపు**

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అవకతవకలపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా గ్రామాలలో ఇందిరమ్మ కమిటి సభ్యులు తీర్మాణం చేసి తమకు పంపిన లబ్ధిదారుల జాబితా ప్రకారమే తాము ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో తాము చేసేది ఏమీలేదని, అధికార పార్టీ నాయకులను కాదని, మార్పులు, చేర్పులు చేసి ఇండ్లు కేటాయిస్తే తమ ఉద్యోగాలకే ముప్పు అంటూ వాపోతున్నారు. ప్రభుత్వ పెద్దలుమాత్రం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని పదే పదే చెబుతున్నా అది ఎక్కడ కూడా అమలు కావడంలేదు. గ్రామస్థాయి నాయకులు ప్రభుత్వ పెద్దల మాటలను పెడచెవిన పెట్టి తమ స్వలాభం కోసం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపును ఇష్టానుసారంగా చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిపోతుంది. ఉన్నతాధికారులు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి ఇండ్లు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'కత్రం' ఆరోగ్య సేవలు రాష్ట్రమంతటా విస్తరణ

### కత్రం ఆరోగ్యసేవ వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** కత్రం చారిటబుల్ ఫౌండేషన్ పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో కత్రం శ్రీకాంత్‌రెడ్డి, అభిజ్ఞ దంపతుల కుమారుడు శివ్‌కార్తీకేయరెడ్డి తొలి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కత్రం ఆరోగ్య సేవ వాహనం ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైతే ప్రజల కోసం పనిచేస్తామనే వారికి తనవంతు సహకారం అన్నివేళల ఉంటుందన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఉన్నత స్థానానికి ఎదిగి పేద ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కత్రం ఆరోగ్య సేవలు ఒక్క కోదాడ నియోజకవర్గానికి కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని సూచించారు. తొలి పుట్టినరోజు జరుపుకుంటున్న శివ కార్తికేయకు ఆశీస్సులు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తోటి వారి కోసం నేను సైతం అంటూ తనవంతు బాధ్యతగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కత్రం ఆరోగ్యసేవలు రాష్ట్రం అంతా విస్తరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుతం వైద్య సేవలు కోదాడ నియోజకవర్గంలోని కోదాడ, అనంతగిరి, చిలుకూరు, నడిగూడెం మండల్లాలోని గ్రామాలకు ఈ వాహనం ద్వారా ఉచితంగా వైద్య సేవలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, కోదాడ ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, అనంతగిరి మండల మాజీ ఎంపిపి చందూరు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు ఎర్నేని బాబు, పార సీతయ్య, సత్యబాబు, కత్రం ఫౌండేషన్ వ్యవస్థాపకులు కత్రం శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## హత్యకాండను వెంటనే ఆపాలి



### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/చింతలపాలెం:** ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగిస్తున్న హత్యకాండను వెంటనే నిలిపివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన కోరారు. ఆదివారం చింతలపాలెం మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో వద్ద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేసి, మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న హైద్రాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన మహాధర్నాను విజయవంతం చేయాలని గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అణిచివేసే పేరిట ప్రారంభించిన యుద్ధం ఆదివాసియులతో పాటు మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు హత్యకు కొనసాగిస్తుంది. గత 17 నెలల్లో దాదాపు 500 మంది మావోయిస్టులలో 300కు పైగా ఆదివాసిలు ఉన్నారు. అభివృద్ధి పేరిట రాజ్యాంగ చట్టాలలో ఉన్నటువంటి ఆదివాసిల హక్కులను కాలరాయడం జరుగుతుందని అన్నారు. తక్షణమే ఆదివాసిలతో సహా మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను నిర్మూలించే ఆపరేషన్ కగార్‌ను ఆపి కాల్పులు విరమణ మోడి ప్రభుత్వం ప్రకటించి, మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామశాఖ కార్యదర్శి గంధం మంగయ్య, సిపిఐ నాయకులు వీరబాబు, జియాలుద్దీన్, హైమావతి, శ్రీనివాసరావు, రామారావు, రామయ్య పాల్గొన్నారు.

## భూ సర్వే అధికారులను అడ్డుకున్న రైతులు

### నష్టపరిహారం కోసం వట్టిమర్తి రైతుల డిమాండ్



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో బ్రాహ్మణవెల్లంల ఉదయ సముద్రం కుడికాలువ నిర్మాణంలో భాగంగా సర్వే చేయడానికి ఆదివారం గ్రామానికి వచ్చిన నీటిపారుదల శాఖ అధికారులను బాధిత రైతులు అడ్డుకున్నారు. కాలువ నిర్మాణం కోసం భూమిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహారాన్ని నిర్ధారించకుండా సర్వే చేయడమేమిటని రైతులు అధికారులను నిలదీశారు. తమకు నష్టపరిహారం చెల్లించకుండా సర్వేకు వారు సమ్మతించలేదు. కాలువ నిర్మాణం చేయడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాని భూమిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం మాటేమిటని వారు ప్రశ్నించారు. గతంలో ఈ విషయంపై ఆర్‌డిఓ దృష్టికి కూడా తీసుకెళ్ళడం జరిగిందని వారు అధికారులకు తెలియజేశారు. కాగా నష్టపరిహారం ఊసే లేకుండా సెలవు రోజున, రైతులకు సమాచారం ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా అధికారులు సర్వేకు రావడాన్ని వారు తప్పు పట్టారు. రైతులు సర్వేకు అడ్డుపడటంతో అధికారులు వెనుదిరిగారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న భూమి ధరను రైతుకు చెల్లించాలని, వట్టిమర్తి చెరువులోకి లిఫ్ట్ ద్వారా నీటిని నింపేలా ప్రణాళికలు తయారు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులను ప్రశ్నించిన వారిలో భూమిని కోల్పోతున్న రైతులు నర్రా మోహన్‌రెడ్డి, నర్రా భిక్షంరెడ్డి, అక్కెనపల్లి యాదగిరి, నర్రా లవేందర్ రెడ్డి, దూదిగామ స్వామి, మల్లయ్య, యాదయ్య, వీరస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ రంగానికి అప్పజెప్పే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి



ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దోటి వెంకన్న

**ప్రజాపక్షం/చండూరు :** భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం జరిగినటువంటి క్లెమ్‌లను భీమారంగానికి అప్పజెప్పాలి అనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఏఐటియూసి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దోటి వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింమ్మా భవనంలో ఏఐటియూసి ఆధ్వర్యంలో బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ చండూరు మండల సమావేశం భూతరాజు శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి దోటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేయడం బాధాకరం అని అన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో లేబర్ డిపార్మెంట్ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా భీమా రంగానికి అప్పజెప్పడం ఎంత వరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఏఐటియూసి ఆధ్వర్యంలో ఈ నెల 17మంగళవారం రోజున హైదరాబాబ్‌లోని లేబర్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని తెలంగాణలోని బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియూసి మండల అధ్యక్షుడు జెల్ల శ్రీను, ఏఐటియూసి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ చండూరు మడల అధ్యక్షప్రధాన కార్యదర్శులు భూతరాజు శ్రీను, చందా మదనయ్య, నాయకులు ఎలవర్తి లింగయ్య, పేర్ల గురుస్వామి, నకిరెకంటి శ్రీను, పోలే యాదయ్య, పర్సనబోయిన శివ, దాసరి యాదగిరి ,ఇరిగి శంకర్ , ఈదుల కంటి యాదయ్య, దోటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలను కేటాయించాలని కోరుతూ నియోజకవర్గ టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డిని సాగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గ జర్నలిస్టులు కలిసివినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజె (ఐజెయు)జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని మాజీ సీఎల్పీ లీడర్ కుందూరు జానారెడ్డిని కోరినట్లు అందుకు జానారెడ్డి సానుకూలంగా స్పందించి అర్హత గల జర్నలిస్టులు అందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలను తమ స్వగ్రామాల్లో కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వద్దిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పేలపూడి బాలకృష్ణ, దోసకాల లింగయ్య, అలుగుల వెంకటరెడ్డి, చాపల శ్రీను, చిత్రం ప్రసాద్, అట్టెం రవి, నామలింగయ్య, చాపల సురేందర్, కరీం, రవితేజ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## నికర జలాల దోపిడీకే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం

### తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** వరద నిధులు జలాల పేరుతో తెలంగాణ నికర జలాల దోపిడికి యుపి ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం కెసిఆర్ తాను అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రకు వెళ్లి నాటి మాజీమంత్రి రోజా పెట్టిన బిర్యాని తిని, తెలంగాణ రాష్ట్రం కొంపముచ్చారని అన్నారు. తన అధికారాన్ని కాపాడుకోవడానికి ఆనాడు బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదికను తీసుకవస్తే అడ్డుకోలేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గోదావరి నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టిందన్నారు. తెలంగాణకు రావాల్సిన నీళ్లను రాకుండా దోచుకుపోతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుందని, తమ అధికారాన్ని కాపాడుకునేందుకు చోద్యం చూస్తుందన్నారు. గోదావరి నది నుండి 200 టిఎంసిల నీళ్లను కొల్లగొట్టడానికి బనకచర్ల ప్రాజెక్టును ఆంధ్ర ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. గోదావరి నది తెలంగాణ ప్రాంతంలో 79శాతం ప్రవహిస్తుండగా ఆంధ్రలో 21 శాతం మాత్రమే ప్రవహిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని శక్తులు ఏకమై బనకచర్ల ప్రాజెక్టుపై పోరాటాలు చేసిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, కార్యదర్శి బొడ్డు శంకర్‌గౌడ్, నాయకులు వీరేశ్‌నాయక్, బొజ్జ అనిల్ పాల్గొన్నారు.

## ఇందిర అనాధాశ్రమంలో అన్నదానం



**ప్రజాపక్షం/మునగాల:** అన్నిదానాల్లో కన్న అన్న దానం మిన్న అని దాత అక్కినపల్లి నర్సయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ సమీపంలోని ఇందిర అనాధాశ్రమంలో అక్కినపల్లి నర్సయ్య సుభద్ర పెళ్లిరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్దులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా దాత మాట్లాడుతూ ఇంట్లో జరుపుకునే శుభాకార్యాలకు వృద్దుల మధ్య జరుపుకుంటే చాల ఆనందంగా ఉంటుందన్నారు. అనంతరం వృద్దుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రోలింగ్ శ్రీను, గోవింద నాగరాజు, ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

# క్రీడ



## చైనాలో పారా – పవర్‌లిఫ్టింగ్
# వరల్డ్ కప్..

భారత బృందంలో ఏడుగురు మహిళలు

అంతర్జాతీయంగా పలు క్రీడల్లో సత్తా చాటుతున్న భారత్.. పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్ 2025 లోనూ పతకాల వేటకు సిద్ధమైంది. చైనాలోని బీజింగ్ వేదికగా జరుగబోయే ఈ టోర్నీకి 16 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. భారత పవర్ లిఫ్టింగ్ కమిటీ. ఈ మధ్యే నేషనల్ ఛాంపియన్‌షిప్స్‌లో మెరిసిన జైనాబ్ ఖాటున్, సీమా రాణి, ఝుండు కుమార్, జాబి మథ్యూ, మనీష్ కుమార్, కస్తూరిలకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన 16 మందిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. జూన్ 17 నుంచి 25 వరకూ జరుగనున్న ఈ టోర్నీ కోసం భారత స్క్వాడ్ ఆదివారం చైనా బయల్దేరింది. అంతకంటే ముందు ఈ బృందానికి అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. 'అంతర్జాతీయంగా జరిగే ప్రతి పారా పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో భారత్ తన శక్తిని చాటుతోంది. మన క్రీడాకారులు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. చైనా ఆతిథ్యమిస్తున్న పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్‌లో ఆశించిన ఫలితాలు వస్తాయనే నమ్మకం నాకుంది. మరో ముఖ్యమైన విషయం 16 మందిలో ఏకంగా ఏడుగురు మహిళలే. భవిష్యత్‌లో పారా క్రీడల పురోగతికి ఇదొక శుభ సంకేతం' అని భారత పారా పవర్ లిఫ్టింగ్ చైర్మన్ జేపీ సింగ్ తెలిపారు. భారత పారా బృందానికి 'ఆల్ ది బెస్ట్' చెబుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారాలింపిక్ కమిటీ మాజీ అధ్యక్షురాలు దీపా మాలిక్, ప్రస్తుతం పారాలింపిక్ కమిటీ సెక్రటరీ జనరల్ జయవంత్ హామన్నవర్, తదితరులు పాల్గొన్నారు.



## మన్సీ లాథర్
# ఉడుంపట్టు

**అండర్– 20 ఆసియా ఛాంపియన్‌షిప్స్ బెర్త్ ఖరారు!**

అండర్ 17 వరల్డ్ ఛాంపియన్ మన్సీ లాథర్ మరోసారి పంజా విసిరింది. జూనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ ట్రయల్స్‌లో ప్రత్యర్థిని అలవోకగా మట్టికరిపించింది. ఈ ఏడాది మార్చిలో సీనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో కాంస్యం గెలుపొందిన ఈ రెజ్లర్.. 68 కిలోల విభాగంలో ఢిల్లీకి చెందిన శ్రిష్టిని ఓడించింది. తద్వారా కిర్గిస్థాన్‌లో జరుగబోయే అండర్ 20 ఆసియా ఛాంపియన్‌షిప్స్ బెర్తు ఖరారు చేసుకుంది మన్సీ. జూలై 5 నుంచి 13 వరకూ జరగబోయే ఈ మెగా టోర్నీకి ముస్కాన్ నందల్ 57 కిలోల విభాగంలో అర్హత సాధించింది.

కిర్గిస్థాన్ వేదికగా జూలై తొలివారంలో జరుగనున్న అండర్ – 20 ఆసియా ఛాంపియన్‌షిప్స్ పోటీలకు క్వాలిఫై అయిన భారత మహిళా రెజ్లర్ల వివరాలివి. శ్రుతి(50 కిలోలు), సారిక(53 కిలోలు), రీనా(55 కిలోలు), నేహర్ శర్మ(57 కిలోలు), అంజలి(62 కిలోలు), హర్షిత(72 కిలోలు), కాజల్(76 కిలోలు).


ఈ పోటీల కోసం జూన్ 14న లక్నోలో పురుష రెజ్లర్లకు ట్రయల్స్ నిర్వహించారు. ఫ్రీ స్టయిల్, గ్రీకో రోమన్ విభాగంలో ఆసియా ఛాంపియన్‌షిప్స్ బెర్తు సాధించిన వాళ్లు ఎవరంటే& అంకుశ్ (57 కిలోలు), అనుజ్(61 కిలోలు), అశ్వనీ(65 కిలోలు), సౌరభ్(70 కిలోలు), వివేక్(74 కిలోలు), అమిత్(79 కిలోలు), సచిన్ (86 కిలోలు), సచిన్(92 కిలోలు), విశాల్(97 కిలోలు), జశ్‌పూరన్(125 కిలోలు), గ్రీకో రోమన్ : నితిన్(55 కిలోలు), సూరజ్(60 కిలోలు), వరుణ్(63 కిలోలు), యోగేశ్(67 కిలోలు), ఆకాశ్ పూనియా(72 కిలోలు), సచిన్ (77 కిలోలు), ప్రిన్స్(82 కిలోలు), రోహిత్(87 కిలోలు), నమన్ (97 కిలోలు), జోగిందర్ రథీ(130 కిలోలు)

## టెస్టు గదతో 'గన్ సెలబ్రేషన్'..
### బవుమా వీడియో వైరల్



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో గెలుపొందిన దక్షిణాఫ్రికా జగజ్జేతగా అవతరించింది. ఇన్నాళ్లుగా మౌనంగా భరిస్తున్న 'చోకర్స్' అనే ముద్రను చెరిపేస్తూ ఐసీసీ ఛాంపియన్‌గా నిలిచింది సఫారీ టీమ్. లార్డ్స్ మైదానంలో చిరస్మరణీయ విజయం అనంతరం దక్షిణాఫ్రికా ఆటగాళ్లు పట్టలేనంత సంబురంలో మునిగిపోయారు. క్రికెట్ చరిత్రలో తమపేరు చిరస్థాయిలో నిలిచిపోయిందనే సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఇక తనదైన కెప్టెన్సీ మంత్రతో తమ జట్టు 27 కలను సాకారం చేసిన తెంబ బవుమా అయితే ఓ రేంజ్‌లో విక్టరీ సెలబ్రేషన్ చేసుకున్నాడు. లార్డ్స్ మైదానంలో తొలి రెండు రోజులు ఆధిపత్యం చెలాయించిన ఆస్ట్రేలియాకు చెక్ పెడుతూ విజేతగా నిలిచింది దక్షిణాఫ్రికా. కగిసో రబడ 9 వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పగా.. ఎడెన్ మర్క్‌రమ్(136) వీరోచిత సెంచరీతో చెలరేగాడు. 66 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన బవుమా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కంగారూలపై 5 వికెట్లతో గెలుపొందిన అనంతరం అదే మైదాన బహుమతి ప్రదానం జరిగింది. ఐసీసీ ఛైర్మన్ జై షా నుంచి టెస్టు గదను స్వీకరించిన బవుమా.. సహచరులు, అభిమానుల జయజయధ్వానాల మధ్య గదను రెండు చేతులతో పైకి ఎత్తాడు. అనంతరం గదను కుడి భుజ మీద పెట్టుకొని గన్‌ను పేలుస్తున్నట్టుగా తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నాడు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.

# ఆరోగ్యం
## ఫోకస్



## 'ఒంటరితనం'పై
# అవగాహన అవసరం

ఇటీవల కాలంలో బాగా పెరిగిపోతున్న ఒంటరితనం అనే సమస్యపై అవగాహన కల్పించేందుకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అయితే, ఇక్కడితో ఆగిపోకుండా, ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఒంటరితనం ఓ మానసిక భావోద్వేగ ప్రక్రియ. కొందరికి ఒంటరితనం లేదా ఏకాంతం ఓ అద్భుత అవకాశంగా నిలిస్తే మరి కొందరిలో ఓ అవాంఛనీయ, అనారోగ్యకర సమస్యగా మారుతున్నది. దాదాపు 50 శాతం జనాభా అంతర్ముఖులుగా ఒంటరితనాన్ని కోరుకుంటారు, అనారోగ్యాల బారిన పడతారు. కొందరికి ఒంటరితనం వరమయితే మరి కొందరికి అది శాపం. పరిమిత ఒంటరితనం శారీరక, మానసిక వికాసానికి, సానుకూల భావనలు జనించడానికి దోహదపడుతుంది. మితిమీరిన ఒంటరితనం ప్రమాదకరంగా మారి చివరికి ప్రాణాంతకం కూడా. ఒంటరితనాన్ని మనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తే అది వ్యక్తి సంపూర్ణ శ్రేయస్సుకు ఉపకరిస్తుంది. ఒంటరితనానికి, ఏకాంతవాసానికి తేడా ఉన్నది. ఒంటరితనం అనేది ఒక భావోద్వేగ ప్రతికూల స్థితి. తాను ఇతరులతో కనెక్ట్ కావాలని కోరుకున్నప్పటికీ, వారి చుట్టు ఎవరూ లేరని భావించడాన్ని ఒంటరితనం అనవచ్చు. ఏకాంతం అనేది ఒక వ్యక్తి కావాలని ఒంటరిగా ఉండడం, తమ చుట్టు పక్కలకు దూరంగా ఉంటూ ఆలోచనలు చేయడం అని అర్థం చేసుకోవాలి. ఏకాంతం అనేది ఒక ఆశావహ ప్రయోజనకర మానసిక స్థితి. నిశ్శబ్ద రుగ్మతగా సమాజంలో వ్యాపిస్తున్న ఒంటరితనాన్ని ఒక దురాచారంగా లేదా ప్రతిష్టకు మచ్చగా నిలుస్తున్న వేళ దాని పట్ల అవగాహన కల్పించడం జరగాలి. దీర్ఘకాలం పాటు ఒంటరితనాన్ని అనుభవించిన వారిలో తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం హద్దులు మీరితే మతిమరుపు, హృదయనాళ అనారోగ్య సమస్యలు, గుండెపోటు, నిరాశ, ఆందోళన, అకాల మరణాలు, అలసట, ఆత్మ న్యూనత భావం, మానసిక ఒత్తిడి లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం ఫలితంగా శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ప్రతికూలతలతో పాటు మానవ సంబంధాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఒంటరితనాన్ని ఓడించి చురుకుగా, సరదాగా సమాజంతో మమేకం అవుతూ జీవితాన్ని ఆస్వాదించడానికి కొని చిట్కాలు పాటించాలి. మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలివిడిగా ఉండడం, చొరవ తీసుకొని ఇతరులతో మాట్లాడడం, మన అభిరుచులకు తగిన బంధువులు/ మిత్రులతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ వేదికల్లో గడపడం, మనకు ఇష్టమైన పనులను చేసి ఆలడనం దాన్ని పొందడం, మన భావాలను దగ్గరి వారితో పంచుకోవడం, పరిష్కార మార్గాలను తెలుసుకోవడం, ఒంటరిగా, ముభావంగా ఉండే వారికి దగ్గర కావడం లాంటి చర్యలు ఒంటరితనమనే రుగ్మతను దూరం చేస్తాయి. ఒంటరితనాన్ని పరిమితం చేస్తూ, పౌర సమాజంతో దగ్గరవుతూ, సంతోష సాగరంలో మునుగుతూ, జీవితాన్ని సుసంపన్నం చేసుకుంటూ, ఎంపిక చేసుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ, అందరి మన్ననలు పొందుతూ, చలాకీగా ప్రవర్తిస్తూ ఆయుకారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉందాం, ఆనందాన్ని పంచుదాం.




- ఉదయం ముఖం కడగగానే రెండు గ్లాసుల నీరు తాగాలి. గంట తరువాత మళ్ళీ రెండు గ్లాసుల నీరు తాగాలి. ఆ నీరు గోరువెచ్చనివై తెనే, నిమ్మరసం కలిపినవై ఉండాలి.
- టిఫిన్ తినడానికి 30 నిమిషాల ముందు ఒక గ్లాస్ జ్యూస్ తాగాలి. వీటిలో తేనే, నిమ్మరసం కలపాలి.
- టిఫిన్‌గా తేలికైన ఆహారాలు తీసుకోవాలి. నూనెలో వేయించినవి, మసాలాలు ఉన్నవి తినవద్దు.
- మధ్యాహ్న భోజనం 1 గం తినేయాలి. భోజనానికి 30 నిముషాల ముందు రెండు గ్లాసుల నీరు తాగాలి. భోజనం ముగిసిన గంటన్నర నుండి ప్రతీ గంటకూ ఒక గ్లాసు నీరు తాగాలి.
- అన్నంలో 50 శాతం ఆకుకూరలు ఉండేలా తినాలి. ఆకు కూరలు ఎక్కువ వాడాలి. ఉప్పు, కారం, నూనెలు, వేపుడ్లు బాగా తగ్గించాలి.
- రుచి కోసం పల్లీ పొడి, కొబ్బరి పొడి, నువ్వుల పొడి, మినుముల పొడి కలుపుకోవాలి.
- మాంసం, చాపలు, కోడి గుడ్డు, నిల్వ పచ్చళ్లు, బిర్యానీలు, పాకెట్ పాలు వాడవద్దు.
- సాయంత్రం నాలుగున్నర గంటలకు గ్లాస్ జ్యూస్ తాగాలి. గంట తర్వాత రెండు గ్లాసుల నీరు తాగాలి.
- సూర్యాస్తమయంలోపు రాత్రి భోజనం తినడం పూర్తి చేయాలి.
- రాత్రి డిన్నర్‌లో పండ్లు తినాలి. బొప్పాయి, జామ, పుచ్చకాయ, దానిమ్మ, బత్తాయి, కమలా మొదలైనవి తినాలి.
- వీలుని బట్టి రోజులో మూడు నుంచి నాలుగు గ్లాసులు మజ్జిగ తాగితే మంచిది. రాత్రి పూట 7– 8 గంటలు నిద్రపోవాలి. పగటిపూట నిద్రించడం అంత మంచిది కాదు.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలి
### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఆదివారం నగరంలోని విఠలేశ్వర కాలనీలో పిట్టర్స్ యూనియన్ కార్యాలయంలో పిట్టర్స్ యూనియన్ శాఖ మహాసభ అనిల్ అధ్యక్షతన జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నూతనంగా తెచ్చిన కోడ్లను రద్దు చేయాలని జూలై 9న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొనాలన్నారు. వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలపై పోరాటం నిర్వహించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రాజీవ్ యువవికాస్ అర్హులైన వారందరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున మీ ప్రంతంలో తాగునీటి సమస్య, రోడ్లు, మురికి కాలువల సమస్యలపై నగర పార్టీ దృష్టికి తెచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ఈనెల 22న జరిగే సీపీఐ నగర మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పిట్టర్స్ యూనియన్ మహాసభలో నాయకులు రమేష్, జాఫర్, సాయిలు, రవి పాల్గొన్నారు.

## పేదలపక్షాన పోరాడిన శ్రీను ఆశయాలు సాధిద్దాం
### గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పేదల పక్షాన పోరాడే శ్రీను ఆశయాలను సాధిద్దామని, శ్రీను లాంటి కమ్యూనిస్టులు భౌతికంగా మనమధ్య లేకున్నా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. రాజోలు గ్రామంలో పోగుల శ్రీనివాస్‌గౌడ్ సంతాప సభ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ దొరలు చెట్లు నరికివేతపై వారికి వ్యతిరేకంగా, చెట్టుపై నుండి పడిపోయిన గౌడన్నల పక్షాన వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు జరిగిన గొప్ప నాయకుడు శ్రీనివాస్ అని కొనియాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథి, తమ్మెర విశ్వేశ్వరావు, కట్టెబోయిన శ్రీనివాస్,తోటి బిక్షపతి, నెల్లూరు నాగేశ్వరావు, కర్ణం రాజన్న, సాయిల్‌గౌడ్, నాగభూషణం గౌడ్, వరిపెల్లి వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , పెరుగు కుమార్, పాండురంగాచారి, అశోక్, స్టాలిన్, చింతకుంట్ల వెంకన్న, బసవ కోమరయ్య, రురక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం
### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ(పెద్దవూర):** ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి, పేదల పక్షాన నిలబడే పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శి,శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పులిచర్లలోని సిపిఐ పెద్దవూర మండలకార్యదర్శి గడ్డంపలి భీక్షంరెడ్డి అధ్యక్షతన సిపిఐ మండల మహాసభలోముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అడవుల్లోని ఖనిజ నిక్షేపాలను, వనరులను కార్పోరేట్లకుకట్టబెట్టేందుకు ఆదివాసులను,నక్సలైట్లను అంతం చేయడం కోసం ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించి ఎంతో మంది మేధావులను చంపి దహనసంస్కరణలు చేయడానికి కనీ సం వారి కుటుంబ సభ్యులకు శవాలను ఇవ్వకుండా కక్షపూరిత ధోరణి అవలంబించారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పులవిరమణను ప్రకటించి,మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలుప్రారంభించాలనిడిమాండ్ చేశారు. శాంతి చర్చల కమిటి ఆధ్వర్యంలో జూన్ 17న ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్ ఇందిపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా జరగనున్నది. సిపిఐ,ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. సిపిఐ దేశంలోనే వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ అన్నారు.పేదలకోసం,భూముల కోసం, భుక్తి విముక్తి కోసం, పోరాటాలు చేసి కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం త్యాగాలను చేసిన పార్టీ అని తెలిపారు. ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డిమాట్లాడుతూకేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.పంటకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాలు సబ్సిడి మీద ఇవ్వాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐజిల్లా సమితి సభ్యులు ఈదుల బిక్షంరెడ్డి, సీనియర్ నాయకులు పొదిల నరసింహ,గుర్రంపోడు మండల కార్యదర్శి లక్ష్మీపతి,మండలసహాయకార్యదర్శి రొయ్య రాములు,శోభన్ బాబు,నాగర్జున,జయప్రకాశ్ రెడ్డి, విజయానంద్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపక్షాన పోరాడేది కమ్యూనిస్టులే
### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** పదవులు ఉన్నా లేకున్నా ప్రజలపక్షాన పోరాడేది కమ్యూనిస్టులే అనిసిపిఐజాతీయసమితిసభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఆదివారంమండల పరిధిలోని వి. వెంకటాయపాలెంలో సిపిఐ రఘునాథపాలెం మండలమూడవమహాసభ నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఐ ఖమ్మం నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కే జానీమియా ఆవిష్కరించి అమరవీరుల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం జూల వెంకటేశ్వర్లు, లచ్చిరాం అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ కేద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలనుఅవలంభించడమేకాకుండామతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య చిచ్చుపెట్టెందుకు ప్రయత్నిస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, రైతులకు రుణ మాఫితో పాటు రైతుభరోసా నిధులు విడుదల చేయాలన్నారు. సిపిఐ సహాయకార్యదర్శిదండి సురేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటాలుసాగించిందన్నారు.రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులుతాటి వెంకటేశ్వరావు, పగడాల మల్లేష్, సిపిఐ మండల కార్యదర్శి వరదా నర్సింహారావు, ధరవత్ మాంగిత్యా, జామ్లా, తదితరులున్నారు.

## కార్మిక, కర్షక, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు
### సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** కార్మిక, కర్షక, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు చేసే భారత కమ్యూనిస్టు పార్టీ మంచిర్యాల జిల్లా మహసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. మంచిర్యాల్ జిల్లాలో జూన్ 21, 22 తేదీలలో జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాల్గవ మహాసభల సన్నాహాల్లో భాగంగా ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆకాంక్షల సాధనకు సిపిఐ ముందుంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 21, 22వ తేదీలో జరిగే సిపిఐ జిల్లా మహసభల్లో ప్రజలు, కార్మికులు, కర్షకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలన్నారు.రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ మల్లేష్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలకం అంబేద్కర్, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు డిఆర్. శ్రీధర్, బికెఎంయు జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేకల రాజేశం, చంద్రవెల్లి సహకార సంఘం డైరెక్టర్ మూల శంకర్ గౌడ్, జిల్లా సమితి సభ్యులు బియ్యాల ఉపేందర్, పట్టణ నాయకులు బండారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### నస్పూర్ మండల సిపిఐ కార్యవర్గం ఎన్నిక

**నస్పూర్ :** నస్పూర్ మండలంలో పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో జోగుల మల్లయ్య మండల కార్యదర్శిగా, లింగం రవిని సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు.రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ,ఆదివారం జరిగిన సిపిఐ మూడో మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మహాసభలో 69 మంది సభ్యులతో కౌన్సిల్, 23 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

## సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వాలు వైఫల్యం
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నస్పూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో విఫలమయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. నస్పూర్ మండలంలో జరిగిన సిపిఐ మూడో మహాసభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదివారం నరసయ్య భవన్‌లో ఈ మహాసభకు ముందు, షిర్కె సెంటర్ నుండి నరసయ్య భవన్ వరకు భారీ ప్రదర్శన,ర్యాలీనిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు అల్లా లచ్చి రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా, డికొండ మల్లన్న అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఉమా కా, చిలుక రామ చందర్, మర్రి సందీప్, ఎండి అఫ్రోజ్ ఖాన్ అధ్యక్షతన మహాసభ జరిగింది. సిపిఐ నస్పూర్ మహాసభలోముఖ్య అతిథులుగా చాడ వెంకటరెడ్డితో పాటు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో కేవలం మూడు గ్యారెంటీలను మాత్రమే అమలు చేసి, రైతులకు, కార్మికులకు, మహిళలకు సంక్షేమ పథకాలు అందించడంలో అలసత్వం వహిస్తోందని విమర్శించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, చర్చలు జరపాలన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. నస్పూర్ మండలంలోనూతనంగా ఏర్పడిన కార్పొరేషన్‌లో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టు 22, 23 తేదీలలో మేడ్చల్‌లో జరగనుండగా, జాతీయమహాసభలు సెప్టెంబర్‌లో పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో జరుగుతాయని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు, ఆహ్వాన సంఘంఅధ్యక్షులుమేకలదాస్, కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్,కె.వీరభద్రయ్య, లింగం రవి, ముష్కె సమ్మయ్య, ఎస్‌కె బాజీ సైదా, రేగుంట చంద్రకళ, మోత్కూరు కొమురయ్య, ఎండి అఫ్రోజ్‌ఖాన్, దొడ్డిపట్ల రవీందర్, మొగిలి లక్ష్మణ్ ఉన్నారు.



# మహానగరి


గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## విద్యార్థులకు నాణ్యమైన విద్య



ప్రజాపక్షం/అల్వాల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ అన్నారు. మచ్చ బొల్లారం డివిజన్ గోపాల్ నగర్ లోని కిడ్జీ పాఠశాలనుముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిమన్ననలను పొందాలన్నారు. పాఠశాలలో నర్సరీ నుండి పదవ తరగతి వరకు అర్హులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందించి విద్యార్థులకు మంచి విద్యను అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్కూల్ యాజమాన్యం డి.రావిరాజు, జి.లక్ష్మీనారాయణ, డి.శ్రీనివాసులు, బి.రాజు, రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జనార్ధన్, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాచీన శిల్పకళకు ఆద్యుడు విరాట్ విశ్వకర్మ : ఎమ్మెల్యే వివేకానంద



ప్రజాపక్షం/ నిజాంపేట్ : శిల్పకళకు ఆధ్యుడు విరాట్ విశ్వకర్మ అని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం గ్రామంలోని విశ్వకర్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విరాట్ విశ్వకర్మ భగవాన్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కెపి వివేకానంద ఆవిష్కరించారు. ముందుగా విశ్వకర్మ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ విశ్వకర్మ ప్రాచీన శిల్పకళకు ఆధ్యుడని అన్నారు. ప్రతి సంవత్సరం విశ్వకర్మ జయంతిని ఘనంగా జరుపుకుంటారని గుర్తుచేశారు. విశ్వకర్మల సమస్యలను సైతం పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సత్యనారాయణ, హేమలతా సురేష్ రెడ్డి, విశ్వకర్మ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం, నాయకులు జీవన్ రెడ్డి, విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కృష్ణమాచారి, కార్యనిర్వాహక అధ్యక్షులు కమ్మరి లక్ష్మణాచారి పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాల యూనిట్ తనిఖీ



ప్రజాపక్షం/అల్వాల్: భారతీయ జనతా మజ్దూర్ సెల్ బీజెఎంసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నాగార్జున పరిశ్రమ ప్రాంతాన్ని సందర్శించి అక్కడి వ్యవసాయ పరికరాల తయారీ యూనిట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తయారీ ప్రక్రియను సమీపంగా పరిశీలించి కార్మికులతో మరియు యాజమాన్యంతో ప్రత్యక్షంగా ముచ్చటించారు. పరిశ్రమ సందర్శనలో భాగంగా కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు హితకరమైన పథకాలపై డా॥ నాగార్జున అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్ యోజన ఈఎస్ఐ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఈపీఎఫ్‌వో ప్రావిడెంట్ ఫండ్ లాంటి పథకాల ప్రాముఖ్యతను వివరించారు. ఇతర పథకాలతో పాటు ఈశ్రమ కార్డు యొక్క ప్రయోజనాలను విశేషంగా వివరించారు. ఇందులో ప్రమాదబీమా రక్షణ భవిష్యత్తులో రాబోయే పథకాల అర్హత అలాగే అసంఘటిత రంగ కార్మికుల జాతీయ డేటాబేస్ నిర్మాణానికి ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. పథకాల ద్వారా కార్మికులు తమ భవిష్యత్తును భద్రంగా చేసుకోవచ్చని ప్రభుత్వ మద్దతును సంపూర్ణంగా వినియోగించుకోవాలని కోరారు.


## సాయిబాబా చౌదరికి అభినందన



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : కూకట్‌పల్లి సర్దార్ పటేల్ నగర్, కెపి హెచ్‌బి కాలనీ లో మందులపు సాయిబాబా చౌదరి పుట్టినరోజు వేడుకలను వారి నివాసం నందు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, రాజకీయ నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి విలేకరులు తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్, రంజిత్, బుల్లెట్ రవి, ఈప్ప రాకేష్, మహేష్, మారుతి సాగర్, శ్రీనివాస్, అనిల్ కుమార్, నూతలపాటి శ్రీనివాస్, సతీష్ నాయుడు, హరి కుమార్, కళ్యాణ్, శంకర్, కోటేశ్వర్, ఆనందరావు, లక్ష్మి, నాగమణి, సైదులు తదితరులు పాల్గొని శాలువతో సత్కరించి, పూల మాలలు వేసి, పూల మొక్కలను అందించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ప్రజాపక్షం/దోమ : పరిగి నియోజకవర్గంలోని దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్లను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్లను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వెంటనే లక్ష రూపాయల నిధులను లబ్దిదారుల ఖతలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.ఆయా గ్రామాల కార్యకర్తలు ఇల్లు రాని అర్హులను గుర్తించి పేర్లు ఇవ్వాలని సూచించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి , మండల పిఎసిస్ చైర్మన్ యాదవరెడ్డి , రాఘవేందర్‌రెడ్డి , యాదయ్యగౌడ్ ,ప్రభాకర్ రెడ్డి రాములు నాయక్ ,లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చిరెడ్డి సేవలు ఆదర్శనీయం



ప్రజాపక్షం/కాప్రా: క్రమశిక్షణతో విధులు నిర్వహించటంతో పాటు తన సహచర కార్మిక సంక్షేమం కోసం కొనసాగించిన బుచ్చిరెడ్డి సేవలు ఆదర్శనీయమని సిపిఐ రాష్ట్ర నాయకులు విఎస్ బోస్, ఏఐటియుసి అధ్యక్షులు ఎస్ శంకర్‌రావు కొనియాడారు. నాచారం పారిశ్రామికవాడలోని ఆర్ఎంసి కాంక్రీట్ రెడిమిక్స్ సంస్థలో సేవలందించారు.ఆదివారం పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ ఆంజూషర్మ పాల్గొన్నారు.

## భారీగా భూ సమస్యల అర్జీలు
# పరిష్కారం కోసం ఎదురుచూపులు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకొని వచ్చిన భూభారతి చట్టం ద్వారా గత రెండున్నర మాసాలుగా మేడ్చల్ జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూసంబంధిత అర్జీలు పెద్ద సంఖ్యలో చేరుతున్నాయి. సత్వరమే శాశ్వతంగా పరిష్కరిస్తామంటూ రెవెన్యూ యంత్రాంగం పేర్కొంటున్నప్పటికి అర్జీల స్వీకరించటం మినహా పరిష్కార దిశగా ఇంత వరకు పూనుకోవటం లేదు. దీంతో తాము ఇచ్చిన అర్జీలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందని అర్జీలు సమర్పించిన దరఖాస్తుదారులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు.సత్వర పరిష్కారం, పారదర్శకం అంటూ పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం ఎలాంటి నిర్ణీత గడువు పేర్కొనకపోవటం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో అమలులో ఉన్న ధరణి చట్టం లోప భూయిష్టంగా ఉన్న కారణంగా అనేక భూసంబంధిత అర్జీలు అపరిష్కృతంగా



ఉన్నాయని, దీనికోసమే ప్రస్తుత ప్రభుత్వం ధరణి చట్టంలో సమూల మార్పులు తేవటం ద్వారా ఇక శాశ్వత పరిష్కార దిశగా అడుగులు పడుతాయని రెవెన్యూ సదస్సుల్లో అప్పటి జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి రెవెన్యూ సదస్సుల్లో పేర్కొన్నారు. తొలి దశలో ప్రధాన ఫంక్షన్ హాళ్లల్లో ఆయా ప్రాంత ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములుగా చేసి అవగాహనా సదస్సులు ప్రారంభించి జిల్లావ్యాప్తంగా గ్రామ గ్రామాల్లో రెవెన్యూసదస్సులునిర్వహిస్తున్న జిల్లా రెవెన్యూ యంత్రాంగం భూసబంధింత అర్జీలను స్వీకరిస్తున్న ప్రక్రియ నేటికీ కొనసాగుతోంది. భారీ సంఖ్యలో వస్తున్న భూసంబంధిత అర్జీల పరిష్కార దిశగా సిబ్బంది కొరతను అధిగమించేందుకుగాను రెవెన్యూ అధికారులకు సహకరించేందుకుగాను భూసమస్యల సత్వర పరిష్కారంకోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించారు.

### నిర్ణీత వ్యవధి ప్రకటించాలి

ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలకు సంబంధించి స్వీకరిస్తున్న అర్జీలను ఎప్పుడు పరిష్కారమవుతాయన్న విషయాలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పష్టంగా ప్రకటించాలని పలువురుదరఖాస్తుదారులుకోరుతున్నారు. అదేవిధంగా జిల్లాలో గత రెండున్నర మాసాలుగా నిర్వహిస్తూ వస్తున్న రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ధరఖాస్తులు ఎన్ని వచ్చాయన్న విషయాలతోపాటు ఎన్ని పరిష్కారమయ్యాయన్న విషయాలను సైతం తెలియచేయాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంది. అదేవిధంగా ధరణి స్థానంలో తీసుకొని వచ్చిన భూభారతి చట్టం ద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి తహసీల్దార్లకు పూర్తి అధికారాలు కట్టబెట్టామని చెబుతున్న ప్రభుత్వం ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఆ దిశగా పని చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పలువురి అభిప్రాయం.

## బాల మల్లేష్ స్థూపానికి ఘన నివాళి



ప్రజాపక్షం/అల్వాల్ /కాప్రా: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ముద్దుబిడ్డ సిపిఐ రాష్ట్రసహాయ కార్యదర్శి బాల మల్లేష్ 59 వ జన్మదిన సందర్భంగా అల్వాల్ సిపిఐ మండలసమితి ఆధ్వర్యంలో యాప్రాల్ బస్టాండ్ దగ్గర కుటుంబ సభ్యులతో కలిసి స్థూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు సహదేవులు మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై అలుపెరగని పోరాటం చేసిన మహా వ్యక్తి బాల మల్లేష్ లేని లోటు సిపిఐ పార్టీకి తీరని నష్టమన్నారు. బాల మల్లేష్ ఏఐఎస్ఎఫ్ నుండి యువజన రంగం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దాకా పంచలంచెలుగాఎదిగి పేదల పక్షాన నిలబడి ఇల్లు లేని నిరుపేదలకు ఎన్నో ఇండ్లను పంచిన ఘనత బాల మల్లేష్ కే దక్కిందని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపైన వాగ్దానాలు అమలు చేసి ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉండడాన్ని వ్యతిరేకించి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అనేక రాస్తారోకోలు ధర్నాలు నిర్వహించి పేదలకు మంచి చేయాలని సంకల్పంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్లిన వ్యక్తి బాల మల్లేష్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కే.రవిచంద్ర, అల్వాల్ మండల కార్యదర్శి ఏ.బాబు, సహాయ కార్యదర్శి వై.వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య, ప్రధాన కార్యదర్శి విమల నర్సింలు, మురళి గౌడ్, బి.రమేష్, కాళిదాస్, సదానంద్, చిరంజీవి, కుటుంబ సభ్యులు సతీమణి వందన, తదితరులు పాల్గొన్నారు.

## బడి బస్సుల ఫిట్‌నెస్‌పై అనుమానాలు

### వికారాబాద్ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 195.. 250 బస్సులు రిజిస్ట్రేషన్ అయ్యాయి.. పాఠశాలలకు నోటీసులు ఇచ్చి వదిలేశారు!



ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి: వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా బడి భద్రమేనా.... అంటే కాదనే సమాదానం వినవస్తోంది. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ.. బడి బస్సుల కండిషన్‌పై అనేకఅనుమానాలుతలెత్తున్నాయి. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 195 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా 250 వరకు రిజిస్ట్రేషన్ అయిన బస్సులు ఉన్నాయి. మరో వంద బస్సులను అనుమతులు లేకుండా తిప్పుతున్నట్లు సమాచారం. కొందరు ఫిటినెస్ పరీక్షలు చేయించుకోగా మిగిలిన వారు దరఖాస్తు కూడా చేసుకోలేదు. కొందరు నిబంధనలు తుంగలో తొక్కి బస్సులను తిప్పుతున్నా జిల్లా ఆర్‌టిఏ అధికారులు పట్టించుకోడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. పాఠశాలల బస్సులు నడిపించే వారు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంది. డ్రైవర్లు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అనుభావం ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలి. కంటి చూపు, షుగర్, బిపి, ఫిట్స్, గుండెజబ్బు లేనివారిని మాత్రమే డ్రైవర్లుగా నియమించుకోవాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి. కాని ఈ నిబందనలు చాలామంది పాటించ డం లేదని తెలుస్తుంది. ఆర్టీఏ నిబంధనల ప్రకారం 15 సంవత్సరాలు దాటిన బస్సులను విద్యార్థుల రవాణకు వినియోగించరాదు. ఈ నిబంధనను కొన్ని పాఠశాలల యాజమాన్యాలు పట్టించుకోడం లేదనే ఆరోపణలొస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాత బస్సులు కొనుగోలు చేసి వాటికి పేయింట్ వేసి కొత్త బస్సుల్లా కలరింగ్ ఇస్తున్నారని తెలిసింది. ఇదిలా ఉంటే కొందరు ఆర్టీఏ అధికారులు మాత్రం బస్సులను నామమాత్రంగా తనిఖీ చేసి చేతులు దులుపుకుంటున్నారని సమాచారం. దీంతో ఏటా బస్సులు ప్రమాదాలకు గురై చిన్నారులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమైన విషయం తెలిసిందే. 200 స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడం సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఘట్‌కేసర్‌లో బిటెక్ విద్యార్థి అదృశ్యం



ఘట్‌కేసర్ : బిటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ రాహుల్(21) మున్సిపాలిటీ పరిధి అంకుషాపూర్ లోని ఎసిఇ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల14న ఎలాంటి సమాచారం లేకుండా తన రూమ్ నుండి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని తండ్రి ఇస్లావత్ మల్లేష్ బంధుమిత్రులు, ఇతర ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన విద్యార్థి తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్నూరు కాపులకు మంత్రి పదవి ఇవ్వాలి

### కొడంగల్ తాలుకా అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్



ప్రజాపక్షం/కొడంగల్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో రాష్ట్ర మున్నూర్ కాపులకు తీరని అన్యాయం జరుగుతుందని అందుకు మున్నూర్ కాపులకు మంత్రి పదవి ఇవ్వాలని కొడంగల్ తాలుక మున్నూర్ కాపు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం కొడంగల్ పట్టణంలో విలేకరుల సమావేశంలో తాలుక అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్,ప్రదానకార్యదర్శి బాకారం మల్లయ్య, యూత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోంకూర్ నరేష్ కుమార్ మాట్లాడారు. గత అయిదు సంవత్సరాల కాలంలో ఒకే కులం ఒకే సంఘం పేరుతో మున్నూర్ కాపు సంఘం కొనసాగేదన్నారు. కాని ప్రస్తుతం రాజకీయాల కోణంలో ఎవరికి నచ్చే విధంగా వారు మున్నూరు కాపు కులాన్ని వాడుకుని ఎదుగుదలకై స్వార్థ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఒకే సంఘం, ఒకే అధ్యక్షుడుగా ఎన్నికల నేపథ్యంలో మండల, గ్రామ కమిటిల అధ్యక్షులు, కార్యదర్శులకు ఓటు వేసే హక్కును కల్పించాలని కోరారు. అదేవిధంగా ఓ కమిటి మున్నూర్ కాపులో ఇతర కులానికి చెందినటువంటి 9 ఉపకులాలను మున్నూర్ కాపులో విలీనం చేసి మన సంఖ్యను ఎక్కువగా చూపేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారమన్నారు. అలాంటి ఘటనలు చోటుచేసుకుంటేతగిన పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా కొడంగల్‌లో మున్నూరు కాపులంత ఒకే తాటిపై ఉండి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్నూర్ కాపులకు 2 ఎకరాల స్థలాన్ని అందించాలని కోరారు. సంఘం సభ్యులు కానుకుర్తి నర్సిరెడ్డి, మున్నూర్ బిచ్చప్ప, అర్గె ఓంప్రకాశ్, కానుకుర్తిరమేష్,అర్గెఅనంతప్రసాద్,సిరసని శ్యాంసుందర్, బాకారం శేఖర్, మండల అధ్యక్షుడు కానుకుర్తి హన్మంతు తదితరులున్నారు.

## 17న ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ధర్నా

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్, జిల్లా కార్యదర్శి ఉమా మహేష్




ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ నెల 17న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వామ పక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివా రం షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో వామ పక్ష పార్టీల నాయకులు గోడపత్రికను విడుదల చేశారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్, జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఎం మండల కార్యదర్శి లక్ష్మణ్, సిపిఐ ఎమ్ఎల్ నాయకులు అనురాధ, శివబాబు, మాస్ లైన్ కార్యదర్శి ప్రవీణ్, సిపిఎం నాయకులు అంజయ్య,సత్యం, స్వాతి లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో మావోయిస్టు లను ఏరివేత పేరుతో చంపుతాం అని బహిరంగాగా ప్రకటించడం రాజ్యాంగం కల్పించిన మనిషి జీవించే హక్కును కాలరాయడమేనని,చర్చలు జరుపడానికి సిద్ధం అని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమాని, ఇతర దేశాలతో చర్చ లు జరుపడానికి సిద్ధమైన ప్రభుత్వం, స్వంత పౌరులతో చర్చలు జరపకపోవడం బీజేపీ దుర్నీతిని తెలియచేస్తుందని, ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టు లను అంతం అనే పేరుతో ఖనిజాలను అడవులను కార్పొరేట్ సంస్థలకు ధరదత్తం చెయ్యడేమనని పర్యావరనం ను కాపాడుకోవాలంటే ఆపరేషన్ కాగార్ ను ఆపాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్ర పభుత్వం పై ఒత్తిడి తీసుకురావడానికి ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలాని కోరారు. సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి, వంశీ, జంబూ, లక్ష్మి, సిపిఎం నాయకులు శ్రీను, కరుణాకర్, ఎమ్‌డి బాషా, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలం కబ్జా

## విలాసవంతమైన గెస్ట్ హౌస్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం

### కబ్జాదారులకు అండగా నిలుస్తున్న రెవెన్యూ అధికారులు?

ప్రజాపక్షం/దుండిగల్ : కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాదారులకు ఫలహారంగా మారింది. రెండుఎకరాల ప్రభుత్వ స్థలంలో దర్జాగా గెస్ట్ హౌస్ నిర్మాణం చేపట్టి స్విమ్మింగ్ పూల్ కట్టుకొని విలాసవంతమైన జీవనం కోసం భూకబ్జాదారులు తహతహలాడుతున్నారు. కబ్జాలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగులు కబ్జా దారులకు పూర్తిగా సహకరిస్తూ తూతూ మంత్రంగా చర్య లు చేపట్టి తొందరగా కోర్టు నుండి స్టే తెచ్చుకోండి అంటూ సలహాలు ఇచ్చి వారికి వత్తా సు పలుకుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. బౌరంపేటలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం స్థానిక ఓ పార్టీ నాయకులకు ఫలహారంగా మారింది. దాదాపు 20 కోట్లు విలువ చేసే ఈ స్థలంలో జి 9 పట్టాలు ఉన్నాయనే సాకుతో తాము కొనుగోలు చేశామని కొందరు వ్యక్తులు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో విలాసవంతమైన గెస్ట్ హౌస్ నిర్మించారు. అందులో చెట్లు ఏర్పాటు చేసి స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టి దర్జాగా ప్రభుత్వ స్థలాన్ని వాడుకుంటూ యదేచ్ఛగా ఉంటున్నారు. ఈ ఆక్రమణపై పలుమార్లు స్థానిక వివిధ పార్టీల నాయకులు, దుండిగల్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థలాన్ని పరిశీలించిన ఇన్‌స్పెక్టర్ కేవలం గేటు మాత్రమే కూల్చి వెళ్ళిపోయారు.నివ్వెరపోయిన బౌరంపేట వాసులు కబ్జా వ్యవహారం మల్కాజ్‌గిరి ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్డీవో స్పందించి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు.







### కోర్టుస్టేఆర్డర్ ఉందని బుకాయించిన రెవెన్యూఅధికారులు, ఆర్డర్‌ను డిస్పోజల్ చేసిన హైకోర్టు

బరంపేట సర్వే నంబర్ 166లో 20 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిలో గెస్ట్ హౌస్ నిర్మాణం జరిగిందని ఫిర్యాదులపై వెళ్లిన దుండిగల్ రెవెన్యూ అధికారులు జూన్ 6వ తేదీన ప్రహరీ గోడ గేటు మాత్రమే కూల్చివెను తిరిగి వెళ్లారు. అయినా ఫిర్యాదులు ఆగకపోవడంతో కబ్జాదారులకు కోర్టుకు వెళ్ళండి అంటూ రెవెన్యూ అధికారులు కొందరు సలహా ఇచ్చారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సదరు కబ్జాదారుడు 9వ తేదీన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పదవ తేదీన న్యాయస్థానం సదరు పిటిషన్ ను డిస్పోజల్ చేశారు.ఇదే అదునుగా భావించిన రెవెన్యూ అధికారులు ఎవరు ఫిర్యాదు చేసినా కోర్టు స్టే వచ్చిందని మొదట బుకాయించారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ఎటువంటి ఆర్డర్ లేదని ప్రశ్నించడంతో కోర్ట్‌కు వెళ్లాలని కోర్టు సూచించిందని, కబ్జాదారుల తరఫున లాయర్ లేఖ తమకు పంపారని అధికారి సూచించడం గమనార్హం. న్యాయవాది ఓ లేఖ రాసి ఎమ్మార్వోకు డైరెక్షన్ ఇచ్చే చట్టం ఎక్కడ ఉందని..?? అది చెల్లుతుందా అని ప్రశ్నించడంతో సదరు రెవెన్యూ అధికారి నాలుక కర్చుకుని సోమవారం చర్యలు తీసుకుంటాం అంటూ సమస్యను దాటవేసేప్రయత్నం చేశారు. చూడాలి మరి ఇటీవలే కూల్చిన నిర్మాణాన్ని పూర్తిగా తొలగిస్తారాలేకకబ్జాదారులకు సహకరిస్తారో వేచి చూడాల్సిందేనని అంటున్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రైతుభరోసా సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/యాచారం :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేడిపల్లి సహకారసంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప అన్నారు. అదివారం మండల కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతు భరోసాను ప్రతిఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వానా కాలం పంటలకు సంబధించి రైతు భరోసాకు మార్గ దర్శకాలు వేలువడ్డాయన్నారు. 2025 సంవత్సరం జూన్ 5 నుండి ప్రతిఒక్క రైతు అన్ లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. గతంలో రైతు భరోసాకు ధరఖాస్తు చేసుకున్న రైతులు ఇప్పుడు ధరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా పట్టా దారు పాసు పుస్తకాలు పొందిన రైతులు మాత్రమే రైతు భరోసాకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరఖాస్తు ఫారం నింపి రైతు బ్యాంక్ పాసు పుస్తకం, అధార్‌కార్డు జిరాక్స్ పట్టా దారు పాసు పుస్తకం జీరాక్స్ నామిని అధార్‌కార్డు జిరాక్స్ కలిపి మండల విస్తరణ అధికారికి అంద జేయాలని తెలిపారు.చివరి తేదీగా 20 ప్రకటించిందన్నారు. మేడిపల్లి, నానక్‌నగర్, మల్కిజ్‌గూడ, గ్రామాల రైతులతో బాటు ఇతర గ్రామాల రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## చిత్తశుద్ధి ఉంటే పరిష్కారం చూపాలి

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మా బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌బి నగర్ ప్రజల భూ సమస్యల పరిష్కారం తీసుకువచ్చిన జిఒ నెంబర్ 118ను ఆపింది కేవలం కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ అని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం బిఎన్‌రెడ్డి నగర్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడారు. ఎల్‌బి నగర్‌లో రిజిస్ట్రేషన్‌ల పరిష్కారం కోసం అప్పటి అధికారులు మంత్రి కేటీఆర్, ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి స్థాయిలో చర్చించి గజానికి 250 రూపాయలు చెల్లించి కన్వీనియన్స్ డీడ్‌లు అందించామన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తు చేసుకున్న వారిలో 25శాతం మందికి అందించలేకపోయామన్నారు. జీవో 168ని గతంలో 2020లో మున్సిపల్ చట్టం ప్రకారం జిహెచ్‌ఎంసి పరిధిలో అనుమతులు లేకుండా నర్మించుకున్న వారికి సమస్యలు తలెత్తాయన్నారు. కన్వీనియన్స్ డీడ్‌లు పొందినవారికి ఇంటి అనుమతులు, గృహ రుణాలు, రిజిస్ట్రేషన్‌లు కూడా జరుగతున్నాయని ఆయన తెలిపారు. జీవో బోగస్.. ఎన్నికల స్టంట్ అంటూ ప్రచారం చేస్తున్న మధుయాష్కీ గౌడ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు ప్రభుత్వం మెడలు వంచి అందరికీ కన్వీనియన్స డిడ్‌లు అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారుడు మధవరం నర్సింహారావు, అనిల్ చౌదరి, సతీష్ గౌడ్, భిక్షపతి, రాఘవేంద్ర రావు, సుమన్ గౌడ్, ఎస్‌కేడి నగర్ కాలనీ కార్యదర్శి సుధకార్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, జనరల్ సెక్రటరీ ధన్‌రాజ్, వైదేహినగర్ నార్త్ కాలనీ అధ్యక్షులు పోగుల రాంబాబు, శ్రీపురం కాలనీ అధ్యక్షులు ముత్యం రావు,శ్రీరాం నగర్ కాలనీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, సాగర్ కాంప్లెక్స్ ఫేస్2 అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం చైర్మన్ పోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** పేద ప్రజల కోసం పని చేస్తూన్నా ప్రభుత్వం అని ఇంబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ సుర్మాయిగూడ గ్రామానికి చేందినా కోయిలకోండ మహేష్,ములుగు లక్ష్మమ్మ రాపాక సురేష్‌లకు సింఎం రిలీఫ్ పండ్ చెక్కులను పంపిణి చేసినారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి బింగ్ దాస్ గౌడ్,గడ్డి అన్నారం మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాస్కర్ చారి,బుర్ర జంగయ్య,నరిసింహ్మ,శ్రీధర్,సంజీవ తదితరులున్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తే భవిష్యత్ బంగారం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన భరద్వాజ్ అనే యువకుడు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో 905ర్యాంక్ సాధించిన నేపధ్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమ శిక్షణతో విద్యను నేర్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవడమే కాకుండా తల్లిదండ్రుల పేరు ప్రతిష్టలను నిలిపేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. తరగతి గతిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్ధగా నేర్చుకొని గురువులు చెప్పే పాఠ్యంశాలను అభ్యసిస్తే ఉన్నతమైన ర్యాంకులు సాధించి భవిష్యత్‌లో స్థిరపడే అవకాశాలు వస్తాయని వివరించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉంటుందని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, బచ్చలి నర్సింలు, నేతలు నందకిషోర్, దినేష్ సాగర్, అన్వారీ రాజు, గణేష్‌లు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ఉత్సవాలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పండుగ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని సోలిపూర్ గ్రామంలో బొడ్రాయి పండుగ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్టించి మూడేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాల పండుగ నిర్వహించారు. గ్రామ దేవతల చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు సునీల్ పంతులు, వెంకటేశ్వర్ రావు, అభిషేక్ పంతులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, శివరాములు యాదవ్, పులిమామిడి రాజేష్ గౌడ్, సింగపాగ అనిల్‌కుమార్, చీపిరి వెంకటేష్ యాదవ్, చీపిరి రమేష్ యాదవ్, సతీష్, వెంకటేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా కులగణన జరపాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు రవీంద్రాచారి



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** దేశ వ్యాప్తంగా కులగణన జరిపి ఎవరి జనాభా ఎంతో తెలపాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. అబ్దులాపూర్‌మెట్ మండల సిపిఐ కమిటీ అధ్యర్యంలో ఆదివారం కూంట్లూర్ శాఖ సమావేశం జరిగింది. సమావేశానికి రవీంద్రాచారి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నా బిజెపి ప్రభుత్వం కులగణన, జనాభా లెక్కలు జరిపి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. 78 సంవత్సరాలుగా పేద ప్రజలు ఓట్లు వేసే యంత్రాలుగా తయారు చేసినా భూర్జువ పార్టీలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బిసిలకు 42 శాతం వాటా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. రాజ్యాంగం కల్పించినా హక్కులను పేద ప్రజలకు కల్పించకుండా చేస్తున్నా ప్రభుత్యాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం ఉచితంగా ప్రజలకు ప్రభుత్వాలు అందేలా చేయకపోవడం దారుణం అన్నారు. రాబోయే కాలంలో పేద ప్రజల పక్షాన సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మావోయిస్టుల అణచివేసే పేరుతో ఆదివాసులపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. నరేంద్ర మోడీ, అమిత్‌షా ప్రభుత్వం రాజ్యాంగం, చట్టంలో పేర్కొన్న ఆదివాసుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. సహజ వనరులు, ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే వారి లక్ష్యమని, అందుకే మావోయిస్టులను హతమారుస్తారని ఆరోపించారు. భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, చట్టాలకు విరుద్ధంగా బిజెపి ప్రభుత్వం చేస్తున్న ఈ దమనకాండకు వ్యతిరేకంగా సిపిఐ పోరాటాలు చేస్తుందని రవీంద్రచారి తెలిపారు. సమావేశంలో కుంట్లూర్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ శాఖ కార్యదర్శిగా బానోత్ బిచ్చు నాయక్, సహాయ కార్యదర్శులుగా రాంరెడ్డి, సామ కొండల్‌రెడ్డి ఎన్నికయ్యారు. సమావేశానికి మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల యాది రెడ్డి, చిర్ర శేఖర్, ప్రజానాట్య మండలి నాయకులు గణేష్, విద్యార్థి నాయకులు పేరాల గోపి, సైదులు, అనసూయ, రాజు రవళి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు తెల్లరేషన్ కార్డులు, డబుల్ ఇండ్లు



సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు

**ప్రజాపక్షం/గండిపేట :** అర్హులైన నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి, పార్టీ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాలు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ మండలంలోని అంబేద్కర్ నగర్ శాఖ 3వ మహాసభ ఆదివారం సిపిఐ కార్యాలయం దేవరాజ్ భవన్‌లో జరిగింది. సమావేశానికి మండల సహాయ కార్యదర్శి షేక్ షఫీ అధ్యక్షతన వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింగ్‌రావు హాజరై మాట్లాడుతూ వంద వసంతాలలోకి అడుగుపెడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాటి నుండి నేటి వరకు ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ఏకైక పార్టీ అన్నారు. రాజేంద్రనగర్ మండలంలో అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం నుంచి రావలసినటువంటి సంక్షేమ పథకాలన్నీ అమలు చేయడానికి సిపిఐ కృషి చేస్తుందన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండలంలో పేదల పక్షాన ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు మహాసభలో మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఎండి రియాజ్ మాట్లాడారు. మహాసభలో నూతన కమిటీని ప్రకటించారు. అంబేద్కర్ నగర్ కార్యదర్శిగా బండారి శాంతమ్మ, సహాయ కార్యదర్శిగా బి.వనమ్మ, కమిటీ సభ్యులుగా సుశీల, యాదమ్మ, అండాలు, బాలమణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఐ ఆఫీస్ కార్యదర్శి సత్యం, కృష్ణ , లక్ష్మణ్ , చెన్నకేశవులు రాములు , తదితరులు పాల్గొన్నారు

## భవన నిర్మాణ కార్మికుల హక్కులు హరిస్తున్న ప్రభుత్వాలు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లేష్

**ప్రజాపక్షం/గండిపేట:** భవన నిర్మాణ కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని బిల్డింగ్ కన్స్రక్షన్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లేష్ ఆరోపించారు. గండిపేట్ మండల్ నార్సింగి మున్సిపాలిటీ, మణికొండ మున్సిపాలిటీలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం బిఒసి మండల కార్యదర్శి బాబు రావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మల్లేష్ మాట్లాడుతూ ఎఐటియుసి అనేక పోరాటాలతో 1996లో భవన నిర్మాణ కార్మికుల కోసం తీసుకొచ్చిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్వం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రవేట్ ఇన్సూరెన్స్‌కు అప్పగిస్తే భవన నిర్మాణ కార్మికులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. 17న స్టేట్ లేబర్ కమిషనర్ ఆఫీస్ వద్ద ధర్నాకు వందలాదిగా తరలివచ్చి భవన నిర్మాణ కార్మికుల హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వాని నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు శంకరయ్య, మండల కార్యదర్శి స్వామి, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## బిఎఎస్‌ఎంఎ పాఠశాలల బకాయి బిల్లులు విడుదల చేయండి

పాఠశాలల అసోసియేషన్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించి, విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని బెస్ట్ అవలెబుల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసో సియేషన్ (బిఎఎస్‌ఎంఎ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఎఎస్‌ఎంఎ అధ్యక్షుడు కె.వీరన్న, ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ గిరిజన,దళిత వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు విద్యను అందించే లక్ష్యంతో మూడు దశాబ్దాల క్రితం ఈ పథకం ప్రారంభమైందని, ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన అనేకమంది విద్యార్థులు ప్రస్తుతం ఐపిఎస్, ఐఆర్‌ఎస్ వంటి ఉన్నత స్థాయిలలో ఉన్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 180 పాఠశాలలో 26 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి నిధులను మంజూరు చేస్తుందని, కానీ ప్రస్తుతం ఆ నిధులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఆ నిధులు మంజూరు కాకపోవడంతో పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి సుమారు రూ 150 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉన్నదని, పాఠశాలల నిర్వహణ ఇతర ఖర్చులు భరించలేక ఆర్థిక కష్టాలతో పాఠశాలల నిర్వహకులు నరకయాతన అనుభవిస్తున్నారని వారు చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేసి, పేద విద్యార్థుల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లింగారెడ్డి, రాజీ రెడ్డి, దేవేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జయశంకర్ గౌడ్ , అభిలాష్ ఆశి రెడ్డి ,నరేష్ రెడ్డి , డాక్టర్ బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'హెల్తీ మ్యాన్-హ్యాపీ ఫాదర్' క్యాంపెయిన్ ప్రారంభించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫాదర్స్‌డే సందర్భంగా 'ఒయాసిస్ జనని యాత్ర' పేరిట కార్యక్రమాన్ని ఒయాసిస్ ఫెర్టిలిటి ప్రారంభించింది. ఒయాసిస్ ఫెర్టిలిటీ సైంటిఫిక్ హెడ్, క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య ఎమ్మ రియు ఇతర ప్రముఖుల సమక్షంలో, ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డిసిపి ఎ.రాములు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి రావు మాట్లాడుతూ, వంధ్యత్వాన్ని అనాదిగా స్త్రీలకు సంబంధించిన సమస్యగానే చూస్తున్నారన్నారు, పురుషుల ఫెర్టిలిటీ సమస్యలను గురించి మాట్లాడకుండా వాటిని విస్మరిస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతిని మార్చడానికి ఈ విషయంగా నిశ్శబ్దాన్ని ఛేదించడానికి, అలాగే ఈ విషయంలో ఉన్నఅపోహలను తొలగించడానికి 'హెల్తీ మ్యాన్‌హ్యాపీ ఫాదర్' ప్రచారకార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫెర్టిలిటీ అనేది ఉమ్మడి బాధ్యత, పురుషులు విశ్వాసంగా, మద్దతుతో ముందుకు సాగాల్సిన సమయమన్నారు. సైన్స్ ఆధారిత సంరక్షణ, అందుబాటులో ఉన్న వనరుల ద్వారా పురుషులు తమ ఫెర్టిలిటీ ప్రయాణాన్ని విజయవంతం చేసుకునేలా సాధికారత కల్పిస్తామన్నారు. ఉచిత ఫెర్టిలిటి పరీక్షలు, అవగాహన కార్యక్రమాలతో పాటు, అధునాతన సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడానికి, పురుషులు తమ పునరుత్పత్తి ఆరోగ్యం పట్ల ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఆధారాల ఆధారిత పరిష్కారాలతో మూల కారణాలను పరిష్కరించడం ద్వారా, ఆరోగ్యకరమైన కుటుంబాలను, బలమైన భవిష్యత్తును నిర్మించడంలో సహాయపడుతామని ఒయాసిస్ ఫెర్టిలిటీ సైంటిఫిక్ హెడ్, క్లినికల్ ఎంబ్రియాలజీస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య ఎమ్ అన్నారు. 'ఒయాసిస్ ఫెర్టిలిటీలో, పురుషుల సంతానోత్పత్తి ప్రయాణానికి మద్దతు ఇవ్వడం కోసం సైన్స్, వ్యక్తిగత సంరక్షణ శక్తిని ఉపయోగించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. తండ్రి కావాలని ఆకాంక్షిస్తున్న ప్రతి వ్యక్తికి గొప్ప శాస్త్రీయ విధానాలు అందగా ఉన్నాయనే తమ ప్రధాన విశ్వాసంతోముందుకుసాగుతూ, పురుషులు వారి పునరుత్పత్తి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేలా చేసి, కుటుంబాలను నిర్మించడంలో సహాయపడే సమగ్రమైన, ఆధారాల ఆధారితమైన విధానాన్ని మేం అందిస్తున్నామని ఒయాసిస్ ఫెర్టిలిటీ సిఈఓ పుష్కరాజ్ షెనాయ్ అన్నారు.

## బిసిని ముఖ్యమంత్రి చేయాలన్నదే లక్ష్యంగా ఉద్యమం

జాతీయ బిసి సేన అధ్యక్షుడు బర్క కృష్ణ



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** తెలంగాణలో బిసిని ముఖ్యమంత్రి చేయాలన్నదే లక్ష్యంగా బిసిసేన పోరాటాలు, ఉద్యమాలు చేస్తుందని జాతీయ బిసిసేన అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ బిసిసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా సదర్ శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నేతలు బిసిలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారే తప్పా ఎలాంటి అవకాశాలు కల్పించడం లేదన్నారు. బిసిలు ఐక్యంగా ముందుకు వచ్చి పోరాటాలు, ఉద్యమాలు చేస్తే హక్కులను సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడం కాదు రాజకీయాలు శాసించే స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, డివిజన్ కార్యదర్శి చంద్రశేఖర్, అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి శారద, టమండల అధ్యక్షుడు మేకల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు తంగేళ్లపల్లి శంకర్, కేశంపేట మండల అధ్యక్షుడు దేవేందర్, యువజన అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీను, సౌజన్య, జలజ, స్రవంతి రాజ్, భాగ్యలక్ష్మి తోపాటు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** నిరంతరం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పనిచేసే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విరజిల్లాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్ లోని జిల్లా కార్యాలయం వద్ద రంగారెడ్డి జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులకు,అభిమానులకు తినిపించారు. అనంతరం చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిర కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టిపిసిసి ఉపాధ్యక్షులు ముద్దగౌని వేణు గౌడ్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమ్ భరత్, పిసిసి ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, శేర్లింగంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, రాజేంద్రనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందు యాదవ్, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.



**ఇబ్రహీంపట్నం:** ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను ఆదివారం నగరంలోని ఆయన స్వగృహంలో టిపిపిసి సభ్యులు,ఆదిభట్ల మున్సీపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోపార్టీఅభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు.



**సరూర్‌నగర్ :** విద్యారంగాన్ని మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అదివారం కొత్తపేటలోని విక్టోరియా మెమోరియా రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల సమక్షంలో ఆయన జన్మధిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలతో కలిసి కేక్‌కట్‌చేసి, వారితో మమేకమయ్యారు. వేడుకల్లో టిపిసిసి ప్రచార కమిటీ కార్యధర్శి మధుయాష్కిగౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పిల్లి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రీల్



## బాధ్యత పెరిగింది

విజయ్ దేవరకొండ

కాంతారావు ఫిలిం అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని హీరో విజయ్ దేవర కొండ అన్నారు. అయితే ఈ అవార్డుతో తనపై బాధ్యత పెరిగిందని భావిస్తున్నానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తొలి సారిగా ఇచ్చిన సినిమా అవార్డులో నేను కూడా భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉందని ప్రజా పక్షంతో ముచ్చటిస్తూ అన్నారు. రాబోయే రోజుల్లో మరింత బాధ్యతగా, మరిన్ని మంచి సినిమాలు అందిస్తానని విజయ్ దేవర కొండ చెప్పారు.

## గద్దర్ అవార్డు వేడుక సక్సెస్

– దిల్ రాజు



తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు వేడుక గ్రాండ్ సక్సెస్ అయిందని తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. గద్దర్ అవార్డ్స్ ఫంక్షన్‌కి ఆరు నెలల ముందు నుంచి పనులు మొదలు పెట్టామని చెప్పారు. ఆదివారం ఎఫ్ఎన్‌సిసిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు, ఎఫ్‌డిసి ఎండి హరీష్ మాట్లాడారు. ఈవెంట్ సక్సెస్ కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి వారు ధన్యవాదాలు తెలిపారు.

గద్దర్ అవార్డ్స్ మొదట ఒక సంవత్సరానికి ఇవ్వాలని అనుకున్నామని చెప్పారు. కాని ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి చొరవతో పది సంవత్సరాల అవార్డులను అందిచడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డులు అందుకున్న అందరికి ధన్యవాదాలు తెలిపారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వెంకట్ రెడ్డి, డిప్యూటీ సిఎంలు ముందు నుంచి సపోర్ట్ చేస్తూ వచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక్క గంట సమయం మాత్రమే షెడ్యూల్‌లో ఉంది.కాని సినిమా ఇండస్ట్రీకి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో రెండు గంటల సమయం కేటాయించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎపిలో కూడా త్వరలో అవార్డ్స్ మొదలవుతాయని దిల్ రాజు ప్రకటించారు. అక్కడి ప్రభుత్వం సినిమాలకు అవార్డులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఎన్ని సినిమాలలో బిజీగా ఉన్న అవార్డులు స్వీకరించాలి. మన బాధ్యత అందరికీ ఉండాలని చెప్పారు. సినిమా ఫీల్డ్‌లో ఉన్న అందరికి ఇది తన రిక్వెస్ట్ అని అన్నారు. ఈవెంట్‌కి వచ్చిన వారిలో ఎవరికైనా చిన్నచిన్న ఇబ్బందులు తలెత్తి ఉంటే వారికి క్షమాపణలు చెప్తున్నానని దిల్ రాజు తెలిపారు.

## బలగం హిస్టరీ క్రియేట్ చేసింది

– నిర్మాత హన్సిత రెడ్డి



తెలంగాణా నేపథ్యంలో తెరకెక్కించిన బలగం సినిమా వందేళ్ల తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే ఒక హిస్టరీ క్రియేట్ చేసిందని నిర్మాత హన్సిత రెడ్డి అన్నారు. 2023వ ఏడాదిలో రిలీజ్ అయిన బలగం సినిమా ఎంతటి ఘన విజయం సాదించిదో అందరికి తెలుసునని ఆమె అన్నారు. ఇప్పుడు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె **ప్రజా పక్షం**తో చెప్పారు. నిర్మాతలుగా నేను, మా అన్నయ్య హర్షిత్ రెడ్డి మొదటి అడుగు వేశామని, దర్శకుడిగా కూడా వేణు తొలి అడుగు వేశారన్నారు. కమెడియన్ వేణు కాస్త ఇప్పుడు బలగం వేణుగా మారిపోయాడని ఆమె తెలిపారు. సినిమా రిలీజ్ అనంతరం తెలంగాణలోని చాలా గ్రామాల్లో అందరూ కలసి కూర్చుని బలగం సినిమా చూశారని చెప్పారు. ఈ సినిమా చూసిన తరువాత విడిపోయిన పలు కుటుంబాలు కలిశాయని చాలా మంది చెప్తుంటే ఎంతో సంతోషమేసిందని అన్నారు. మొదటి సినిమాతోనే ఇంతమంచి పేరు రావడం, తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డు ఇచ్చి సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## అవార్డు రుద్రమదేవికి రావడం సంతోషంగా ఉంది : గుణ శేఖర్



కాకతీయుల చరిత్రను తెరకెక్కించిన రుద్రమదేవి సినిమాకు బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అవార్డు రావడం సంతోషంగా ఉందని దర్శకుడు గుణశేఖర్ అన్నారు. 2015వ సంవత్సరానికి గాను తొలి ఉత్తమ చిత్రంగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని ప్రజాపక్షంతో చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన తరువాత మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ఇవ్వడానికి ముందుకు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను అని అన్నారు. అవార్డు అనేది నైటీ నటులకు, దర్శకులకు గౌరవాన్ని పెంచుతాయని చెప్పారు. అవార్డు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి గుణ శేఖర్ క్రుతజ్ఞతలు తెలిపారు. గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమాలో అనుష్క టైటిల్ రోల్ పోషించారు.



## రాజబాబుకు ఘన నివాళి

హాస్య నటుడు రాజబాబు 68వ జయంతి ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగింది. పలువురు సినీ ప్రముఖులు రాజబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రంలో దర్శకుడు బి.గోపాల్, తుమ్మల రంగారావు, నిర్మాత డీవీకే రాజు, దర్శకుడు ఉప్పలపాటి నారాయణ రావు, ఆర్.నాగేశ్వరరావు, నర్రా వెంకట్ రావు, వి.కుమార్, వై.బాలాజీ, సూర్యతేజ, శైలజ, గోరంట్ల సురేష్, అట్లూరి నాగేశ్వర రావు, క్రొత్తపల్లి శ్రీధర్ ప్రసాద్, కొండపనేని ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలను దర్శకుడు వీర శంకర్, ఆచార్య డి.ఎస్.ఎన్.మూర్తి, భగీరథ, నటుడు జి.ఎస్. హరి, పరిశోధకుడు జి జి.బసవ శంకర్ రావు, పాటల రచయిత వెనిగెళ్ల రాంబాబు, విద్యావేత్త పూర్ణచంద్ర రావు, నటి జ్యోతి పూర్ణిమ లకు రాజబాబు స్మారక పురస్కారాలను అందజేశారు.

## అది నాకు గుర్తుండి పోయే పాత్ర

హీరోయిన్ అనంతిక



పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ తాజాగా నిర్మించిన ప్రేమకథ చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్‌సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ హీరోయిన్‌గా నటించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన '8 వసంతాలు' నుంచి ఇప్పటికే రిలీజైన పాటలకు మంచి స్పందల లభిస్తోంది. ఈ చిత్రం జూన్ 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్ ప్రజా పక్షం ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చింది.

*** 8 వసంతాలు సినిమా కథంతా మీ చుట్టే తిరుగుతుందా ?**

కథలో అమ్మాయి పాత్ర కీలకం అయినప్పటికీ మిగతా పాత్రలన్నిటికీ సమానంగా ప్రాముఖ్యత వుంది. ప్రతి క్యారెక్టర్ ఇంపార్టెంట్. ప్రతి క్యారెక్టర్ కి లేయర్స్ ఉంటాయి. అయితే ఇది ఒక విమెన్ కు సంబధించిన కథ. మీరన్నట్టు కథ మొత్తం నా చుట్టే తిరుగుతుంది

*** మ్యాడ్ తర్వాత ఈ సినిమాలో చేశారు ఇందులో మిమ్మల్ని ఆకర్షించిన పాయింట్ ఏమిటి ?**

మంచి కథ కోసం వెయిట్ చేశాను. ఈ కథలో నేను కోరుకున్న ప్రతిదీ ఉంది. నాకు యాక్షన్, బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చేయాలని ఉండేది. అవన్నీ కూడా ఈ కథలోనే కుదిరాయి. ఫర్ఫార్మెన్స్ చేయడానికి చాలా మంచి స్కోప్ ఉండే క్యారెక్టర్. అందుకే ఇది ఒప్పుకున్నాను. కథ చదివినప్పుడు చాలా కనెక్ట్ అయ్యాను. లిటరల్‌గా ఏడ్చేశాను. అంత ఎమోషనల్‌గా ఉండే కథ ఇది. నేను శుద్ధి యోగ్య పాత్రలో కనిపిస్తాను. తను ఒక రచయిత అలాగే తనకి మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం కూడా ఉంటుంది.

*** మీ ప్రేమ కథలో ప్రత్యేకత ఏమిటి ?**

చాలా ప్యూర్ లవ్ స్టోరీ ఇది. రియల్ ఒక జీవితాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. అన్ని ఏజ్ గ్రూప్స్‌కి సరిపడే కథ.

*** ఈ సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నారా?**

నాకు బ్లాక్ బెల్ట్ వచ్చు. ఈ సినిమా కోసం కళరి ఫైట్ నేర్చుకున్నాను. అలాగే వింగ్ చూన్ అనే చైనీస్ ఆర్ట్ ఫామ్ ని కూడా నేర్చుకున్నాను. దాని కోసం మూడు నెలలు అంజి మాస్టర్ దగ్గర ట్రైనింగ్ తీసుకున్నాను. అందుకే ఇందులో ప్రతి యాక్షన్ సీన్ చూడముచ్చటగా ఉంటుంది.

*** డైరెక్టర్ ఫణీంద్ర గురించి చెప్పమంటే ఏం చెప్తారు?**

ఫణీంద్ర గారు నాకు గురువు లాంటి వారు. ఈ జర్నీలో ఎన్నో విషయాలు ఆయన నుంచి నేర్చుకున్నాను. ఆయన క్లియర్ విజన్‌తో ఉంటారు. చాలా పాషనేట్ ఫిలిం మేకర్. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. అదేవిధంగా మైత్రి మూవీ మేకర్స్‌తో వర్క్ చేయడం అద్భుతమైన ఎక్స్పీరియన్స్. నన్ను బిలీవ్ చేసి ఈ ప్రాజెక్టులో తీసుకున్నందుకు నిర్మాతలకు థాంక్స్ చెప్తున్నాను. ఈ జర్నీలో చాలా సపోర్ట్ చేశారు. ఇలాంటి సినిమాని తీయడానికి చాలా గట్స్ కావాలి. సంగీత దర్శకుడు హేషమ్ రెండు బ్యూటీఫుల్ సాంగ్స్ ఇచ్చారు. రెండు పాటలు ఆడియన్స్‌కి చాలా నచ్చాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంటుంది.

*** హీరోయిన్‌గా బిజీగా ఉంటూనే చదువుకుంటున్నారా?**

అవును... లా చదువుతున్నాను. పొలిటీషియన్ అవ్వాలని నా కోరిక. అయితే ఇప్పుడు కాదు ఓ నలభై యేళ్ల తరువాత.

## జీవితంలో మరచిపోలేను

–రెంటాల జయదేవ్

తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు చరిత్రలో ఉత్తమ తొలి పుస్తకం నాదే కావడం ఎంతో సంతోషంగా ఉందని ఫస్ట్ రీల్ పుస్తక రచయిత రెంటాల జయదేవ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా ఇచ్చిన సినిమా అవార్డుల్లో తొలి సినిమా పుస్తకం నేను రాసిన ఫస్ట్ రీల్‌కు ఈ ఘనత దక్కడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాని అవార్డు తీసుకున్న తరువాత **ప్రజా పక్షం**తో మాట్లాడుతూ చెప్పారు. మొత్తం ఏడు పుస్తకాలు పోటీకి వచ్చినా ఫస్ట్ రీల్ పుస్తకాన్ని ఉత్తమ పుస్తకంగా ఎంపిక చేసిన జ్యూరి సభ్యులకు , తనకు అవార్డు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తక కోసం ఎక్కడెక్కడి నుంచి సమాచారం సేకరించానని అన్నారు. ఎంతో రీసెర్చ్ చేసి ఫస్ట్ రీల్ పుస్తకం రాశానని చెప్పారు సుమారు ఇరవై ఏళ్లకు పైగా చేసిన కృషికి ఫలితం లభించిందని ఆయన ఆందనం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా పుట్టిన తేదీ గురించి రకరాల ఊహాగానాలు అపోహాలు ఉన్న నేపథ్యంలో ఎంతో కష్టపడి, చెన్నై, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ ఇలా చాలా ప్రాంతాల్లో తిరిగి పక్క సమాచారం సేకరించానన్నారు. ఈ పుస్తకం బయటికి రావడానికి కృషి చేసిన, నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డుకు ఉత్తమ పుస్తకంగా ఫస్ట్ రీల్‌ను ఎంపిక చేసి నాకు అవార్డు ఇవ్వడం జీవితంలో మరచిపోలేనని పుస్తక రచయిత రెంటాల జయదేవ్ తెలిపారు.





## గర్వంగా ఉంది

–దర్శకుడు సాయి రాజేష్

సుహాస్ హీరోగా నిర్మించిన కలర్ ఫొటో సినిమాకు గద్దర్ అవార్డు రావడం ఎంతో గర్వంగా ఉందని దర్శకుడు సాయి రాజేష్ అన్నారు. 2020ఏడాదికి గానూ ద్వితీయ ఉత్తమ చిత్రంగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు కు ఎంపిక కావడం, తమ జీవితంలో తొలిసారిగా ప్రభుత్వ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సాయి రాజేష్ **ప్రజా పక్షం**తో చెప్పారు. ఈ అవార్డు వచ్చిందంటే ఈ సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరి క్రుషి ఉందని ఆయన తెలిపారు. కోట్లాది మంది ప్రజలు చూస్తుండగా అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సుభాష్, చాందిని చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు.

---

## రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించండి

సిఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సూచన

స్కిల్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరిన సిఎం

ఐటిఐల సిలబస్ అప్‌గ్రేడ్‌కు కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వివిఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఆదివారం సమావేశమయ్యారు. ఐటిఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి, దానిని ఐటిఐలను అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఐటిఐలన్నింటికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సిఎంను కోరారు. ఐటిఐలలో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఎం వెంటనే అధికారులను ఆదేశించారు. ఆధునిక పరిశ్రమ అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటిఐలలో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, అందుకోసం ప్రత్యేక కమిటీ నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సిఎంఓ పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సిఈఓ జయేశ్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో రామశర్మ కృషి మరవలేనిది

రామశర్మ 8వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎంఎల్‌సి సత్యం, పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో రామశర్మ కృషి మరువలేనిదని సిపిఐ ఎంఎల్‌సి, నల్గొండ సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు అన్నారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంఎల్‌ఏ, సిపిఐ దేవరకొండ తాలుకా ఉద్యమ నిర్మాతలలో ఒకరైన అమరజీవి కామ్రేడ్ బొడ్డుపల్లి రామశర్మ 8వ వర్ధంతి సందర్భంగా దేవరకొండ పట్టణంలోని కామ్రేడ్ పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో రామశర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్‌సి, సిపిఐ జిల్లాకార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ నల్గొండ జిల్లా దేవరకొండ తాలుకా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు మాజీ శాసన సభ్యుడు కామ్రేడ్ బొడ్డుపల్లి రామశర్మ ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే బాటగా ఎంచుకొని ఆరు దశాబ్దాలపాటు పేద ప్రజలు, రైతు కూలీల హక్కుల కోసం ఉద్యమించిన పోరాట యోధుడని అన్నారు. 1949లో కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపునకు ఆకర్షితులై నిజాం రాచరిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న జమిందారి, జాగీర్దారి, భూస్వామ్య దేశ్‌ముఖులు, దొరలు, రజకారు గుండాలతో గ్రామాలలో సాగిస్తున్న దౌర్జన్యాలకు, వెట్టిచాకిరి, లేవి గళ్ళ వసూళ్లకు అదనపు శిస్తుకు వ్యతిరేకంగా రైతు కూలీలను సంఘటితపరిచి పోరాటాలను చేపట్టాలనే పిలుపుతో దేవరకొండ తాలుకాలో పల్లా పర్వత్‌రెడ్డి, ఉజ్జిని నారాయణరావులతో కలిసి ఉద్యమాలను నడిపినారని, 1951సంవత్సరంలో సాయుధ పోరాట విరమణతో దేవరకొండ తాలుకా మొదటి కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసి 1959లో కందుకూరు గ్రామ మొదటి సర్పంచ్‌గా రామశర్మ బాధ్యతలు నిర్వహించారని, 1964లో అదనపు శిస్తుకు వ్యతిరేకంగా 60 రోజుల సత్యగ్రాహానికి నాయకత్వం వహించి విజయం సాధించారని, దున్నేవానికి భూమి ఇవ్వాలని, భూస్వాముల కింద అక్రమంగా ఉన్న ప్రభుత్వ భూములైన పోరంబోకు, బంచరాయి, చెట్లులేని అటవి భూములను పేదలకు పంచి, పట్టాలివ్వాలని, శ్రీశైలం సొరంగం ద్వారా డిండి ప్రాజెక్టు నింపాలని, డిండి డ్యాంను మూడు అడుగులుపెంచాలని 1981లో దేవరకొండ పట్టణంలో 1200 ఎడ్ల బండ్లతో ప్రదర్శన నిర్వహించి పెద్ద ఎత్తున ప్రభుత్వంపై వత్తిడి చేసి, ప్రాజెక్టును సాధించడంలో ముఖ్యపాత్ర వహించారని అన్నారు.

1972 నుండి 1978 వరకు దేవరకొండ ఎంఎల్‌ఏగా ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని, 1962 నుండి 1972 వరకు తాలుకా కార్యదర్శిగా, 1986 నుండి 1995 వరకు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పార్టీలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారన్నారు. చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం ఆదర్శంగా జీవించిన కమ్యూనిస్టు నేత రామశర్మ అని ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, యాదయ్య, పట్టణ శాఖ కార్యదర్శులు జ్యోతిబస్, మైనోద్దిన్, మల్లయ్య, శ్రీను, మల్లేష్, వెంకటాద్రి, నాయకులు బుచ్చయ్య, ఆనందచారి, రాజమల్లయ్య, కృష్ణారెడ్డి, బ్రహ్మచారి, యాదయ్య, శ్రీను, లక్ష్మణ్‌చారి, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్ ఆపాలి

నిరసనగా.. 23న చలో రాజ్ భవన్ విజయవంతం చేయాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, అమాయక గిరిజనులపై క్రూర దాడులు జరిపి భయానక నరమేధాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని, ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్రకార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ అటవీ సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని, అంబానీ, ఆదానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అన్నారు. ఇటీవలికాలంలో కేంద్ర ప్రభుత్వం జరిపిన మావోయిస్టుల హత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి, బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారన్నారు. డెట్‌లైన్ విధించి మావోయిస్టులు, ఆ సంస్థలను అంతం చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం వెనుక ఆర్‌ఎస్ఎస్ రహస్య ఎజెండాను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తుందని విమర్శించారు. ఇలాంటి భయానక దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమించాలన్నారు. మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్ర దాడులకు పాల్పడిన పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ప్రకటించిన మోదీ ప్రభుత్వం రాజకీయ సమస్య పరిష్కారానికి మావోయిస్టులతో ఎందుకు కాల్పుల విమరణ ప్రకటించడం లేదని ప్రశ్నించారు. మావోయిస్టు సమస్యను ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి, చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అందుకే ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే 'ఆపరేషన్ కగార్'ను ఆపాలని, ఆదివాసీలపై దమనకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఛలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివ కుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు పాల్గొన్నారు.

## కూలిన హెలికాప్టర్

(మొదటి పేజీ తరువాయి)

మంటలు చెలరేగాయి. దీంతో అందులో ఉన్న వారంతా మృతి చెందారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగానే హెలికాప్టర్ ప్రమాదానికి గురైనట్లు రుద్రప్రయోగ్ జిల్లా విపత్తు నిర్వహిణ అధికారి నందన్ సింగ్ రాజ్‌వార్ పిటిఐకి వెల్లడించారు. ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెష్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ద్వారా దర్యాప్తు జరపనున్నట్లు పౌరవిమాన మంత్రిత్వశాఖ తెలిపింది. విమానంలో 5 మంది ప్రయాణికులు, ఒక శిశువు, సిబ్బంది ఉన్నారు. హెలికాప్టర్ గుప్తాకాశి నుండి 05:10 గంటలకు బయలుదేరి 05:18 గంటలకు శ్రీ కేదార్‌నాథ్ జీ హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. హెలికాప్టర్ 05:19 గంటలకు గుప్తాకాన్శికి తిరిగి బయలుదేరి గౌరికుండ్ సమీపంలో కూలిపోయినట్లు ఒక అధికారిక ప్రకటన వెలువడింది. ముందు జాగ్రత్త చర్యగా, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రి చార్ ధామ్ పుణ్యక్షేత్రాలకు హెలికాప్టర్ కార్యకలాపాల ఫ్రీక్వెన్సీని తగ్గించింది. మే 8న, గంగోత్రి ధామ్‌కు వెళ్తున్న హెలికాప్టర్ ఉత్తరకాశి జిల్లాలో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించారు. ఈనెల 7న కూడా కేదార్‌నాథ్‌కు వెళ్తున్న ఒక హెలికాప్టర్ అయిన వెంటనే సాంకేతిక లోపం తలెత్తడంతో రోడ్డుపై అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో పైలట్ గాయపడ్డాడు. ఐదుగురు భక్తులు సురక్షితంగా రక్షించబడ్డారు. తాజా హెలికాప్టర్ ప్రమాదం నేపథ్యంలో చార్‌ధామ్ యాత్ర మార్గంలో హెలికాప్టర్ సేవలను రెండు రోజుల పాటు నిలిపివేస్తామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రకటించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. హెలికాప్టర్ కార్యకలాపాలకు కఠినమైన సూచనలు జారీ చేసినట్లు ధామి తెలిపారు. రాష్ట్రంలో హెలి సేవల నిర్వహణకు కఠినమైన ఎస్‌ఒపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) సిద్ధం చేయాలని, అందులో హెలికాప్టర్ సాంకేతిక స్థితిని పూర్తిగా తనిఖీ చేయడం తప్పనిసరి అని ముఖ్యమంత్రి అన్నారు. హెలి కార్యకలాపాలకు ముందు వాతావరణ స్థితిని కూడా తనిఖీ చేయాలని సూచించారు. హెలి కార్యకలాపాల అన్ని సాంకేతిక, భద్రతా అంశాలను క్షుణ్ణంగా సమీక్షించిన తర్వాత ఎస్‌ఒపిని సిద్ధం చేసే సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. హెలి సేవల నిర్వహణ పూర్తిగా సురక్షితంగా, పారదర్శకంగా, నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఉండేలా కమిటీ నిర్ధారిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. రాష్ట్రంలో గతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదాలను పరిశోధించడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఆదివారం జరిగిన హెలి ప్రమాదాల ప్రతి అంశాన్ని అలాగే మునుపటి హెలి ప్రమాదాల ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశోధించి తన నివేదికను సమర్పించాలని ధామి ఆదేశించారు. ఈ కమిటీ ప్రతి ఘటనకు గల కారణాలను లోతుగా పరిశీలించడంతో పాటు దోషులను లేదా సంస్థలను గుర్తించి వారిపై కఠిన చర్యలను సిఫార్సు చేస్తుంది. తీర్థయాత్ర, విపత్తు నిర్వహణ, అత్యవసర సేవలకు రాష్ట్రంలో హెలి సేవల ప్రాముఖ్యత చాలా ఉందని, అందువల్ల వీటిలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

### పైలట్‌కు ఆర్మీలో 15 ఏళ్లకుపైగా అనుభవం

హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన పైలట్ రాజ్‌వీర్ సింగ్ చౌహాన్ 15సంవత్సరాలకుపైగా భారత సైన్యంలో సేవలందించారు. వివిధ భూభాగాలపై విమానాలను నడపడంలో అపార అనుభవం ఉంది. జైపూర్‌లోని శాస్త్రి నగర్‌లో నివసిస్తున్న చౌహాన్, అక్టోబర్ 2024 నుండి ఆర్యన్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పైలట్‌గా పనిచేస్తున్నాడు. భారత సైన్యంలో పనిచేసిన చౌహాన్‌కు వివిధ భూభాగాలపై విమానాలు నడపడంలో, వైమానిక కార్యకలాపాలను పర్యవేక్షించడంలో అపారమైన అనుభవం ఉంది. వివిధ రకాల హెలికాప్టర్లు, వాటి నిర్వహణలో శిక్షణ పొందాడని అతని లింక్డ్ఇన్ ప్రొఫైల్ తెలిపింది. కాగా, ఏడుగురు వ్యక్తుల మరణం పట్ల రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ విచారం వ్యక్తం చేశారు. 'కేదార్‌నాథ్ సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో జైపూర్ నివాసి పైలట్ రాజ్‌వీర్ సింగ్ చౌహాన్ సహా ఏడుగురు వ్యక్తులు మరణించడం చాలా విచారకరం. ఈ క్లిష్ట సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'అని ఆయన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. పైలట్‌తో పాటు, మహారాష్ట్రలోని యావత్మల్‌కు చెందిన ఒక జంట, వారి రెండేళ్ల కుమార్తె మరణించారు. రవాణా వ్యాపారవేత్త రాజ్‌కుమార్ జైస్వాల్, అతని భార్య శ్రద్ధ, వారి రెండేళ్ల కుమార్తె కాశీగా గుర్తించారు. జూన్ 12న జైస్వాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి యావత్మల్‌లోని వాని నుండి కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించడానికి బయలుదేరారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినోద్ దేవి (66), తుష్టి సింగ్ (19)లతో పాటు బద్రీనాథ్‌ఉత్తరాఖండ టెంపే ట్రస్ట్ సభ్యుడు విక్రమ్ సింగ్ రావత్ కూడా మృతి చెందారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com